రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 250 | ఆదివారం | 09-08-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ''ఛాత్రో కీ గూంజ్'' సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ



## ఏ సాగునీటి ప్రాజెక్టూ
# నిలిచిపోవద్దు


**భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వం**

- ప్రాధాన్యతా ప్రాతిపదికన రూ.5000 కోట్లు సమకూర్చేందుకు సిఎం హామీనిచ్చారు
- ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు అవసరమో ప్రతిపాదనలు పంపండి
- కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్లతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్ట్‌లకు సంబంధించి భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వబోమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ (ఎల్ఎ), పునరావాసం–పునర్నిర్మాణం (ఆర్ అండ్‌ఆర్) కోసం ప్రాధాన్యత ప్రాతిపదికన రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు సిఎం ఎ. రేవంత్ రెడ్డి హామీనిచ్చారని, ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియలో ఉన్నదని వివరించారు. నిధుల కొరత కారణంగా చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదన్నారు. ''కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల'' జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల అంశంపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి,కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు,రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం నాలుగు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల తరువాయి 8లో

## దేశానికి యువతరమే
# గొప్ప శక్తి



- వారి సామర్థ్యానికి ప్రపంచవ్యాప్తంగా సాటి లేదు
- విద్యారంగ విలువలు క్షీణించాయి, విద్యార్థుల యోగ్యతా పత్రాలకు విలువలేదు
- ఉపాధి అవకాశాలు మూసుకుపోయాయి
- చీకటిలో వెలుగు నింపి, దేశంలో పెద్ద మార్పు తెచ్చింది యువతరం
- 'ఛాత్రో కీ గూంజ్' సభలో రాహుల్‌గాంధీ

**ప్రయాగ్‌రాజ్ :** భారతదేశానికి యువతరమే అతిపెద్ద బలం అనీ, ప్రపంచంలో ఎక్కడాలేని సాటిలేని సామర్థ్యం దేశానికి అదేనని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని కె.పి గ్రౌండ్‌లో ''ఛాత్రో కీ గూంజ్'' (విద్యార్థుల గళం) పేరుతో శనివారం జరిగిన భారీ సభలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, ''మీరే శక్తి,మీరే దేశానికి గర్వకారణం,మీరే దేశానికి గొప్పబలం, నేను మీకు ఈ విషయం చెప్పానంటే దేశంలో ప్రతి పౌరుడితోనూ ఈ విషయం గురించి చెప్పినట్టే'' అన్నారు. ''దర్ద్(బాధ), డేటా (పచ్చినిజాలు, విశ్లేషణాత్మక గణాంకాలు), దౌలత్ (సంపద) గురించిన వివరాలను నేను మీతో ఈ సాయంత్రంవేళ పంచుకోవాలనుకుంటున్నాను'' అంటూ దేశంలో నిరుద్యోగం,విద్యారంగ దుస్థితి,సాంకేతికత పేరుతో యువతరం కోల్పోతున్న అవకాశాలు,ఇటీవలి విద్యార్థి ఉద్యమం వంటి అనేక అంశాల గురించి రాహుల్‌గాంధీ వివరంగా ప్రసంగించారు. దేశ జనాభాలో 40 కోట్లమంది యువతరమే ఉందని, వీరంతా భారతదేశానికి అతిపెద్ద శక్తిగా ఉన్నారన్నారు. ఈనాడు అమెరికా,చైనా,రష్యా దేశాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారని, ఐనా గానీ ప్రపంచంలో ఎవ్వరికీ సాటిలేని శక్తిసామర్థ్యం,అతిపెద్ద బలం మనదేశానికి యువతరమేనని ఉద్ఘాటించారు. దేశంలో విద్యారంగ విలువలు దారుణంగా క్షీణించిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ''ఈనాడు విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్‌లకు తరువాయి 8లో



'బద్లావ్ జరూరీ హై' పేరుతో జాతీయ పిలుపులో భాగంగా మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో పాదయాత్ర చేస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో, మహారాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి సుభాష్ లాండే. ఈ యాత్ర బిందు చౌక్ నుంచి దసరా చౌక్ వరకు సాగింది.


హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్‌లో 'బద్లావ్ జరూరీ హై' పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నర్సింహా

## అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్
# స్వతంత్రంగా వ్యవహరించాలి

- దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలి
- అలీన విధానాన్ని పునరుద్ధరించాలి
- 'ఇరాన్‌పై అమెరికా యుద్ధం – భారత్‌పై ప్రభావం' సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం/హైదరాబాద్

అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తూ దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నెహ్రూ హయాంలో భారత్ అనుసరించిన అలీన విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ( (ఇస్కఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఇస్కఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం తరువాయి 12లో

## పోలీసు చర్యపై షా, చందా చోరీపై మోదీ
# ప్రకటన చేయాల్సిందే



**పార్లమెంట్‌లో విపక్ష ఎంపిలను ఎదుర్కొనే ధైర్యం లేకే ఈ ద్వయం సభలకు రావడం లేదని కాంగ్రెస్ ధ్వజం**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వార్షాకాల సమావేశాలు ప్రారంభమైన 15 రోజులు ముగిసినా ఉభయసభల్లో విపక్ష సభ్యుల నిరసనల కారణంగా సభా కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. దీనిపై కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండింది. విద్యార్థులపై పోలీసుల 'క్రూరత్వం'పై ఎంపిలను ఎదుర్కొని ప్రశ్నలకు సమాధానమిచ్చే ధైర్యం హోం మంత్రి అమిత్ షాకు తరువాయి 8లో

## యుపిఐ లావాదేవీలకు చార్జీలు ఉండవు

**కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టీకరణ**




**న్యూఢిల్లీ :** వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలకు ఎలాంటి చార్జీలు ఉండవని యుపిఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) అమల్లోకి వచ్చినా వ్యాపారులందరికీ వర్తించదని తెలిపింది. నిర్ణీత పరిమితి దాటి చేసే లావాదేవీలకు మాత్రమే నామమాత్రపు రేటుతో ఎండిఆర్ వర్తిస్తుందని తరువాయి 8లో

# ఒకరికి శిక్ష.. మరొకరికి సన్మానం

## ఒకే పనిలో ద్వంద్వ వైఖరి


(బిరుదరాజు వాసుదేవరాజు)



**మొహర్రంలో పాల్గొన్న పోలీసుపై వేటు**
**కావడి యాత్రలో పాల్గొన్న మరో పోలీసుకు సన్మానం**

**దేశంలో రెండు చట్టాలను అమలు పరుస్తున్న బిజెపి ప్రభుత్వం**

**భగ్గుమంటున్న లౌకికవాదులు**

బందోబస్తులో ఉన్న ఇద్దరు పోలీసు అధికారులు వేరు వేరు వర్గాలకు చెందిన మత ఊరేగింపులో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. వీరిద్దరు ఒకే రకమైన చర్యకు పాల్పడగా అందులో ఒక పోలీసు అధికారికి ప్రభుత్వం శిక్ష వేయగా..మరో అధికారికి మాత్రం సన్మానం అందింది. భారతదేశంలో చట్టం అందరికి సమానమనే రాజ్యాంగ విలువను ఈ ఉదంతం తీవ్ర విమర్శలకు దారి తీసింది. బీహార్‌లో మొహర్రం ఊరేగింపులో బందోబస్తులో పోలీసు యూనిఫారంలో కత్తి ప్రదర్శన చేసిన సబ్ ఇన్‌స్పెక్టర్ ముస్తకీఫ్ ఖాన్ పై అక్కడి ప్రభుత్వం, ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అచ్చం ఇదే రీతిలో ఉత్తరప్రదేశ్‌లో 'కావడి మత యాత్ర'లో తరువాయి 8లో


బోనాల పండుగ శుభాకాంక్షలు
BHARAT SEVA KENDRA
BECOME A CHANNEL PARTNER
BUILD A LEGACY SERVE THE NATION
GROW WITH BHARAT SEVA
BMP VENTURES PVT LTD
Ph: +91 72860 99245, +91 70367 99245
www.bharatsevakendra.com www.bharatmediapoint.com
Plot No. 471, Road No.36, Jubilee Hills,
Hyderabad-500033, Telangana, India (Bharat).
BHARAT SEVA
PHYSICAL & VIRTUAL PLATFORM
SERVICE DOMAINS
Government & Citizen Services Under One Roof
BHARAT MEDIA POINT — Complete Media Solutions & Advertising Hub
BHARAT NEWS — Fast, Facts, Fearless – News for Every Citizen
BHARAT FM — Connecting Hearts through Information, Entertainment & Inspiration
BHARAT BAZAAR — Local to Global Marketplace for Products & Services
LOCATIONS
EVERY MANDAL HEADQUARTERS IN
AP | TS | KARNATAKA





## కత్తుల్లాంటి కోరలు..



అత్యంత ప్రమాదకరమైన చేపలకు పెద్ద దవడలు, భారీ నోళ్లు ఉంటాయని అనుకుంటాం. కానీ ప్రకృతి, అనేక రకాలుగా మనిషి ఊహలకు అందని షాక్‌లు ఇస్తుంది. అలాంటి విశేషంగానే పయారా చేపల గురించి చెప్పుకోవాలి. వీటి నోటినుంచి బయటకు కనిపించే రెండు పొడవైన, కత్తి లాంటి కోరలు ఉంటాయి. వీటిని చూస్తే, చేప నోటి నుంచి చిన్న కత్తులు బయటకు వచ్చినట్టుగా అనిపిస్తుంది. పయారా చేపలు తమ ఈ భారీ కోరలను ఉపయోగించి వేగంగా కదిలే చిన్న చేపలను గుచ్చి పట్టుకుంటాయి. ఆ తర్వాత వాటిని ముక్కలుగా చింపకుండా, సాధారణంగా మొత్తంగా మింగేస్తాయి. అందుకే వీటిని 'వేటలో అగ్రగణ్యులు'గా పేర్కొంటారు. ప్రమాదకరమైన చేపగా ఉండటానికి పెద్ద దవడలు లేదా భారీ పళ్లు అవసరం లేదని, కొన్నిసార్లు రెండు పొడవైన కోరలే చాలని పయారా చేపలు నిరూపిస్తున్నాయి.

## జీవకళ ఉట్టిపడే చిత్రాలు







ఇక్కడ కనిపిస్తున్నవి అత్యాధునిక కెమెరాతో బంధించిన నాణ్యమైన డిజిటల్ ఫొటోలు అనుకుంటే పొరపాటే. నిజానికి ఇలాంటి చిత్రాలను వేయడంలో చైనాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు లెంగ్ జున్ తన ప్రతిభాపాటవాలను చాటుకుంటున్నాడు. తన అసాధారణమైన హైపర్ రియలిస్టిక్ ఆయిల్ పెయింటింగ్‌లతో ప్రపంచ కళారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఆయన చిత్రాలను తొలిసారి చూసినప్పుడు అవి ఫొటోలు అనిపించడం సహజం. కానీ అవి కెమెరా సృష్టించిన చిత్రాలు కావు. ప్రతి సూక్ష్మ వివరాన్ని ఆయిల్ రంగులతో, అపారమైన సహనం, పరిశీలనా శక్తి, సాంకేతిక నైపుణ్యంతో కాన్వాస్‌పై ఆవిష్కరించిన కళాఖండాలు. 2004లో లెంగ్ జున్ చిత్రించిన 'మొనా లీసా:ది డిజైన్ ఆఫ్ స్మైల్' ప్రపంచంలోని అత్యంత వాస్తవిక చిత్రాల్లో ఒకటిగా ప్రశంసలు పొందింది. లియోనార్డో దా విన్సీ ప్రసిద్ధ మోనాలిసా చిత్రాన్ని స్ఫూర్తిగా తీసుకున్నప్పటికీ, ఆయన దానిని పూర్తిగా తన ప్రత్యేక శైలిలో పునర్నిర్మించాడు. అసలు మోనాలిసాలో లియోనార్డో ఉపయోగించిన స్ఫుమాటో పద్ధతి రంగులను మృదువుగా కలిపి ముఖంలో సహజమైన లోతు, రహస్యమైన చిరునవ్వును సృష్టిస్తుంది. దీనికి భిన్నంగా లెంగ్ జున్ తన చిత్రంలో ప్రతి అంశాన్ని అత్యంత స్పష్టతతో చూపించాడు. వెంట్రుకల తీగలు, చర్మంలోని సూక్ష్మ నిర్మాణం, కళ్లలోని ప్రతిబింబాలు, దుస్తుల నూలు దారా లు, చిన్న నీడల మార్పులు వరకు ఆయన అద్భుతమైన ఖచ్చితత్వంతో చిత్రించాడు. హైపర్ రియలిజం అంటే కేవలం ఫొటోను అనుకరించడం కాదు. మన కళ్లకు సాధారణంగా కనిపించని సూక్ష్మ వివరాలను కూడా కళాత్మకంగా ఆవిష్కరించడం. కాంతి, నీడ, రంగుల మార్పులు, ఉపరితల లక్షణాలను లోతుగా అధ్యయనం చేసి వాటిని కాన్వాస్‌పై జీవంతో నింపడం ఈ శైలిలోని ప్రత్యేకత.

## గురుత్వాకర్షణతో విద్యుత్ నిల్వ!



చైనాలోని పర్వత ప్రాంతంలో నిర్మించిన 148 మీటర్ల ఎత్తైన ఒక భారీ టవర్‌ను చూస్తే అది సాధారణ గగనచుంబి భవనం అనిపించవచ్చు. కానీ ఇది కార్యాలయం కాదు, నివాస సముదాయం కాదు. విద్యుత్‌ను నిల్వ చేయడానికి రూపొందించిన ఆధునిక గురుత్వాకర్షణ ఆధారిత శక్తి నిల్వ వ్యవస్థ. పునరుత్పాదక ఇంధన రంగంలో లిథియం అయాన్ బ్యాటరీలకు ప్రత్యామ్నాయంగా ఈ సాంకేతికతపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రకృతి పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. సూర్యకాంతి ఎక్కువగా ఉన్నప్పుడు లేదా గాలి వేగంగా వీచినప్పుడు విద్యుత్ అధికంగా ఉత్పత్తి అవుతుంది. కానీ ఆ సమయంలో వినియోగం తక్కువగా ఉండవచ్చు. రాత్రి వేళల్లో లేదా గాలి తగ్గినప్పుడు ఉత్పత్తి పడిపోతుంది. అందువల్ల అదనపు విద్యుత్‌ను నిల్వ చేసి, అవసరమైన సమయంలో ఉపయోగించడం పునరుత్పాదక ఇంధన వ్యవస్థలకు కీలకంగా మారింది. ప్రస్తుతం ఈ అవసరాన్ని ప్రధానంగా లిథియం అయాన్ బ్యాటరీలు తీరుస్తున్నాయి. అయితే వాటి తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి ఖనిజాలు పరిమితంగా ఉన్నాయి. వాటి ఉత్పత్తి, రీసైక్లింగ్ ప్రక్రియలు పర్యావరణంపై ప్రభావం చూపుతాయి. ఈ సమస్యలకు ప్రత్యామ్నాయంగా గురుత్వాకర్షణ శక్తి నిల్వ వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. ఈ విధానంలో విద్యుత్ అధికంగా లభించే సమయంలో భారీ కాంక్రీట్ బ్లాకులను క్రేన్ల సహాయంతో టవర్ పైభాగానికి ఎత్తుతారు. అప్పుడు విద్యుత్ శక్తి గురుత్వ స్థితిజ శక్తిగా మారుతుంది. తరువాత విద్యుత్ అవసరం పెరిగినప్పుడు ఆ బ్లాకులను నెమ్మదిగా కిందికి దింపుతారు. వాటి బరువు వల్ల ఉత్పత్తి అయ్యే యాంత్రిక శక్తి జనరేటర్లను తిప్పి తిరిగి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఆలోచన కొత్తదేమీ కాదు. జలవిద్యుత్ నిల్వ కేంద్రాల్లో కూడా ఇదే సూత్రాన్ని ఉపయోగిస్తారు. అక్కడ ఎత్తైన ప్రాంతంలో నీటిని నిల్వచేసి, అవసరమైనప్పుడు కిందికి వదిలి టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. అయితే గురుత్వాకర్షణ టవర్లలో నీటి స్థానంలో భారీ ఘన బ్లాకులను ఉపయోగించడం ప్రత్యేకత.

## ఈ కొండ పేరులో 85 అక్షరాలు!

'తమాటావాకటంగిహంగకోవౌవోటమటేటురిపుకకపికిమౌంగహోరోనుకుపోకైవెనువాకిటనటాహు'((Taumatawhakatan gihangakoauauotamateaturi pukakapiki maung ahoronukupokai whenuakitanatahu)అనేది న్యూజిలాండ్‌లోని హాక్స్ బే ప్రాంతంలో ఉన్న ఒక చిన్న కొండకు ఉన్న పేరు. ప్రపంచవ్యాప్తంగా తన అసాధారణమైన పేరుతో ప్రసిద్ధి చెందింది. ఈ కొండ పూర్తి పేరులో 85 అక్షరాలు ఉన్నాయి. ఇది మావోరీ భాషకు చెందిన పేరు. 'పెద్ద మోకాళ్లు కలిగిన, పర్వతాలను అధిరోహించిన వీరుడు తమాటే తన ప్రియమైన వ్యక్తి జ్ఞాపకార్థం తన మావోరీ వేణువు 'కోవౌవు'ను వాయించిన కొండ శిఖరం' అని దీని అర్థం. మావోరీ సంస్కృతిలో స్థలాల పేర్లు కేవలం గుర్తింపుకోసం మాత్రమే ఉండవు. ఆ ప్రదేశానికి సంబంధించిన చరిత్ర, పురాణం, వ్యక్తుల కథలను కూడా పేర్లలోనే నిక్షిప్తం చేస్తారు. అందుకే కొన్ని పేర్లు వాఖ్యాలంత పొడవుగా ఉంటాయి. ఈ కొండ పేరు కూడా ఒక వీరుడి జ్ఞాపకగాథను మోస్తుంది. న్యూజిలాండ్ ఉత్తర ద్వీపంలోని పోరంగాహౌ సమీపంలో ఉన్న ఈ కొండ పెద్దది కాకపోయినా, దాని పేరు కారణంగా ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో అత్యంత పొడవైన అధికారిక భౌగోళిక పేర్లలో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. స్థానికులు సాధారణంగా దీనిని 'టౌమాటా' అని సంక్షిప్తంగా పిలుస్తారు. ఏదిఏమైనా, ఈ పేరు కేవలం ఒక కొండకు ఇచ్చిన గుర్తింపు కాదు... ఇది మావోరీ భాష, సంస్కృతి, చరిత్రలను ఒకే పదంలో భద్రపరిచిన అరుదైన భాషా వారసత్వం.




– బిఎస్ఎస్ మైత్రేయి

# త్రిపక్ష సంయుక్త రక్షణ ఒప్పందం పర్యవసానాలు

శుక్రవారంనాడు ముస్లింల పవిత్రస్థలం మక్కాలో మూడు భిన్నమైన ముస్లిం రాజ్యాలు – సౌదీ అరేబియా, టుర్కియె (టర్కీ), పాకిస్థాన్ సంతకాలు చేసిన త్రిపక్ష సంయుక్త రక్షణ ఒప్పందం ప్రభావవంతమైంది, పర్యవసానాలతో కూడినది. ఇది కేవలం ఆత్మరక్షణ ఒప్పందం మాత్రమేనని, ఏ మూడవ పక్షానికీ వ్యతిరేకంగా ఉద్దేశించిందికాదని సంతకందారులు చెబుతున్నప్పటికీ, ఆ ఒప్పందం కేవలం 'కాగితం ఒప్పందం కాదు'. అయితే ఇప్పుడు దీని అవసరం ఎందుకు ఏర్పడింది, పర్యవసానాలేమిటన్నది నింపాదిగా, లోతుగా ఆలోచించదగిన అంశం.

సౌదీ యువరాజు, ప్రధాని మొహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్, పాకిస్థాన్ ప్రధాని సెహబాజ్ షరీఫ్ ఏ రాజధాని నగరంలో కాకుండా మతవిశ్వాస ప్రదేశంలో ఒప్పందంపై సంతకాలు చేయటం వ్యూహాత్మకం. ఇది ఇరాన్‌కు పోటీగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఉద్దేశించిన సాంప్రదాయక పొత్తు కాదని, ఇస్లామిక్ సంఘీభావం, ఉమ్మడి సమష్టి రక్షణ ధ్యేయంతో కూడిన చర్యగా తమతమ దేశాల్లో, ప్రాంతీయంగా ప్రచారం చేసుకోవటానికి వీలుగా సంతకాలకు మక్కాను ఎంచుకున్నారు. ఇందులో ప్రధానమైన అంశం – ఒప్పంద భాగస్వాముల్లోని ఏ ఒక్క దేశంపై ఎవరు దాడిచేసినా అందరిపై దాడిగా పరిగణించబడుతుంది'' అనే సూత్రీకరణ. ఈ రకమైన భాష సాధారణంగా నాటో ఒడంబడిక ఆర్టికల్ 5లో ఉంది. ఇది ''ఇస్లామిక్ నాటో'', ''సున్నీ నాటో'' అనే వ్యాఖ్య లు వెనువెంటనే వచ్చాయి. ఈ మూడు ''సున్నీ'' దేశాల్లో సౌదీ అరేబియా గల్ఫ్‌లో ఆర్థికంగా శక్తివంతమైంది, టర్కీ నాటోలో రెండవ పెద్ద సైనిక శక్తి, పాకిస్థాన్ దక్షిణాసియాలో అణ్వాయుధం కలిగిన దేశం. దోహాలో హమస్ నాయకులపై ఇజ్రాయెల్ దాడిచేసిన అనంతరం 2025 సెప్టెంబర్‌లో సౌదీ అరేబియా–పాకిస్థాన్ మధ్య కుదిరిన ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం పొడిగింపు తాజా త్రిపక్ష ఒప్పం దం అనవచ్చు. ఈ ఒప్పందంలో ఇతర ప్రాంతీయ రాజ్యాలు చేరవచ్చునని టుర్కియె అధికారులు అంటున్నారు.

ఫిబ్రవరి 28నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధం ఈ ఒప్పందాన్ని వేగిరపరిచిందనవచ్చు. ఐదు మాసాలు గడిచినా అమెరికా ఇరాన్ మెడలు వంచలేకపోయింది. పర్యవసానంగా ఇరాన్ తన ప్రతీకార దాడులను గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై, సౌదీ తదితర దాని మిత్ర రాజ్యాలపై ఎక్కుపెట్టింది. అమెరికా ప్రతిఘటన కొరవడటంతో దాని సైనిక అండపై ఆధారపడిన గల్ఫ్ దేశాల్లో అమెరికాపై నమ్మకం సన్నగిల్లింది. సౌదీతో పౌర అణుశక్తి ఒప్పందం కుదుర్చుకున్న అధ్యక్షుడు ట్రంప్, దానిపై సిరా ఆరకముందే, అబ్రహం ఒప్పందాలను (ఇజ్రాయెల్‌తో సహజీవనం) రియాద్ అంగీకరిస్తేనే అణుశక్తి సహకార ఒప్పందం అమలు జరుగుతుందని ప్రకటించి సౌదీ పాలకులను దిగ్భ్రాంతి పరిచారు. మరోవైపున, సౌదీ–హౌతీ శాంతి ఒప్పందం విఫలం కావటం. కొద్దిరోజులముందు, ఇరాన్ అండకలిగిన హౌతీ దళాలు ఎమెన్ ప్రభుత్వ సైనికులను పెద్దసంఖ్యలో చంపాయి. జిజాన్, యాండుల్లో సౌదీకి చెందిన అరాంకో ఆయిలు వసతులపై మిస్సైలీలు, డ్రోన్‌లు ప్రయోగించాయి. పాకిస్థాన్‌కు సంబంధించి అది ఫిబ్రవరినుంచీ అఫ్ఘానిస్థాన్‌తో సరిహద్దు పోరాటం సాగిస్తోంది. 2025 మే నెలలో భారత్‌తో దాదాపు యుద్ధం దశకు పరిస్థితులు క్షీణించాయి. టర్కీకి సంబంధించి అత్యంత బలమైన సాంప్రదాయక సైనిక శక్తిగా ముస్లిం ప్రపంచంలో తన స్థానాన్ని పటిష్టం చేసుకోవచ్చు. ఆయుధ వ్యాపారం పెంచుకోవచ్చు. రియాద్, ఇస్లామాబాద్‌లతో ఆర్థిక సంబంధాలు వృద్ధి చెందుతాయని అంకారా ఆశిస్తోంది. ఇజ్రాయెల్ వద్ద అణ్వాయుధాలున్నట్లు భావిస్తున్న తరుణంలో అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్ కౌంటర్ వెయిట్‌గా గల్ఫ్‌లోకి ప్రవేశించటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌కు వ్యతిరేకంగా బలాన్ని సమతులనపరచటం, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆత్మరక్షణ శక్తిని నిర్మించటం ఈ ఒప్పందం తక్షణ ప్రయోజనంగా కనిపిస్తున్నది.

ఈ ఒప్పందం సౌదీ అరేబియాకు భద్రత చేకూర్చదని ''షియా'' ఇరాన్ వ్యాఖ్యానించింది. ఇన్ని సంవత్సరాలు అమెరికాపై ఆధారపడటం భద్రత కలిగించిందా అని ప్రశ్నించింది. రక్షణ కోసం మీ విధానాలు సంస్కరించుకోండి అని పరోక్ష సలహా ఇచ్చింది. అంటే హౌతీలు, ఇరాకీ మిలీషియా ద్వారా సౌదీపై ఒత్తిడి కొనసాగుతుందని హెచ్చరిక చేసింది. కాగా గాజా, సిరియాలపై టర్కీ–ఇజ్రాయెల్‌ల మధ్య ఘర్షణ పెరుగుతున్న దశలో ఈ ఒప్పందం నెతన్యాహూకు గట్టి హెచ్చరిక అవుతుంది. అంతేగాక ఇరాన్ ఇతర మిత్రులకు వ్యతిరేకంగా, గాజాపై దాడులకు దిగే ముందు ఇజ్రాయెల్ ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సి రావచ్చు. అబ్రహం ఒప్పందాలను ఆమోదించాలన్న అమెరికా ఒత్తిడినుంచి సౌదీ అరేబియా దూరం జరగవచ్చు.

భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ గత సంవత్సరం సౌదీ–పాకిస్థాన్ రక్షణ ఒప్పందంనాడు స్పందించినట్లే ఇప్పుడు కూడా ఈ పరిణామాన్ని ''జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం'' అని వ్యాఖ్యానించింది. మన దేశ ఇంధన అవసరాలకు, ప్రవాస ఉద్యోగాలకూ సౌదీ భారత్‌కు కీలకం. అలాగే 2025 మే నెలలో పాకిస్థాన్ తో సరిహద్దు ఘర్షణల సమయంలో టర్కీ భారత్ వ్యతిరేక వైఖరి తీసుకుంది. అందువల్ల ఈ తాజా త్రైపాక్షిక రక్షణ ఒప్పందం భారత్ రక్షణ ఎష్టాబ్లిష్‌మెంట్‌ను తప్పక అప్రమత్తం చేస్తుంది. ●


# కష్టజీవులకోసం ఎత్తిన ఎర్రబావుటా దాసరి జీవితం

## కొమ్మన నాగేశ్వరరావు

కామ్రేడ్ దాసరి నాగభూషణరావు వృత్తిరీత్యా విప్లవకారుడు. ఉద్యమం ఆయన ఊపిరి. పోరాటం ఆయన శ్వాస. అవినీతి మరక అంటని ఆరు దశాబ్దాల త్యాగపూరిత రాజకీయ జీవితం ఆయనది. జీవితమంతా పీడిత ప్రజల అభ్యున్నతికే వెచ్చించిన కమ్యూనిస్టు యోధుడు. ఆదర్శ కమ్యూనిస్టుగా, భూపోరాటాల యోధుడుగా జగమెరిగిన కామ్రేడ్ దాసరి విద్యార్థి దశలోనే ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారు. 1926 ఆగస్టు 10వ తేదీన నూజివీడు తాలూకా దిగవల్లి గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. నూజివీడు హైస్కూల్లో చదువుకుంటూ జాతీయ భావాలకు ప్రభావితులయ్యారు. జాతీయ సేవాసమితి అనే సంస్థను ఆర్గనైజ్ చేసి విద్యార్థులలో జాతీయ భావాలను పెంపొందించారు. ఆ దశలోనే తమ్మారెడ్డి సత్యనారాయణ ప్రోత్సాహంతో ఎఐఎస్‌ఎఫ్‌లో చేరారు. తరువాత జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. గుంటూరు ఎ.సి.కాలేజిలో బి.ఎ.లో చేరి ప్రిన్సిపాల్ సైప్స్ డిటెన్షన్ విధానానికి, జాతీయ నాయకుల పట్ల చులకన భావానికి నిరసనగా ఆగస్టు 15న జాతీయ జెండా ఎగురవేయబోతున్న సైప్స్‌ను ప్రతిఘటించారు. దీనితో దాసరిని, మరికొందరిని కాలేజి నుంచి బహిష్కరించి, తరువాత విచారణ జరిపి ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఏ కాలేజీలోను చదువుకునే అవకాశం లేకుండా సిండికేట్ తీర్మానం చేసింది. నిషేధం ఎత్తివేయాలని ఎ.సి.కాలేజి చరిత్రలో 43రోజులు సమ్మె జరిగింది. దాసరి గుంటూరులోనే ఉంటూ ఆంధ్ర రాష్ట్ర సాధన ఉద్యమం నిర్వహిస్తూ రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికైనారు. 1948–51 కాలంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురికావటంతో అజ్ఞాత జీవితంలో ఉంటూ రహస్యంగా విద్యార్థి ఉద్యమాన్ని నడిపారు. శేఖర్ అనే గుప్త నామంతో ఏలూరు కేంద్రంగా ఎఐఎస్ఎఫ్ కార్యక్రమాలు నిర్వహించారు. 1951అజ్ఞాతవాసం నుండి బయటకు వచ్చి జిల్లాలో మొట్టమొదటి బహిరంగసభ పోతురెడ్డిపల్లిలో పాల్గొన్నారు. కలకత్తాలోని ''బంగ్‌బాసే'' కళాశాలలో చదివి బి.ఎ. పూర్తి చేశారు. ఎ.ఐ.ఎస్.ఎఫ్. ప్రధాన కార్యదర్శిగా కలకత్తా నుండి తన కార్యకలాపాలను దేశమంతా నిర్వహించారు. 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహారదీక్షకు మద్దతుగా విద్యార్థి ఉద్యమానికి దాసరి నాయకత్వం వహించారు.దీక్షలో ఉన్న శ్రీరాములు దాసరికి శాంతియుతంగా ఉద్యమం నిర్వహించాలని ఒక లేఖ సైతం రాశారు.

1955 ఎన్నికలలో నూజివీడు అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన దాసరి పార్టీ నిర్మాణరంగంలో అడుగుపెట్టారు. 1955లో నూజివీడు తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఎన్నికై 1964 చివరి వరకు పనిచేశారు. సింబాలిక్ ఉద్యమాలకు వ్యతిరేకంగా ఉండేవారు. ఒక సమస్యలో తలదూర్చితే చివరికంటా దాని అంతు చూడాలనే తత్వం దాసరిది. పనిలో సోమరితనం, వాయిదాలు వేయటం, ఉదాసీనంగా వ్యవహరించటాన్ని దాసరి తీవ్రంగా ఖండించేవారు. పార్టీ చర్చలలో నిర్మొహమాటంగా, స్పష్టంగా, కొట్టినట్లు చెప్పటం దాసరికి అలవాటు.

ఫ్యూడల్ వ్యవస్థకు గట్టి పునాదులు ఉన్న నూజివీడు తాలూకాలో పెత్తందార్లు, మొఖాసాదార్లు, జమిందారులదే రాజ్యంగా ఉండేది. దాసరి వచ్చిన తరువాత జమిందార్ల, మొఖాసాదార్ల దౌర్జన్యాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాలూకాలో సాగుకు లాయకైన బంజరు భూములు, అడవి బంజర్ల ఆక్రమణ ఉద్యమానికి దాసరి శ్రీకారం చుట్టారు. అనేక గ్రామాలలో ఈనాం భూములు, చెరువు పోరంబోకు భూములు, సాముదాయక భూముల ఆక్రమణ ఉద్యమం ఉవ్వెత్తున ప్రారంభమైంది. త్వరలో జమిందారీ విధానం రద్దు అవుతుందని గ్రహించిన జమిందారులు గోభూములు, అడవులు, సాముదాయక భూములు అమ్మి సొమ్ము చేసుకోవటం, సెటిల్‌మెంటు కోర్టులో దొంగపట్టాలు సృష్టించటం ప్రారంభించారు. జమిందారులకు పట్టా ఇచ్చే హక్కు ఉన్నందున వారు పలు అక్రమాలకు ఒడిగట్టారు. దీనితో కమ్యూనిస్టు పార్టీ భూముల ఆక్రమణకు పిలుపునిచ్చింది. 1955 తరువాత భూఆక్రమణోద్యమం దాసరి నాయకత్వంలో ద్విగుణీకృతంగా సాగింది. గత 70 ఏళ్ళ కాలంలో నూజివీడు తాలూకాలో 30వేల ఎకరాల బంజరు భూములను ఆక్రమించి పేదలకు పంపిణీ చేసే కార్యక్రమం కమ్యూనిస్టు పార్టీ సాగించింది. 1971 వరకు దాసరి ప్రత్యక్ష నాయకత్వంలో ఈ ఉద్యమం సాగగా తరువాత ఆయన పర్యవేక్షణలో ఈ ఉద్యమం సాగింది. నూజివీడు తాలూకా భూ ఆక్రమణ పోరాటాలకు రాష్ట్రంలోనే గొప్ప చరిత్ర ఉంది. 1969 –70 ప్రాంతంలో 13వేల ఎకరాల భూములను ఫారెస్టు నుండి తొలగించి పేద ఆక్రమణదారులకు పట్టాలు ఇవ్వటం కమ్యూనిస్టు పార్టీ, దాసరి నాయకత్వం వలననే సాధ్యమైంది. ''పట్టాలివ్వండి – లేదా జైలు కూడు పెట్టండి'' నినాదంతో సత్యాగ్రహ ఉద్యమాన్ని దాసరి ప్రత్యక్ష నాయకత్వంలో ప్రారంభించి ఈ పట్టాలను సాధించటం జరిగింది. 1985 దశకంలో దాసరి ప్రోత్సాహంతో ''చెట్లు లేని అడవుల్లో చెట్టు పట్టాల''కై నూజివీడు ప్రాంతంలో ఉద్యమం జరిగింది. నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు 2,600ఎకరాలు అడవి భూమిని 5,000 మంది సాగుదార్లకు చెట్టు పట్టాలు ''తెలుగు మాగాణి సమారాధన'' పేరుతో పంపిణీ చేశారు. ఈ పోరాటంలో సి.పి.ఐ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు సైతం ప్రత్యక్షంగా పాల్గొని నాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీని కలిసి భూసమస్యను వివరించి చెట్టు పట్టాలు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. 1996లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రాష్ట్ర సి.పి.ఐ కార్యదర్శిగా ఉన్న దాసరి నాగభూషణరావు చెక్కపల్లి, యనమదుల గ్రామాలకు తీసుకువచ్చి వన సంరక్షణ సమితులను ప్రారంభించారు. ''భూమి కోసం పోరాటం కాదు – భూమి మీద పోరాటం'' సాగించమని ఇచ్చిన పిలుపుతో నూజివీడు ప్రాంతంలో వేలాది ఎకరాల బంజరు భూములను కమ్యూనిస్టు పార్టీ పంట భూములుగా మార్చివేసింది. ఈ ఉద్యమానికి దాసరి స్ఫూర్తిగా నిలిచారు. ఆనాడు తినటానికి తిండిలేక, పస్తులతో, అర్ధాకలితో కులవృత్తులపై ఆధారపడిన 40 గ్రామాల పేదలను భూ యజమానులుగామార్చిన ఘనత దాసరిది, కమ్యూనిస్టు పార్టీది అనటంలో అతిశయోక్తి లేదు.




నూజివీడులో సోమవారం(10వ తేదీ)నాడు ఆవిష్కరించనున్న కామ్రేడ్ ఎస్.ఆర్.దాసరి విగ్రహం

కామ్రేడ్ దాసరి రాజకీయ జీవితంలో మరపురాని ఘటన లు రెండున్నాయి. ఒకటి 1975 లో జనవరి 27 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు విజయవాడలో సి.పి.ఐ 10వ మహాసభలు నిర్వహ ణ. ఈ మహాసభలకు ఆహ్వాన సంఘం కార్యదర్శిగా పనిచేసిన దాసరి ''నభూతో నభవిష్యతి''అన్నట్లుగా నిర్వహించి పార్టీ జాతీయ నాయకత్వం స్థాయిలో ఎంతో ప్రశంసలు పొందారు. ముగింపులో జరిగిన ప్రదర్శన దాసరి నిర్మాణ దక్షతకు గొప్ప ఉదాహరణ. 10వేలమంది సుశిక్షిత ఎర్ర చొక్కా వలంటీర్ల మార్చింగ్ చూచి తరించవలసిందే. రెండు లక్షల మంది ప్రజలు పాల్గొన్న సభ ఆ నాటికి అద్భుతం. రెండు సార్లు రాష్ట్ర శాసన సభకు, మూడుసార్లు పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించ లేకపోయిన దాసరి 1998మార్చిలో రాజ్యసభకు ఎన్నికైనారు. ఒక పార్లమెంటు సభ్యుడు ఎం.పి.నిధులను ప్రజా ప్రయోజనాలకు ఎలా ఖర్చు చేయవచ్చునో ఆచరణాత్మకంగా చేసి చూపించిన కామ్రేడ్ దాసరి. రాష్ట్ర వ్యాపితంగా నిధులను ఖర్చు చేసిన దాసరి 1013 పనులకు గాను 23కోట్ల రూపాయలను వెచ్చించారు. ఆయన రాజ్యసభ ఎం.పి.గా 100శాతం నిధులు వినియోగించి చరిత్ర సృష్టించారు. ఇక రెండవ అంశం 1973 ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం సందర్భంగా ఫాసిస్టు ఉద్యమాన్ని ప్రతిఘటించి రాష్ట్ర సమైక్యతకై అకుంఠిత దీక్షతో సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. ఈ ప్రతిఘటనోద్యమంలో మొక్కవోని ధైర్యంతో నిలబడ్డారు.

ఇక దాసరి కీర్తి కిరీటంలో కలికితురాయి ''చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్''. ప్రభుత్వం నుండి కొండాపూర్‌లో 5 ఎకరాల స్థలం సేకరించి 2 కోట్ల నిధితో 'వృద్ధుల ఆశ్రమం' నిర్మించటం చిరస్మరణీయమైనది. నూజివీడు, విజయనగరం, శ్రీకాకుళంలలో పార్టీ కార్యాలయాలు ''అమర్ భవన్ ''లు నిర్మాణం వెనుక దాసరి కృషి అనన్యసామాన్యమైనది. దాసరికి పార్టీయే జీవితం, పార్టీయే సర్వస్వం. మృత్యువుకు చేరువలో ఉన్నానని తెలిసికూడా ఆయన ధ్యాస అంతా పార్టీ, ప్రజా సంఘాలు, విశాలాంధ్ర, పార్టీ హోల్‌టైమర్ల చుట్టూ పరిభ్రమించింది. తండ్రి ద్వారా తనకు, పుట్టింటిద్వారా శ్రీమతి లక్ష్మీ గారికి వచ్చిన ఆస్తులు పార్టీకి ఖర్చు చేసిన వితరణశీలి కామ్రేడ్ దాసరి. ఆ రోజుల్లో శ్రీమతి లక్ష్మి గారి వద్ద మిగిలిన 30లక్షలతో నూజివీడులో ''మహిళా సదన్'' ప్రారంభించారు. విజయవాడలోని నేటి రాష్ట్ర పార్టీ కార్యాలయంకు 10లక్షలు విరాళం ఇచ్చారు. రెండెకరాల కొబ్బరితోటలో 1 ఎకరం సి.ఆర్.ఫౌండేషన్‌కు, మరో ఎకరం రాష్ట్ర పార్టీకి చెందే విధంగా వీలునామా వ్రాశారు.

సోషలిజం లక్ష్యంగా దిగవల్లి నుండి ఢిల్లీ వరకు సాగిన దాసరి జీవిత ప్రస్థానం కమ్యూనిస్టులకే కాక బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించే ప్రగతిశీల శక్తులందరికీ ఆదర్శ ప్రాయం, అనుసరణీయం. ఆయన కాంస్య విగ్రహాన్ని 2026 ఆగస్టు 10న నూజివీడు అమర్ భవన్‌లో ఆయన 50ఏళ్ళ ఉద్యమ సహచరుడు, సి.పి.ఐ. సీనియర్ నాయకులు చలసాని జగన్నాధరావు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సంస్మరణ సభలో తెలంగాణా సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎ.పి. రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. తాను పోతూ తరువాతి తరాన్ని ప్రభావితులను చేసిన కామ్రేడ్ దాసరి నాగభూషణ రావుకు ఘనంగా నివాళులు అర్పిద్దాం.

**(అధ్యక్షులు, అమర్ భవన్ సొసైటీ, నూజివీడు)**

# వార్తకు కూడా 'రాయల్టీ' కావాలి

స్మార్ట్ ఫోన్ల రాకతో సాంకేతికత కొత్త పుంతలు తొక్కింది. సోషల్ మీడియా వచ్చాక ప్రపంచ వ్యాప్త సమాచారమంతా ప్రజల అర చేతిలో చేరింది. ఎక్కడ, ఏ ఘటన జరిగినా.. క్షణాల్లో తెలిసిపోతున్నది. అయితే సమాచార సేకరణలో మీడియా సంస్థల పాత్రే కీలకం. కానీ గూగుల్, మెటా లాంటి పెద్ద కంపెనీలతోపాటు కొత్తగా పుట్టుకొస్తున్న ఏఐ సంస్థలు ఈ వార్తలను యథేచ్ఛగా వాడుకుంటున్నాయి. ఆయా పబ్లిషర్లకు ఎలాంటి పైసా చెల్లించకుండా రూ.కోట్లు గడిస్తున్నాయి. పత్రికలు, టెలివిజన్ చానళ్లను ఇప్పటికే సోషల్ మీడియా తీవ్రంగా దెబ్బతీసింది. ఇప్పుడు దీనికి ఏఐ తోడై కొత్త సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ఏఐ వల్ల వార్తను సేకరించిన మీడియా సంస్థకు ఆదాయం రావడం లేదు. కానీ ఆ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఏఐ కంపెనీలు తమ సేవలను మరింత బలోపేతం చేసుకుంటున్నాయి. ఈ అసమతుల్యతను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇప్పుడు కీలకమైన అడుగు వేసింది. పెద్ద డిజిటల్ ప్లాట్‌ఫారాలు, ఏఐ సేవలు నిర్వహించే సంస్థలు స్థానిక మీడియా సంస్థలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాలని సూచించింది. మొదట 2.25శాతం ప్రతిపాదించిన లెవీని తాజాగా 2.5 శాతానికి పెంచింది. ఒప్పందాలు చేసుకునే సంస్థలకు మాత్రం మినహాయింపులు ఇవ్వనుంది.

**ఆదాయంపై ప్రభావం..** వార్త అనేది కేవలం కొన్ని వాక్యాల సమాహారం కాదు. ఒక వార్త వెనుక విలేకరి శ్రమ, ప్రయాణం, పరిశోధన, ఎడిటర్ పరిశీలన, ఫోటోగ్రాఫర్ కష్టం, డెస్క్ సిబ్బంది కృషి, సాంకేతిక బృందం సహకారం, సంస్థ పెట్టుబడి ఉంటాయి. ఆ వార్తను ప్రచురించిన తర్వాత అదే సమాచారాన్ని ఏఐ సంస్థలు సేకరించి, కొన్ని క్షణాల్లో కొత్త రూపంలో కోట్లాది వినియోగదారులకు అందిస్తున్నాయి. ఫలితంగా అసలు సమాచారాన్ని రూపొందించిన మీడియా సంస్థకు ట్రాఫిక్ తగ్గిపోతున్నది. ఫలితంగా ప్రకటనల ఆదాయం పడిపోతున్నది. కానీ ఏఐ కంపెనీల వినియోగం, విలువ మాత్రం పెరిగిపోతున్నది.

**పోరాటం వైపు అడుగులు..**

ప్రపంచంలోని ప్రముఖ మీడియా సంస్థలు ఇప్పటికే ఈ సమస్యను తీవ్రంగా ప్రస్తావిస్తున్నాయి. న్యూయార్క్ టైమ్స్, అనేక అంతర్జాతీయ మీడియా సంస్థలు తమ కంటెంట్ వినియోగంపై చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించాయి. అంటే ప్రపంచ మీడియా ఇప్పటికే 'కంటెంట్‌కు విలువ' అనే అంశం పై కొత్త ఆర్థిక నమూనాను నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నది.

**భారత్‌లో కూడా అమలు చేస్తే..**

భారతదేశంలో మీడియా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. డిజిటల్ విప్లవం పుణ్యమా అని పత్రికల సర్క్యులేషన్ కూడా భారీగా తగ్గింది. ఆన్‌లైన్ వెబ్ సైట్ల ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయాన్ని సైతం ఏఐ సంస్థలు తమ అల్గారిథమ్స్ ద్వారా కొల్లగొడుతున్నాయి. పాఠకులు అడిగే ప్రశ్నలకు పబ్లిషర్ల కంటెంట్ నుంచే సమాధానాలు ఇస్తూ, కనీసం ఆయా వెబ్‌సైట్ల లింకులను కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. దేశంలో వేలాది ప్రాంతీయ పత్రికలు, డిజిటల్ న్యూస్ పోర్టళ్లు, స్థానిక వార్తా సంస్థలు అత్యల్ప వనరులతో పనిచేస్తున్నాయి. జిల్లా కేంద్రం నుంచి మండల స్థాయి వరకు వార్తలు సేకరించే విలేకరులే ప్రజాస్వామ్యానికి అసలు బలం. కానీ ఏఐ వ్యవస్థలు వీరి కంటెంట్‌ను కూడా పరోక్షంగా వినియోగిస్తున్నాయి. ఆ వార్తల ఆధారంగా సమాధానాలు రూపొందిస్తున్నాయి. అయితే ఆ సంస్థలకు ఒక్క రూపాయి కూడా తిరిగి చేరడం లేదు. ఇది దీర్ఘకాలంలో ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది. వార్తలు తయారుచేసే సంస్థలు ఆర్థికంగా బలహీనపడితే, చివరికి కొత్త వార్తల ఉత్పత్తి తగ్గిపోతుంది. అందుకే ఆస్ట్రేలియా తీసుకున్న నిర్ణయం కేవలం మీడియా రక్షణ కోసం కాదు. సమాచార ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నం కూడా. భారత్‌లో కూడా ఇలాంటి విధానంపై చర్చ మొదలుకావాలి. ఏఐ కంపెనీలు, సెర్చ్ ఇంజిన్లు, పెద్ద డిజిటల్ ప్లాట్‌ఫారాలు భారతీయ వార్తా సంస్థలతో తప్పనిసరిగా లైసెన్సింగ్ ఒప్పందాలు చేసుకునేలా చట్టపరమైన వ్యవస్థను రూపొందించాలి. ఒప్పందాలు చేసుకునే సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఒప్పందాలు చేయకుండా వార్తా కంటెంట్ ద్వారా వ్యాపారం చేసే సంస్థలపై ప్రత్యేక లెవీ విధించే అంశాన్ని పరిశీలించాలి. ఆ నిధులను స్వతంత్ర పద్ధతిలో మీడియా సంస్థల అభివృద్ధికి వినియోగించాలి. అయితే ఈ విధానంలో మరో జాగ్రత్త అవసరం. ఆ నిధులు కేవలం పెద్ద మీడియా సంస్థలకే పరిమితం కాకూడదు. జిల్లా, ప్రాంతీయ, చిన్న డిజిటల్ మీడి యా సంస్థలు, స్థానిక భాషా పత్రికలు కూడా వాటాలో భాగస్వాములు కావాలి.

**నూకల దేవేందర్,**
7013439800

# నాగార్జునసాగర్ నీరు తాగునీటికే సరి

- వరి వద్దు, ఆరుతడి పంటలు వేయాలి
- జూన్ 2027 వరకు తాగునీటికి ఢోకా లేదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, పైనుండి నీరు వచ్చే అవకాశం లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్‌లో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు.ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని, వీటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఎఎంఆర్‌పిఎస్ కూడా సగమే నిండినదని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని చెప్పారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని, దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకొని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని సూచించారు.జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్ల పై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినా జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్‌బిసి సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎల్‌నినో వల్ల రాబోయే రోజుల్లో సాగునీటికి మరింత ఇబ్బంది ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల పంట మార్పిడిపై రైతుల వద్దకు వెళ్లి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసి రైతులను చైతన్యం చేయాలని,ఈ సంవత్సరం వర్షాలు తక్కువ ఉన్నందున పంట మార్పిడి కింద మెట్ట పంటలు వేసుకునే విధంగా చైతన్యం చేయాలన్నా రు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల వర్షాలు లేనందున ప్రాజెక్టుల్లో కూడా సరైనంత నీరు లేదని, రానున్న రోజుల్లో పై నుంచి సాగు నీరు వచ్చే అవకాశాలు లేవని తెలిపారు.ఈ సమావేశంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సిఇ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, హాలియా,నిడమనూరు పిఎసిఎస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరయ్యారు.

# డిగ్రీ ఒక్కటే సరిపోదు.. నైపుణ్యాలుంటేనే ఉద్యోగం

యువతను భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

65 ఐటిఐ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి

రూ.2,400 కోట్లతో టాటా సన్స్ సహకారం

మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేతిలో డిగ్రీ పట్టా ఉంటే ఉద్యోగం వచ్చేసినట్టేనన్న రోజులు పోయాయని, మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రాక్టికల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ సామర్థ్యం, ఆత్మవిశ్వాసం ఉన్న వారికే భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మార్కుల మెమోలతో డిగ్రీలు అందించే వ్యవస్థ నుంచి భవిష్యత్ అవసరాలకు సరిపోయే మానవ వనరులను తయారు చేసే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని తెలిపారు. రాయదుర్గంలోని టి–వర్క్స్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్–అవార్డ్స్ 2026లో మంత్రి మాట్లాడారు. విద్య, పరిశ్రమ, ఉపాధిని అనుసంధానం చేసి యువతను భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబిఎ తదితర కోర్సుల నుంచి ఏటా రెండు లక్షల మందికి పైగా గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారని చెప్పారు. వారికి డిగ్రీతో పాటు ప్రతిభ, ఎదగాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో డిగ్రీ ఒక్కటే సరిపోదన్నారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, కమ్యూనికేషన్, మార్పులకు అనుగుణంగా పనిచేసే నైపుణ్యం, నిరంతరం నేర్చుకునే తత్వం అత్యంత కీలకమని పేర్కొన్నారు. దశాబ్దాల క్రితం రూపొందించిన ఐటీఐ కోర్సులను ఆధునిక పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పూర్తిగా మార్చుతున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. రోబోటిక్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ అందించేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. టాటా సన్స్ సహకారంతో రూ.2,400 కోట్లతో ఈ కేంద్రాలను భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ దేశంలో నైపుణ్యాభివృద్ధికి కొత్త నమూనాగా నిలుస్తుందని మంత్రి అన్నారు. విద్య ఉపాధికి దారి తీయాలని, కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలకు మరింత కీలక పాత్ర ఉండాలని సూచించారు. కృత్రిమ మేధ ఐటీ రంగానికే పరిమితం కాకుండా వైద్యం, తయారీ, ఆర్థిక, విద్య, వ్యవసాయ రంగాలను కూడా వేగంగా మార్చుతోందని తెలిపారు. ఏఐ కారణంగా కొన్ని ఉద్యోగాల స్వరూపం మారుతుందని, అదే సమయంలో కొత్త వృత్తులు, కొత్త పరిశ్రమలు, కొత్త ఉపాధి అవకాశాలు భారీగా ఏర్పడతాయని చెప్పారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ) రంగంలో సుమారు 20 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

# బిసిల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

14న పూలే దంపతుల, 18న సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ: మంత్రి పొన్నం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిల సమస్యల పరిష్కారం, సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి ఐక్యంగా ముందుకు సాగాలని బిసి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు నిర్ణయించారు. హైదరాబాద్‌లో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో జరిగిన సమావేశంలో బిసి సంక్షేమం, కులగణన తదుపరి కార్యాచరణ, సంక్షేమ పథకాల అమలు, ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం తదితర అంశాలపై చర్చించారు. హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్ సమీపంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి రావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈ నెల 14న, ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని 18న ఆవిష్కరించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని నిర్ణయించారు. బిసి కులగణన అనంతరం బిసిల ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరేలా తదుపరి కార్యాచరణను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని సమావేశం నిర్ణయించింది. బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించడం, బిసి కమిషన్‌ను బలోపేతం చేయడం, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతల వారీగా విడుదల చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. బిసి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, బిసి కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ బిసి కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, కె. కేశవరావు, వి. హనుమంతరావు, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, అనిల్ కుమార్ యాదవ్, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా పాల్గొన్నారు.

# నిరంజన్‌రెడ్డి అజ్ఞానపు ఆరోపణలు మానుకోవాలి

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు సాగునీరు అందించడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేసిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఆగస్టు 1 నుంచే ఎంజికెఎల్ఐ లిఫ్ట్1, లిఫ్ట్2 ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయని, ఇప్పటివరకు శ్రీశైలం నుంచి 2.7 టిఎంసిల నీటిని ఎత్తిపోశామని తెలిపారు. జొన్నలబొగడ్డ రిజర్వాయర్‌లో 1. 753 టిఎంసిల నీరు నిల్వ ఉండగా, మూడు పంపుల ద్వారా 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,100 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోందన్నారు. ఆగస్టు 6న లిఫ్ట్3 కూడా ప్రారంభమైందని, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లో 0.42 టిఎంసిల నీరు ఉందని వివరించారు. ఆగస్టు 7న అన్ని కాలువలకు సాగునీరు విడుదల చేశామని, ఆగస్టు 8న గుడిపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తి కాలువలకు నీటిని విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పంపులు ఎప్పుడు ప్రారంభించామో, ఎంత నీటిని ఎత్తిపోశామో, రిజర్వాయర్లలో ఎంత నిల్వ ఉందో స్పష్టమైన లెక్కలు ఉన్నాయని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని, జాతీయ ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకోవాలంటే అవసరమైన అనుమతులు కూడా ఉండాలన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. రైతులు సాగుచేసిన పంటల్లో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని మేఘారెడ్డి స్పష్టం చేశారు.

# వెంటనే పిఆర్‌సి నివేదిక అమలు

ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ డిమాండ్

ఎస్‌టియు టిఎస్ 80 వసంతాల మహోత్సవాలు




**మహబూబ్‌నగర్ :** రాష్ట్రోపాధ్యాయ సంఘం 79 సంవత్సరాలు పూర్తి చేసుకుని 80 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని దక్ష ఉన్నత పాఠశాలలో 80 సంవత్సరాల మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి పాల్గొని ఎస్‌టియు టీచర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. 80 సంవత్సరాలు ఒక సంఘం నిలబడాలంటే ఎంతో కృషి ఉండాలని, ఆ కృషి ఎస్‌టియు చేసింది కాబట్టి ఇన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయుల మన్ననలను అందుకుంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో సంఘం తమ వంతు పాత్ర పోషించాలని ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశకంగా వ్యవహరించాలని తెలిపారు. తదుపరి రిటైర్డ్ ఉపాధ్యాయులకు 80 సంవత్సరాల వేడుకలో భాగంగా సన్మానం చేశారు. ఎస్‌టి యు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ.. గత 80 సంవత్సరాల కాలంలో ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాడి ఎన్నో పరిష్కారాలను ఉపాధ్యాయులకు అందించడం జరిగింది. నిజాం కాలంలోనే సంఘం ఏర్పడి అంచలంచెలుగా ఎదిగి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సాబీర్ ఆలీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు నరసింహ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు వనపర్తి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి నారాయన్ పేట జిల్లా అధ్యక్షులు రామ్ గోపాల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వనపర్తి ప్రధాన కార్యదర్శి నరసింహనాయుడు పెద్ద ఎత్తున ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి బాల్ కిషన్, ఐఫ్ రాము, ఎఐటియుసి కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

# మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

మంత్రి సీతక్క

ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ 'నారీ శక్తి అభియాన్' కార్యక్రమం

డిజిటల్ వేధింపులు, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై మంత్రి తీవ్ర ఆందోళన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలు కేవలం ఓటర్లుగానే పరిమితం కాకుండా, దేశ భవిష్యత్తును శాసించే నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నారీ శక్తి అభియాన్' శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఓటు హక్కుతోనే సమానత్వం పూర్తికాదని, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం కూడా సమానంగా దక్కాలని అన్నారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యమే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. మహిళలు ప్రజాప్రతినిధులుగా వస్తే విద్య, వైద్యం, తాగునీరు, పోషకాహారం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తారన్నారు. మహిళల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని, మహిళల హక్కులు, సమాన అవకాశాల కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా మహిళలను భయపెట్టేలా సాగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్, డిజిటల్ వేధింపులపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు, మార్ఫింగ్ ఫొటోలతో బెదిరించడం ప్రజాస్వామ్యానికే ముప్పు అని హెచ్చరించారు. ఇలాంటి దాడులు రాజకీయాల్లోకి రావాలనుకునే యువతులను వెనక్కి నెట్టే ప్రమాదముందని హెచ్చరించారు. రాజకీయ విభేదాలు విధానాలపైనే ఉండాలి తప్ప వ్యక్తులపై కాదని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మహిళలకు నిర్ణయాధికారం దక్కినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందన్నారు. తన రాజకీయ అనుభవాన్ని ప్రస్తావిస్తూ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం మహిళల భాగస్వామ్యం ఆవశ్యకతను తనకు నేర్పిందని చెప్పారు. తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాల విజయగాథలను ప్రస్తావిస్తూ, చిన్న పొదుపులతో మొదలైన మహిళలు నేడు వ్యాపారవేత్తలుగా ఎదిగారన్నారు.

# మీడియా రిఫరీ పాత్ర పోషించాలి

బెంగళూరు ఐజెయు సదస్సులో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

జర్నలిస్టులపై తీవ్ర అభియోగాలు : సిద్ధార్థ వరదరాజన్

గతంలో పరువునష్టం దావాలు, ఇప్పుడు దేశద్రోహ కేసులు






**బెంగళూరు :** మీడియా ప్రేక్షక పాత్ర కాకుండా రిఫరీ పాత్రను పోషించాలని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జర్నలిజం పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ నూతన తరానికి చెందిన, డిజిటల్ మీడియా జర్నలిస్టులు తాము రిపోర్ట్ చేసే అంశాలు, సమస్యలపై లోతైన అధ్యయనం చేసి, వాస్తవాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని సూచించారు. దీంతో మీడియా విశ్వసనీయత గణనీయంగా పెరుగుతుందని ఆయన చెప్పారు. జర్నలిస్టులకు రక్షణ అవసరం అనడంలో ఎలాంటి సందేహం లేదు అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) అనుబంధ కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'జర్నలిజానికి, వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ అవసరమా?' అనే అంశంపై శనివారం బెంగళూరులో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి హాజరు కాగా, 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్ కీలక ప్రసంగం చేశారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ 2020లో రెండు జర్నలిస్టుల చట్టాలతో సహా మొత్తం 13 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. ఈ చట్టాలను రద్దు చేయడానికి పార్లమెంటులో ఎటువంటి నిర్దిష్ట కారణాన్ని వెల్లడించలేదని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చట్టాల రద్దును న్యాయస్థానంలో సవాలు చేసేందుకు ఏదైనా చట్టపరమైన అవకాశం ఉందా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ముందస్తు సంప్రదింపుల ప్రక్రియ లేకుండా అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఇంత కీలకమైన నిర్ణయం తీసుకునే ముందు జర్నలిస్టులతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆయన ఆక్షేపించారు. జర్నలిస్టులను ఇతర వృత్తుల్లో పనిచేసే వారితో సమానంగా చూడలేమని కూడా ఆయన స్పష్టం చేశారు.సిద్ధార్థ వరదరాజన్ మాట్లాడుతూ.. భారతదేశంలో జర్నలిజానికి, జర్నలిస్టులకు రక్షణ కచ్చితంగా అవసరం అని చెప్పారు. గతంలో వివాదాస్పద, ఘర్షణపూరిత అంశాలను రిపోర్ట్ చేసే జర్నలిస్టులు ఎదుర్కొనే ప్రధాన ముప్పుల్లో పరువునష్టం కేసులు ఒకటిగా ఉండేవని ఆయన అన్నారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని, జర్నలిస్టులు దేశద్రోహం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)తో పాటు ఇతర తీవ్రమైన చట్టాల కింద కేసులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభద్రత చట్టాన్ని ప్రయోగించడం ద్వారా కూడా జర్నలిస్టులను అణచివేసే ప్రయత్నాలు జరిగాయని, వారిపై తీవ్రమైన అభియోగాలు మోపుతున్నారని వరదరాజన్ విమర్శించారు. ప్రభుత్వ అడ్వర్టయిజ్ మెంట్లు, ప్రజా సంబంధాలకు కేటాయించిన నిధులను ఉపయోగించి మీడియా సంస్థలపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించడం స్వతంత్ర, నిష్పాక్షిక జర్నలిజానికి ఎదురవుతున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రభుత్వం డిజిటల్ మీడియాపై నియంత్రణ సాధించలేకపోయిందని, అయితే ఆ తర్వాత ఐటి చట్టం అమలుతో డిజిటల్ వేదికల సహాయంతో మీడియాపై నియంత్రణ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారని వరదరాజన్ ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పుడు డిజిటల్ సర్వీసెస్ బ్రాడ్‌క్యాస్టింగ్ చట్టం ముసాయిదాను రూపొందించే దిశగా ముందుకు సాగుతోందని కూడా ఆయన తెలిపారు.కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానుమ్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. మనం అనైక్యంగా ఉన్నందు వల్ల విశ్వసనీయత తగ్గిపోతోంది అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

### మీడియా హక్కుల హననంపై నేతల దృష్టి : కె.శ్రీనివాస్‌రెడ్డి

ఐజెయు మాజీ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ అనంతరం నాయకులు జర్నలిస్టుల హక్కుల కోసం, వారి పని పరిస్థితులు మెరుగుపరచడంపై దృష్టి సారించారని, నేటి నాయకులు మీడియా హక్కుల హననంపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాల తో పాటు 13 చట్టాలను రద్దుచేసి, 29 చట్టాలతో కూడిన 4 కార్మిక స్మృతులకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆరు జాతీయ సమ్మెలకు మద్దతు ఇచ్చామని, రద్దుకు వ్యతిరేకంగా పార్లమెంటరీ కమిటీకి సైతం వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. నాలుగు కోడ్స్ నోటిఫికేషన్ అమలు చేయకుండా నిలిపేసిన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల స్ఫూర్తిని అభినందించారు. ఈ సెమినార్ ఐ జె యు భవిష్యత్ కార్యాచరణకు దిశ నిర్దేశం చేస్తున్నదని శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ , వేజ్ బోర్డు పునరుద్ధరణ కోసం విస్తృత పోరాటాలకు సిద్ధం కావాలని జర్నలిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. ఐజెయు అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ సదస్సుకు అధ్యక్షత వహించగా,సెక్రటరీ జనరల్ డి. సోమ సుందర్ స్వాగతోపన్యాసం చేశారు. ఐజెయు మాజీ అధ్యక్షులు ఎస్.ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ రజాక్ కూడా సదస్సులో ప్రసంగించారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎం ఏ మాజీద్, ఉపాధ్యక్షుడు వై నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె అధ్యక్షుడు కె విరాహత్ అలీ, ఎపియుడబ్ల్యుజె అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కె జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఐజెయు జాతీయ కార్యవర్గ సమావేశం ప్రారంభ సెషన్ను జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, సిద్ధార్థ వరదరాజన్ తదితర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులందరినీ కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ సత్కరించింది.కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు జానకి మోహన్ వందన సమర్పణ చేశారు.

## యువకులను అప్పుడు నెత్తిన పెట్టుకుని..

# ఇప్పుడు కర్కశంగా వ్యవహరిస్తారా?

ఎమ్మెల్యే హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోని రాగానే ప్రసుత్తం ఆ నిరుద్యోగులే ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారని, ఇది నిరుద్యోగుల తప్పా?, లేదా ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వ తప్పా అని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో క్రిమినల్ వేస్ట్ అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే యథా రాజా.. తథా అధికారులు అన్న సామెత గుర్తుకొస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, ఆ ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే ప్రస్తుతం 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని, నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పిహెచ్‌డి వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల 'టవర్స్'కు భారీ స్పందన

7,340 ఇళ్లకు 35,125 దరఖాస్తులు

లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక

ఏడాదిలోగా ఇండ్ల పంపిణీ

హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అల్పాదాయ వర్గాల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్' పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలివిడతగా నిర్మిస్తున్న 7,340 ఫ్లాట్ల కోసం శనివారం నాటికి 35,125 దరఖాస్తులు వచ్చాయని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.58 లక్షల వరకు విలువ చేసే ఈ ఫ్లాట్లను ప్రభుత్వం కేవలం రూ.6 లక్షలకే నామమాత్రపు ధరతో అందిస్తోందని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని చెప్పారు. సందేహాలు ఉన్న అభ్యర్థులు హెల్ప్‌లైన్ నెంబరు 040 24603572 ను సంప్రదించవచ్చు అన్నారు. లాటరీ ప్రక్రియ : ఆగస్టు 20వ తేదీ నుంచి పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.నిర్మాణ గడువు : ఎంపికైన అభ్యర్థులకు ఏడాది కాలంలోనే ఇండ్లను నిర్మించి అందిస్తారు.రిజిస్ట్రేషన్ సౌకర్యం : ఇండ్లు పొందిన వారికి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుంది. రాని వారికి రూ. 10,000 ధరావతు ఫీజును తిరిగి చెల్లిస్తారు. అత్యధికంగా కూకట్‌పల్లి (5,233), ఖైరతాబాద్ (4,394), కుత్బుల్లాపూర్ (4,121), నాంపల్లి (3,613) నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు నమోదయ్యాయి.

## కార్మిక హక్కుల రక్షణకు పోరాడుదాం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



ప్రజాపక్షం/మంచిర్యాల : బిజెపి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. మంచిర్యాలలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, రైతు సంఘాల నాయకుల సమావేశం జరిగింది. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సెప్టెంబర్ 10న మంచిర్యాలలో చేపడుతున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం దారుణమని, ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తూ, పని గంటలను పెంచి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా కేంద్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దేశాన్ని నిర్మిస్తున్న కార్మికులకు భద్రత లేదని, రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదని విమర్శించారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని, నెలకు రూ. 26 వేల కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని స్పష్టం చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ వంటి సామాజిక భద్రతా పథకాలను బలోపేతం చేయాలని కోరారు. ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు టి. శ్రీనివాస్, ఎఐకెఎమ్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్ కుమార్, నాయకులు అరుణ, తిరుపతి రెడ్డి, సురేందర్, రత్నం తిరుపతి, దొండ ప్రభాకర్, చంద్రయ్య, ఎఐకెకెఎస్ రాష్ట్ర కార్యదర్శి గోగర్ల శంకర్, జి వినయ్, రాకేష్ పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

సిపిఐ నాయకుడు మిట్టపల్లి వెంకటస్వామి



ప్రజాపక్షం/బెల్లంపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, దాగం మల్లేష్, బొంతల లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. శనివారం నెన్నెల మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా పోరు యాత్రలో భాగంగా మూడో రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర నిర్ణయాల వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కక నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి రాజమౌళి, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నేడు కడెం కుడి కాలువకు నీటి విడుదల

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజాపక్షం/జన్నారం : కడెం కుడి కాలువ ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 గంటలకు జన్నారం మండలంలోని కడెం ఆయకట్టు రైతుల శ్రేయస్సు కోసం నీటి విడుదల కార్యక్రమం నిర్వహించనున్నట్లు జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగునీరు అందించేందుకు చేపడుతున్న మండలంలోని రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


## ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ



ప్రజాపక్షం/మోర్తాడ్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని వైద్యులకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.రాజశ్రీ సూచించారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హెచ్‌సి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం నిర్వహించి హెల్త్ మేళాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రాజశ్రీ పరిశీలించారు. మేళాలో ప్రజలకు అందుతున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నామన్నారు. గర్భిణులకు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించామన్నారు. గర్భిణులతో స్వయంగా మాట్లాడి పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.డాక్టర్ సవిత, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ స్వాతి, చర్మవ్యాధి నిపుణులు, సబ్ యూనిట్ అధికారి సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు



ప్రజాపక్షం/మోర్తాడ్: అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి పథకాలు అందేలా చూస్తామని మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కూరి ఆనంద్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా మా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయడమే మా ప్రభుత్వ విధానమని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మరోకసారి గుర్తు చేశారు. అదేవిధంగా గృహజ్యోతి ప థకం కూడా ప్రతి ఒక్క అర్హులైన కుటుంబం లబ్ధిపొందాలని సమావేశం లో తెలిపారు. అర్హత కలిగిన వారు వారందరికీ పెన్షన్లు ఇప్పించాలనే దృఢనిశ్చయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలియచేశారు. ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా ఇస్తామని ఆయన అన్నారు. దొనకల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లెం రవి, మోర్తాడ్ మండల జనరల్ సెక్రెటరీలు బా స మల్లికార్జున్, బొట్టి రవి, అలల రాజ కుమార్, మండల మీడియా ఇన్‌ఛార్జి దోన్‌పాల్ రాములు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జిన్నా అరుణ్, అల్లెపు ముత్యం తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ ప్రయోజనాలు

# కాపాడేందుకు సమష్టి కృషి

- ప్రభుత్వ సలహాదారు పోచారం, ఎమ్మెల్యేలు
- నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా ,కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





ప్రజాపక్షం/నిజామాబాద్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాలను కాపాడటమే పరమావధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమిష్టిగా కృషి చేద్దామని శాసనసభ్యులు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ప్రభుత్వ స లహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్‌రెడ్డిలు విచ్చేయగా, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్ విధానంతో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్, సింగూర్, కౌలాస్‌నాలా, పోచారం, రామడ్గు తదితర జలాశయాలలో నీటి నిల్వల స్థితిగతులు ఆయకట్టు పంటలకు సాగునీటిని అందించే వెసులుబాటు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక పంటల వైవిధ్యీకరణకై రైతులకు అవగాహన కల్పించటం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ జలాశయాల ద్వారా యాసంగి పంటలకు సాగునీటినందించేందుకు వీలుగా ప్రతీ సంవత్సరం రబీ సీజన్ సమయంలో జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశాలు జరిగేవని గుర్తు చేశారు. ఈసారి ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ సమయంలోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవటం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ ఇటీవల తుఫాన్ ప్రభావంతో కొంతవరకు వర్షాలు కురిసినప్పటికీ ఎల్‌నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలున్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవల్సిన అవసరముందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను సవాల్‌గా స్వీకరిస్తూ అన్ని వర్గాల వారిని దీని ప్రభావం బారి నుండి కాపాడేలా అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వ ర్షాలు కొంత ఉపశమనం కలిగించాయని, అ ందుబాటులోకి వచ్చిన నీటి వనరులను వృధా కాకుండా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగ రావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్‌ఓ గీత, ఇరిగేషన్ గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించాలి

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



ప్రజాపక్షం/నస్పూర్ : ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగిస్తూ, పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంచిర్యాల ఎంఎల్‌ఏ ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వర్షపాతం, సాగునీటి లభ్యత, పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటలపై నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ నీటి వృథాను అరికట్టాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా మార్గదర్శనం చేయాలన్నారు. నారు పోసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా కడెం రిజర్వాయర్ నుండి ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆగస్టు 15 నుండి నూతన చేయూత పింఛన్ల దరఖాస్తు ప్రక్రియ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ, పిఎసిఎస్ చైర్మన్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నార్సింగిలో గంజాయి కలకలం

వ్యక్తి అరెస్ట్.. ఎండు గంజాయి, చాక్లెట్లు స్వాధీనం

ప్రజాపక్షం/మెదక్ : నార్సింగ్ మండల కేంద్రంలో మెదక్ ఎక్సైజ్ డీటీఎఫ్ బృందం నిర్వహించిన తనిఖీల్లో బీహార్‌కు చెందిన శివ్ కుమార్ సాద వద్ద నుంచి 2 కిలోల ఎండు గంజాయి 150 గంజాయి చాక్లెట్లు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రయ్య ఆదేశాల మేరకు మెదక్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎల్ . నరసింహారెడ్డి పర్యవేక్షణలో డీటీఎఫ్ బృందం శుక్రవారం అర్ధరాత్రి నార్సింగ్ మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టింది. అక్రమంగా మత్తు పదార్థాలను తరలిస్తున్నాట్లు గుర్తించిన అధికారులు శివ్ కుమార్ సాద ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. గంజాయి విక్రయాలు అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు. ఈ దాడిలో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జే. గోపాల్, ఎస్ఐ బాలయ్య, కానిస్టేబుళ్లు వహీద్, జీవన్, పుండరీకం, స్రవంతి పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో దొంగతనం

నిందితులను కఠినంగా శిక్షించాలి..

అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ హరిహర క్షేత్రం ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి భారీ దొంగతనానికి పాల్పడడం తీవ్ర కలకలం రేపింది.ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ద్వారాల తలుపులు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు స్వామివారి శేష వస్త్రాలు, విలువైన బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల సమాచారం మేరకు సుమారు 10 కిలోల వెండి,2 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు.మాజీ మంత్రి అల్లోల ఆకస్మిక సందర్శన శ్రీ హరిహర క్షేత్రంలో దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శనివారం ఆలయాన్ని సందర్శించారు.ఆలయంలో నిత్యం పూజలు అందుకునే దేవుళ్ల ఆభరణాలు చోరీ కావడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందన్నారు. బాధ్యులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చోరీకి గురైన మొత్తం బంగారం, వెండి ఆభరణాలను త్వరితగతిన రికవరీ చేసి ఆలయ యాజమాన్యానికి అప్పగించేలా పోలీసులు రాత్రింబవళ్లు శ్రమించాలన్నారు.జిల్లాలోని ప్రధాన ఆలయాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని, రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని అధికారులకు సూచించారు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు, స్థానికులు ఆందోళన చెందకుండా పోలీసులు వేగంగా నిందితులను పట్టుకోవాలన్నారు.ఆలయ ధర్మకర్త అల్లోల మురళీధర రెడ్డి, అల్లోల సురేందర్ రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, పాక్స్ చైర్మన్లు పివి రమణ రెడ్డి, కృష్ణ ప్రసాద్ రెడ్డి, మాజీ చైర్మన్ ఆమెడా శ్రీధర్, నిర్మల్ మండల కన్వీనర్ మలేష్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచులు వినోద్,లింగన్న, పోశెట్టి,గంగాధర్, గంగారెడ్డి,పాల్గొన్నారు.

## తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన క్రీడాకారులు



ప్రజాపక్షం/నిజామాబాద్ : థాయిలాండ్ జరిగిన 9వ హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు మెరిశారు. నిజామాబాద్, తెలంగాణ, భారతదేశానికి అపారమైన గౌరవాన్ని తీసుకవచ్చారన్నారు. నగరంలోని బోధన్ రోడ్డు, ఎన్ఆర్ఐ కాలనీలోని తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా (టిఎంఎఎఐ) విద్యార్థులు థాయిలాండ్‌లోని పట్టాయాలోని ఈస్టర్న్ నేషనల్ స్పోర్ట్స్ ట్రేనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక 9వ హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ టిఎంఎఎఐకి చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులు మొత్తం 4 పతకాలు సాధించి విశేష విజయాన్ని నమోదు చేశారు. షేఖ్ మైతాబ్ అహ్మద్ (81 కిలోలు) రెండు విభాగాల్లో పోటీ చేసి 1 బంగారు పతకం, 1 కాంస్య పతకం గెలుచుకుని తన ప్రతిభను చాటాడు. షేక్ తల్హా (41 కిలోలు) శక్తివంతమైన ప్రదర్శనతో ఒక వెండి పతకం సాధించాడు. ఇల్హాన్ అబ్దుల్లా ఫారూకీ (31 కిలోలు) అద్భుతమైన సంకల్పం, పోరాటస్ఫూర్తితో ఒక కాంస్య పతకం సాధించాడు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని ఆరోగ్యకరమైన విజయవంతమైన జీవితానికి శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరమని తెలిపారు.

## జనసేన లేకుండా ఏ ప్రభుత్వమూ ఏర్పాటు కాదు




ప్రజాపక్షం/నిజామాబాద్ : రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో జనసేన లేకుండా ఏ ప్రభుత్వం ఏర్పాటు కాదని, తెలంగాణలో జనసేన జండా ఎగరవేస్తామని తెలంగాణ ఇన్‌చార్జి శంకర్‌గౌడ్ అన్నారు. రాష్ట్రం సాధించి 13 ఏళ్లు గడిచినా తెలంగాణలో సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని రాష్ట్ర నాయకులు ఆర్‌కె సాగర్‌నాయుడు అన్నారు. శనివారం నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిజామాబాద్‌లోని సుగుణ గార్డెన్ మీసాల శ్రీనివాస్‌రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.జనసేన రాష్ట్ర నాయకులు శంకర్, ఆర్‌కె సాగర్, సినీ హీరో తనీష్, మచ్చ సుధాకర్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన నాయకులు, కార్యకర్తలను సన్మానించారు.నిజామాబాద్‌లో రానున్న 2028 ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎంపీలుగా జనసైనికులు పోటీ చేయనున్నారన్నారు.2014 నుంచి జనసేన నుంచి పని చేసిన జన సైనికులకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించటం జరిగిందన్నారు. నిజామాబాద్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారి పరిస్థితి దారుణంగా ఉం దని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 ఏళ్లు గడిచినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. తాను చివరి వరకు జనసేనతోనే ఉంటామని, పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాష్ట్ర అబ్జర్వర్ శర్మ, మీడియా ఇన్‌చార్జి దుంపటి శ్రీనివాస్, నాయకులు అజయ్, ఉపసర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్న మెదక్ మెజిస్ట్రేట్

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులోని గుట్టపై గల శ్రీలక్ష్మి నరసింహాస్వామిని శనివారం మెదక్ జిల్లా మెజిస్ట్రేట్ నీలిమ తన కుటుంబసభ్యుల సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని జరిపించారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఈఓ సార శ్రీనివాస్ ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రధాన పూజారి ధనుంజయవర్మ, ఆలయ జూనియర్ సహాయకులు నర్సింహారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై నిఘా పటిష్ఠం చేయాలి


టోల్‌గేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లా లో ఉన్న జాతీయ రహదారి44 పై నిఘాను మరింత పటిష్టం చేయాలని మల్టీ జోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల నిఘా, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. ఎన్‌హెచ్ 44 పై వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అతివేగం, రాంగ్‌లేన్‌లో ప్రయాణించడం, వ్యతిరేక దిశలో వాహనాల రాకపోకలు, ఎల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలు, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి, సంబంధిత పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏటిఎంఎస్ లోని ట్రాఫిక్ మానిటరింగ్ కెమెరాలు, వాహన వేగాన్ని గుర్తించే విఏఎస్డి రాడార్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థలు, వేరియబుల్ మెసేజింగ్ సైన్ బోర్డులు తదితర వ్యవస్థలను ఐజీ పరిశీలించారు. ప్రమాదాలు, రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు, అడ్డంకులు, పాదచారుల రాకపోకలు వంటి ఘటనలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టేలా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అతివేగంగా ప్రయాణించే వాహనాలను గుర్తించి ఈ చలాన్ ద్వారా చర్యల తీసుకోవాలని, ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు గుర్తించిన వెంటనే పోలీస్, అంబులెన్స్, సిబ్బందికి సమాచారం అందేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఐజీ వెంట మెదక్ జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్ఐ గంగారాజు, టోల్ గేట్ సిబ్బంది ఉన్నారు.

## మరో ప్లాస్టిక్ భూతం.. ఎవరి లబ్ధి కోసం?

- లోలం గ్రామాన్ని కలుషిత వ్యర్థాలతో నింపుతారా?
- మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి కాలుష్య పరిశ్రమ విస్తరణ
- నాడు ఇథనాల్‌ను అడ్డుకున్న ఎమ్మెల్యే,
- నేడు ప్లాస్టిక్ పరిశ్రమకు శంకుస్థాపన చేయడం వెనుక మర్మమేమిటి?




ప్రజాపక్షం/దిలావర్ పూర్ : గతంలో మండల స్థాయిలోనే పరిమితం అని నమ్మబలికి, ఇప్పుడు ఏకంగా జిల్లా స్థాయిలో ప్లాస్టిక్ పరిశ్రమను లోలం గ్రామంలో ఏర్పాటు చేసేందుకు వేగంగా అడుగులు వేస్తుండడం స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి, ఆందోళనకు దారితీస్తోంది. పచ్చని లోలం గ్రామాన్ని కలుషిత వ్యర్థాల మయం చేసేందుకు సిద్ధమవ్వడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఒక వైపు ప్లాస్టిక్ నియంత్రణ,పర్యావరణ పరిరక్షణ అంటూ వేదికలపై సుదీర్ఘ ఉపన్యాసాలు దంచే నాయకులు.. మరోవైపు ప్రజారోగ్యాన్ని నిలువునా బలితీసుకునే కాలుష్య పరిశ్రమలకు ఎర్రసివాళ్లు పరచడం వెనుక అసలు రహస్యమేమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇది నిజమైన గ్రామాభివృద్ధా? లేక పర్యావరణాన్ని, లోలం గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణ పణంగా పెట్టి కొందరి స్వార్థ ఆర్థిక ప్రయోజనాల కోసం చేస్తున్న వినాశకర కుట్రల వ్యూహమా? అని స్థానిక ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు 'ఇథనాల్'పై పోరు.. ఈనాడు 'ప్లాస్టిక్'తో ఒప్పందమా? నాడు ఇథనాల్ పరిశ్రమల వల్ల జరిగే తీవ్ర కాలుష్యాన్ని, పర్యావరణ వినాశనాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజల తరపున గళమెత్తి ఉద్యమించిన అదే ఎమ్మెల్యే.. నేడు లోలంలో అంతకంటే ప్రమాదకరమైన ప్లాస్టిక్ పరిశ్రమకు పచ్చజెండా ఊపి శంకుస్థాపన చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆనాడు ఇథనాల్‌ను అడ్డుకున్నది నిజంగా ప్రజల క్షేమం కోసమా? లేక కేవలం రాజకీయం కోసమా? అని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర స్థాయిలో నిలదీస్తున్నారు. నాడు ఉద్యమ నేతగా కనిపించి, నేడు పరిశ్రమల ప్రతినిధిగా మారిన ఈ ద్వంద్వ వైఖరి వెనుక ఎవరి హస్తం ఉందో, ఎవరి ఆర్థిక లావాదేవీలు దాగి ఉన్నాయో తక్షణమే బయటపడాల్సిన అవసరం ఉంది.మరో 'ఇథనాల్' తరహా పోరాటం తప్పదా? ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా పక్కనపెట్టి, పర్యావరణ నిబంధనలను నీరుగారుస్తూ దొడ్డిదారిన ముందుకెళ్తే ఈ ప్రాంతంలో మరో ఇథనాల్ తరహా తీవ్ర ప్రజా ఉద్యమం వెల్లువెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. ప్లాస్టిక్ భూతం లోలం గ్రామాన్ని, భవిష్యత్ తరాల జీవి తాలను నాశనం చేయక ముందే స్థానిక ప్రజలు, యువత, పర్యావరణ పరిరక్షణ కమిటీలు ఏకమై ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. అభివృద్ధి పేరుతో వినాశనాన్ని తెచ్చిపెట్టే ఈ ప్లాస్టిక్ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని, లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో పాలకులకు, అధికారులకు నిరసన సెగ తప్పదని హెచ్చరిస్తున్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీస్ సంయుక్త దాడులు

6 కేసులు నమోదు.. ముగ్గురి అరెస్ట్



ప్రజాపక్షం/ఖానాపూర్ : గుడుంబా నిర్మూలనలో భాగంగా ఎక్సైజ్,పోలీస్ శా ఖలు సంయుక్తంగా ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక దా డు లు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎన్ఫోర్స్‌మెంట్,ఆదిలాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి,నిర్మల్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టారని నిర్మల్ సిఐ తెలిపారు.ఖానాపూర్ మండలంలోని కొమ్ముతండా, రంగంపేట తండా, సత్తన్‌పల్లి, గోసమ్ పల్లి, ఎర్వచింతల్,బీర్నంది,కోలంగుడా,సోమరిపేట,పాత ఎల్లాపూర్ గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో మొత్తం 6 కేసులు నమో దు చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. 13 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,000 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు .ఖానాపూర్ మండలాన్ని పూర్తిస్థాయిలో గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో దాడులను నిరంతరం కొనసాగిస్తామని ఎక్సైజ్ సీఐ రంగస్వామి అన్నారు.నల్లబెల్లం అక్రమ రవాణా, గుడుంబా తయారీ, విక్రయాలతో పాటు గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ కార్యకలాపాలపై ప్రజలకు ఏదైనా సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీఐ పేర్కొన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్,ఎస్ఐ వసంతరావు, ఎస్ఐ సింధుతో పాటు ఎక్సైజ్, ఖానాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజేశ్వర్ రావుకు డాక్టరేట్ ఇవ్వడమంటే రైతులకే గర్వ కారణం: చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** అమెరికాలోని మేరిల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్ రావుకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం రైతులకే గర్వ కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. డాక్టరేట్ పొందిన రాజేశ్వర్ రావును శనివారం చాడ వెంకట్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పట్టభద్రులైన రాజేశ్వర్ రావు పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం, వ్యవసాయతోపాటు పాడి పరిశ్రమ ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందేందుకు ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఆయన కృషి చేస్తున్నాడని అన్నారు. కరీంనగర్‌లో పాలు అలాగే పాల సేకరణలో డెయిరీ అభివృద్ధిలో మార్కెట్ పరిధిని విస్తరించడానికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో కరీంనగర్ డెయిరీని రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిపిన వ్యక్తి రాజేశ్వర్ రావు అని కొనియాడారు. 1971లో 12 వేల లీటర్ల సామర్థ్యంతో ప్రారంభించిన పాల డెయిరీ నేడు 3 లక్షలకు పెంచడంలో రాజేశ్వర్ రావు కృషి పట్టుదల ఎంతో ఉందని అప్పటి నుంచి ఎన్నో అవార్డులు అందుకున్నాడని భవిష్యత్‌లో రైతులకు మరింత సేవ చేస్తూ మరెన్నో అవార్డులు పొందాలని వెంకట్ రెడ్డి ఆకాంక్షిస్తూ రాజేశ్వర్ రావును అభినందించారు. సన్మానించినవారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ ఉన్నారు.

## జిల్లా 4వ మహాసభకు తరలి రండి

### ఎఐటియుసి జిల్లా జనరల్ సెక్రటరీ కడారి సునీల్ పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా నాలుగవ మహాసభ సుల్తానాబాద్ లో ఆగస్టు 20న యశోద నరహరి ఫంక్షన్ హాల్లో జరుగుతున్న సందర్భంగా మహాసభల విజయవంతం చేయాలని ఏఐటియుసి జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ పిలుపునిచ్చారు.శనివారం రోజున మధ్యాహ్న భోజన వర్కర్స్ సుల్తానాబాద్ మండల సమావేశం తోడేటి లావణ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మికుల హక్కులపై కనీస వేతనాలు అమలు చేయక ఇబ్బందులు చేస్తున్నాయని ప్రభుత్వాలు మారిన ప్రజా ప్రతినిధులు మారిన కార్మికుల బ్రతుకులు మారడం లేదని అన్నారు సంఘటిత అసంఘటిత కార్మికుల హమాలీ బ్రతుకులు అంగన్వాడి ఆశ ఏఎన్ఎం కాంట్రాక్టు కార్మికులు స్కీమ్ వర్కర్ల బ్రతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు మహాసభలో భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన జరుగుతుందని ఈ మహాసభకు యూనియన్ పార్టీ జాతీయ రాష్ట్ర నాయకులు హాజరు అవుతున్నారని దీనికి కార్మికులు ఉద్యోగం హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎం సునీత, జే రచన, చంద్రకళ, మల్లేశ్వరి, ఆవునూరి స్వరూప, వేణు, గౌతమ్, మొండయ్య, పూసల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే పాఠశాలల అభివృద్ధి కోసం వినతి



**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం, బెల్లంపల్లి ప్రాంతాల్లోని రైల్వే పాఠశాలల అభివృద్ధి, అప్‌గ్రేడేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం న్యూఢిల్లీలో రైల్వే బోర్డు ఛైర్మన్ సతీష్‌ను కోరినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కొత్తగా రైల్వే ఇంగ్లీషు మీడియం స్కూళ్లను ఏర్పాటు చేయాలని, వీటికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని, పలు ప్రతిపాదనలతో వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఇంగ్లీషు మీడియంలో తమ పిల్లలను చదివించేందుకు దూర ప్రాంతాల్లోని స్కూళ్లకు పంపిస్తున్నారని, ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇంగ్లీషు మీడియ పాఠశాలలు అందుబాటులోకి వస్తే రైల్వే ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు.

## గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపులో కరీంనగర్ జిల్లా ఆదర్శం

### రూ.11.26 కోట్ల బకాయిల్లో రూ.5.71 కోట్ల చెల్లింపు: కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపులో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. గ్రామ పంచాయతీల స్వంత నిధుల నుంచి విద్యుత్ వినియోగ బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఇప్పటివరకు సుమారు 50 శాతం బకాయిలను చెల్లించినట్లు వెల్లడించారు. జనవరి 2026 నుంచి జూలై 2026 వరకు కరీంనగర్ జిల్లాలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు రూ.11.23 కోట్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో గ్రామ పంచాయతీలు తమ సొంత నిధుల నుంచి రూ.5.71 కోట్లు విద్యుత్ బిల్లులుగా చెల్లించాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల సొంత నిధుల నుంచి ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ బిల్లులు చెల్లించిన జిల్లాల్లో కరీంనగర్ రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. మండల పంచాయతీ అధికారులు సంబంధిత విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ అధికారులతో కలిసి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన పెండింగ్ బిల్లులను సమగ్రంగా పరిశీలించారని రూ.2.14 కోట్ల మేర బిల్లుల భారం పంచాయతీలపై తగ్గినట్లు వివరించారు. స్థానికంగా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## ఆర్‌టిసి డ్రైవర్‌కు హఠాత్తుగా మూర్ఛ

### తప్పిన ప్రమాదం,ఊపిరిపీల్చిన ప్రయాణికులు


**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** కామారెడ్డి సిరిసిల్లా ప్రధాన రహదారి కామరెడ్డి నుండి సిరిసిల్లా వస్తుండగా గొల్లపల్లి ప్రాంతం వద్ద ఆర్టీసి డ్రైవర్ ఒక్కసారిగా మూర్ఛన పడ్డాడు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ వైనం ఎల్లారెడ్డిపేటలో నెలకొంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును ప్రక్కన పెట్టి వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ప్రయాణికులు మరో బస్సులో పయణమయ్యారు.డ్రైవర్ కు ప్రాథమికంగా చికిత్సను అందించగా గంటవ్యవధిలో డ్రైవర్ కోలుకున్న పరిస్థితి ఏర్పడింది.డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులను బస్సును పక్కన పెట్టి వైద్యం చేయించుకున్నారు.దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

## డిపెండెంట్‌లకు ఉద్యోగాలు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణం



### మారుపేర్లు విజిలెన్స్ కేసుల డిపెండెంట్‌ల పోరాటానికి ఎఐటియుసి మద్దతు
### కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్: వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు రాకపోవడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి (గుర్తింపు సంఘం) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు.శనివారం ఆయన సింగరేణి ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరుగుతున్న మారుపేర్లు,



విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి వారి పోరాటానికి సంఘీభావం తెలుపుతూ అనంతరం మాట్లాడుతూ వీరి సమస్య గత ఏడెనిమిది సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా ఉందని ఆయన తెలిపారు.గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో వీరి సమస్య పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చించి వారికి వన్ టైం సెటిల్మెంట్ కింద ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించారని, ఈ లోగా ప్రభుత్వం మారడంతో ఈ సమస్య పరిష్కారం లో పెండింగ్ లో ఉండిపోయిందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎన్నికల ముందు కోల్ బెల్ట్ ఏరియా లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో కోల్ బెల్ట్ ప్రాంతంలో ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ కి చెందిన వారు ఎమ్మెల్యే లుగా గెలిచారని ఆయన గుర్తు చేశారు.వీరి సమస్య పరిష్కారం కోసం అడ్వకేట్ జనరల్ కు లేఖ రాశామని సింగరేణి యాజమాన్యం చెబుతుందని,అక్కడ నుంచి ఆదేశాలు రాగానే ఉద్యోగాలు ఇస్తామని యాజమాన్యం యూనియన్‌తో జరిగిన సమావేశంలో చెప్పడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినందున న్యాయశాఖ మంత్రి కి గాని, అడ్వకేట్ జనరల్ కు గాని ఆదేశాలు జారీ చేస్తే వీరికి ఉద్యోగాలు వస్తాయని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే వీరికి ఉద్యోగాలు రావడం లేదని, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు వీరి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు కృషి చేసి,వారికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వీరి పోరాటానికి ఏఐటియుసి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి,నాయకులు దాసరి శ్రీనివాస్,బిట్టి వెంకటేశ్వర్లు,ఏ.వి.ఎస్. ప్రకాశ్ ,ప్రీతం,ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

**కార్మికుల జీతాల పెంపు కోసం 12 వేతన కమిటిని వెంటనే ఏర్పాటు చేయాలి:** దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న బొగ్గు గని కార్మికులకు,ఉద్యోగులకు జీతాలు, అలవెన్సుల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే నియమించాలని,బొగ్గు పరిశ్రమల్లో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయొద్దని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జాతీయ సంఘాల నాయకులు తెలిపారు.శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసి రెడ్డి సీతారామయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి,ఐఎన్టీయుసి నాయకులు గడ్డం క్రిష్ణ లు మాట్లాడారు. బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల కు జూలై 1 నుంచి 12వ వేతన కాల పరిమితి మొదలైందని కానీ ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం కమిటీ వేయ లేదని వారు ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో 51 శాతం ఓట్లు ఏ సంఘానికి రాకుంటే అధికారులే కమిషన్ ఏర్పాటు చేసి వారికి నచ్చినట్లుగా వేతనాల పెంపు చేపడుతారన్నారు. దీంతో కార్మిక వర్గం తీవ్ర అన్యా యానికి గురవుతుందని పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, ఏఐటియుసి బ్రాంచి నాయకులు దాసరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## 10న జైల్ భరో కార్యక్రమం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్



**ప్రజాపక్షం/సిద్దిపేట:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో ఏఐటీయూసి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకుంటే అధికారంలోకి వచ్చిన బీజేపి ప్రభుత్వంలో నరేంద్ర మోదీ పెట్టుబడి దారులకు రెడ్ కార్పోరేట్ వేస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించినందున కార్మికులకు భద్రత లేకుండా పోయిందని అన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని ఎన్ని సార్లు సమ్మెలు, నిరసన కార్యక్రమాలు చేసిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. అందుకు కార్మిక చట్టాలను వెనక్కి తీసుకునే వరకు కార్మికులతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు పిట్ల మల్లేశం,కర్నాల చంద్రం,సహాయ కార్యదర్శులు తపల్‌పల్లి భిక్షపతి,బెక్కంటి సంపత్,గంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసికి నారాయణ సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి మాజీ ఉప ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ మాజీ చైర్మన్ అమరజీవి కామ్రేడ్ మాదన నారాయణ ఏఐటియుసి, సిపిఐ కి చేసిన సేవలు మరువలేనివని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సీనియర్ నాయకులు వేల్పుల నారాయణ లు పేర్కొన్నారు.శనివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన నారాయణ ఆరవ వర్ధంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి లో ముఖ్యంగా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను, కమ్యూనిస్ట్ పార్టీని బలోపేతానికి నారాయణ కృషి చేశారని వారు తెలిపారు.సింగరేణిలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తూ మరోవైపు యూనియన్ లో పని చేస్తున్న దివంగత భాస్కర్ రావు కు చేదోడు వాదోడుగా ఉంటూ కార్మిక వర్గానికి అనేక సేవలు అందించారని వారు పేర్కొన్నారు. ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ వర్ధంతి సభ లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, సహాయ కార్యదర్శి మాదన మహేష్, ఏఐటియుసి సీనియర్ నాయకులు ఎంఎగౌస్, జి.ఎం.కమిటి సభ్యులు పి.విజయలక్ష్మి లు పాల్గొనగా, కళాకారులు స్మృతి గీతాలు ఆలపించగా, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్,పిట్ కార్యదర్శులు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ఆరు షాపులకు అనుమతులు ఇప్పిస్తానన్న ఎమ్మెల్యే ఎక్కడ?

### అసలు అనుమతులే లేవంటూ నోటీసులు పంపించిన సింగరేణి
### సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపురి సూర్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ శుక్రవారం రోజున మున్సిపల్ యంత్రాంగం వచ్చి నిర్మాణాలను ధ్వంసం చేసి ఇక్కడ 6 షాపులు సక్రమమని మిగతా పిల్లర్లను తొలగించడం జరిగింది.అనుమతులున్న ఆర్ షాపులకు ఎమ్మెల్యే దగ్గరుండి అనుమతులు ఇప్పిస్తానని చెప్పడం జరిగిందనీ, ఎమ్మెల్యే చెప్పి కొన్ని గంటలు గడవక ముందే ఎల్బీనగర్ లో జరుగుతున్న కాంప్లెక్స్ నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవంటూ సింగరేణి అధికారులు పిల్లర్లకు నోటీసులు అంటించి వెళ్లడం జరిగిందనీ, మీరు కట్టుకోండి నేనున్నానంటూ నమ్మబలికిన ఎమ్మెల్యే ఎక్కడ అని ప్రశ్నించిన సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపురి సూర్య ప్రశ్నించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నేనున్నా కట్టుకొమ్మని ఓవైపు స్నేహ హస్తమిస్తూనే మరో వైపు కట్టుకున్న కాంప్లెక్స్ లను నిర్దాక్షణ్యంగా కూల్చివేయడం సరైన పద్ధతి కాదని సూర్య దుయ్యబట్టారు



శనివారం రోజున ఎల్బీనగర్ కాంప్లెక్స్ లో లబ్ధిదారులకు మించి అక్రమార్కులు నిర్మాణం చేసుకోవడం వల్లనే ఈ నిర్మాణాలను కూల్చివేయడం జరిగిందని ఒకవేళ నిజంగానే ఇక్కడ లబ్ధిదారులు ఉంటే వాళ్ల యొక్క పేర్లను బహిరంగపరచాలని లేకపోతే వీళ్ళ చెప్పులు మెడకు వేసుకుంటావ అని ఒక దళిత కార్పొరేటర్ ఐన నన్ను ఇక్కడ ప్రశ్నించడం జరిగింది మరి ఇప్పుడు అసలు కాంప్లెక్స్ కి అనుమతులే లేవంటూ సింగరేణి అధికారులు నోటీసులు అంటించి పోయారు. మరిప్పుడు చెప్పులు ఎమ్మె ల్యే మెడకి వేసుడా లేక ఆయన చెంచాల మెడకేసుడా మరి ఆయనే చెప్పాలని సూర్య డిమాండ్ చేశారు. మొదటి నుండి చెప్పినట్టుగానే 41వ డివిజన్‌కు సంబంధించిన బాధితులకు ఏ ఒక్కరికి దుకాణం కేటాయించకున్న వాళ్లని ఇబ్బందుల గురిచేసిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడతానని సూర్య హెచ్చరించారు.

## సిపిఐ ప్రచార జాతను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/గన్నేరువరం:** సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడానికి నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాత ఈనెల 10న గన్నేరువరం మండలంలోనిగునుకుల కొండాపూర్ గ్రామానికి వస్తుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సిపిఐ నాయకులు శనివారం రోజున మండల కేంద్రంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 10న జరిగే ప్రచార జాతను మండలంలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతులతోపాటు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతల అంజిరెడ్డి, శ్రీశైలం, సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, గుండ్లపల్లి గ్రామ కార్యదర్శి బోయిని తిరుపతి, గన్నేరువరం కార్యదర్శి బోయిని మల్లయ్య, కళ్లే రవి, బొమ్మకంటి అంజయ్య చారి, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలినినో ప్రభావంతో నీటి సంక్షోభం తీవ్రం

### కలెక్టర్ సత్య ప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎలినినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగును విస్తరించకుండా తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ శనివారం కోరారు.కలెక్టరేట్ లో అధికారులతో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పరిస్తితులో రైతులు సాగు చేస్తున్న పంటల సాగుపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,010 చెరువులు ఉండగా ప్రస్తుతం కేవలం 268 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని వివరించారు.గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భ జలాలు ఇంకా దిగజారే అవకాశం ఉందన్నారు. తాగునీటికే ప్రాధాన్యత... వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలి!శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరాపై ఆధారపడలేమని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం, వరి సాగు విస్తీర్ణాన్ని పెంచడం పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించండివ్యవసాయ శాఖ సూచించిన కందులు, పెసర, మినుములు, ఆముదం, జొన్న, సజ్జలు, తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక,విత్తనాల లభ్యత, సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.


## నకిలీ ఇంటి పన్ను రసీదుల తయారీ: ఇద్దరి అరెస్ట్




**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపూర్ లో నకిలీ గ్రామ పంచాయతీ ఇంటి పన్ను రసీదులు తయారు చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆకుల నగేష్, బాసోజి అనిల్,అరుణ్ అనే ముగ్గురు వ్యక్తులు కలిసిప్రభుత్వ ఇంటి పన్ను రసీదులను నకిలీగా తయారు చేసి,అధికారుల సంతకాలు,రబ్బర్ స్టాంపులు,ముద్రలను అక్రమంగా ఉపయోగించి దుర్వినియోగం చేసినట్లుమండల పంచాయతీ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మరో నిందితుడు అరుణ్ పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు.ప్రభుత్వ పత్రాలను నకిలీగా తయారు చేయడం,ఉపయోగించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## నారాయణపూర్ రిజర్వాయర్‌కు మహర్దశ

### రిజర్వాయర్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు
### ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి



**ప్రజాపక్షం/గంగాధర:** శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా ఉన్న గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు మహర్దశ పట్టింది. ఇక్కడి నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతోపాటు రిజర్వాయర్, గ్రావిటీ కాలువల పూర్తి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధికి రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా కట్ట మరమ్మత్తు, గ్రావిటీ కాలువల పూర్తి, బండ్ పటిష్టం చేయడం వంటి పనులను చేయనున్నారు. నిధులు మంజూరు కావడంతో రిజర్వాయర్ పనులు వేగవంతం కానున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే చొప్పదండి నియోజకవర్గంతోపాటు పక్క నియోజకవర్గంలో ప్రత్యక్షంగా సుమారు 46,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే రిజర్వాయర్‌లో బ్యాలెన్సింగ్ నీటి ద్వారా భూగర్భ జలాలు పెరిగి మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. అంతేకాకుండా కట్టకింద ముంపుకు గురవుతున్న ఇండ్లకు, భూములకు పరిహారం అందజేయడానికి ఎమ్మెల్యే సత్యం ఇప్పటికే రూ.23.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం అందించడానికి రూ.23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కట్ట అభివృద్ధి, బండ్ పటిష్టం, గ్రావిటీ కాల్వలు పూర్తి చేయడానికి మరో రూ.20 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ధర్మపురి :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జగిత్యాల జిల్లా ధర్మపురి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్వాడీ (మహిళలు) టీచర్ పోస్టుల భర్తీ కోసం ఆన్లైన్ లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ధర్మపురి చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి బి.వాణిశ్రీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.ధర్మపురి ప్రాజెక్ట్ పరిధిలోని బీర్పూర్ మండలంలో 6 పోస్టులు,ధర్మపురి మండలంలో 4,సారంగపూర్ మండలంలో 3,వెల్గటూర్,బుగ్గారం,ఎండపెల్లి మండలాలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 16 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.మహిళా అభ్యర్థినులు కనీసం 12 వ తరగతి లేదా సత్సమాన ఉత్తీర్ణత కల్గివుండాలని 172026 నాటికి 18 ఏళ్ళు నిండి 35 ఏళ్ళు మించకుండా ఉండాలని అన్నారు.16 పోస్టులలో వివిధ కేటగిరీ పోస్టులకు రిజర్వేషన్ కలిగిఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థినులు దరఖాస్తుతోపాటు గెజిటెడ్ అధికారి అటేస్టేషన్ తో 782026 నుండి 2182026 వరకు ఆన్లైన్ http//wdcw.tg.nic.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని వాణిశ్రీ తెలిపారు.

# మక్కల కొనుగోళ్లలో రైతులకు టోపీ

- గుత్తేదారుకు వత్తాసు పలుకుతున్న అధికారులు
- గోనెసంచుల ధర చెల్లింపులో జాప్యం



ప్రజాపక్షం/ఖమ్మం : మక్కల కొనుగోళ్లకు సంబంధించి అధికారులు సహకార సంఘ ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తుంది. గోనె సంచుల గుత్తేదారుతో చేతులు కలిపి రైతులకు అన్యాయం చేసేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో గోనె సంచుల సరఫరాకు సంబంధించి ఓ గుత్తేదారు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఖాళీ గోనె సంచి రూ.23ల చొప్పున సరఫరా చేసేందుకు అంగీకరించి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు అతి కొద్ది శాతం గోనె సంచులను సరఫరా చేశాడు. ఉదాహరణకు చింతకాని సహకార సంఘంలో 8.46 లక్షల బస్తాలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయగా ఇందులో గుత్తేదారు కేవలం 40వేల బస్తాలను మాత్రమే నాగులవంచ సహకార సంఘం పరిధిలో 4.61 లక్షల బస్తాల మొక్కజొన్నలు కొనుగోలు చేయగా గుత్తేదారు కేవలం 41వేల బస్తాలు మాత్రమే సరఫరా చేశాడు. జిల్లాలోని మిగిలిన సహకార సంఘాలలో కొనుగోళ్లు బస్తాల సరఫరాకు సంబంధించి కూడా ఇదే తీరు ఉంది. పది శాతం కూడా గోనె సంచులు గుత్తేదారు సరఫరా చేయలేదు. గోనె సంచులు లేక, కాంటాలు నిలిచిపోవడంతో రైతులు వాతావరణ పరిస్థితులు తదితర కారణాలతో గోనె సంచులను తామే కొనుగోలు చేసి సహకార సంఘాల బాధ్యులకు అప్పగించి కాంటాలు వేయించుకున్నారు. మొక్కజొన్నలకు సంబంధించిన పైకం రైతుల ఖాతాల్లో జమ అయినా గోనె సంచులకు సంబంధించిన డబ్బులు మాత్రం ఇంత వరకు రైతులకు రాలేదు. గుత్తేదారుతో కొంత మంది అధికారులు కుమ్మక్కు కావడంతో రైతులకు ఒక్కో గోనె సంచికి రూ.13ల చొప్పున చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా తదితర సహకార సంఘాల్లో రూ. 13ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారని దీనితో ఒక్కో గోనె సంచికి రూ.10ల చొప్పున రైతులు నష్టపోతున్నారు. గుత్తేదారుకు మాత్రం ఒక్క ఖమ్మం జిల్లాకు సంబంధించి ఒప్పందాన్ని కాదని రూ. 13లు చెల్లించడం వల్ల మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల మేర లాభం చేకూరే అవకాశం ఉందని సమాచారం. ఖమ్మం జిల్లాలో 50258 మంది రైతుల వద్ద నుంచి 65.80 లక్షల బస్తాలను కొనుగోలు చేశారు. ఈ విషయంలో కొందరు సహకార సంఘాల అధికారులు మాత్రం రైతులకు రూ. 23ల చొప్పున చెల్లించాల్సిందేనని పట్టుబడుతుండగా గుత్తేదారుతో కుమ్మక్కైన సహకార సంఘం ల అధికారులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం రైతుల ఖాతాల్లో రూ. 13ల చొప్పున చెల్లిస్తున్నారని దీనిపై పూర్తి విచారణ జరిపితే అవినీతి బహిర్గతమవుతుందని రైతులు కోరుతున్నారు. కోట్ల రూపాయల ఈ గోనె సంచుల అక్రమాలకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి రైతుల ఖాతాల్లో పూర్తి మొత్తం జమ చేయాలని కోరుతున్నారు. రైతులు తమ అవసరం కోసం 50 కేజీలు పట్టే గోనె సంచిని రూ. 25 నుంచి రూ. 30ల చొప్పున బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేశారు.

## ఎన్ఎస్‌పి కెనాల్ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు



ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఇల్లందు వైపు వెళ్లే బస్‌స్టాప్‌ను ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రయాణికుల సౌకర్యార్థం ఎన్ఎస్‌పి కెనాల్ వద్ద మార్చినట్లు డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. శనివారం ఎన్ఎస్‌పి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌స్టాప్‌ను డిఎం శివప్రసాద్ పరిశీలించారు. ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఉన్న బస్‌స్టాప్ దగ్గర ట్రాఫిక్ సమస్య వస్తున్న నేపథ్యంలో ఎన్ఎస్‌పి కెనాల్ వద్దకు మార్చడం జరిగిందన్నారు. బస్‌స్టాప్ నిర్మాణం, మార్పుకు సహకరించిన మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, సిఐ బివికె నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. బస్‌స్టాప్ మార్పును ప్రయాణికులు గమనించి సహకరించాలని డిపో మేనేజర్ కోరారు.

## 'సేవాదళ్' నుంచి సొసైటీ పదవులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం/చండ్రుగొండ:తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు శేకపోయిన నరసింహారావు ఆధ్వర్యంలో సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్ పదవులకు దరఖాస్తులు కోరుతున్నారు. సేవాదళ్ నుంచి సొసైటీ పదవులను ఆశిస్తున్న అభ్యర్థులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ద్వారా దరఖాస్తుపై సంతకం తీసుకుని, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఎండి ఫజల్ బక్షీ కి అందించాలని సూచించారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల ఆశావహులు కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎండి ఫజల్ బక్షీ 9959869290 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## ఎస్‌విఎంలో విద్యార్థులకు ఎన్నికలు




ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ : ఎస్‌వియం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన ఎన్నికలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు సురేష్‌బాబు, సతీష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు నాయకత్వ ప్రతిభ, బాధ్యతాయుత ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలు నేర్పడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కిషోర్‌బాబు, డైరెక్టర్లు ఉమా, శ్రీధర్‌రావు లు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కల్లూరు పట్టణ ఇన్‌చార్జిగా వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/తల్లాడ : ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ కల్లూరు మున్సిపాలిటీ ఇంచార్జిగా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కోసూరు వెంకటేశ్వర్లు ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ నుండి ఆయన నియామకపు పత్రాలను అందుకున్నారు. గత 20 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన సేవలను గుర్తించిన జిల్లా పార్టీ ఈ పదవికి ఎంపిక చేసింది. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ముకుని సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయనను కల్లూరు పట్టణ ఇంచార్జిగా నియమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కల్లూరు ఇంచార్జిగా నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం ఆహర్నిశలు శ్రమిస్తానన్నారు

## 'సర్వజ్ఞ' పాఠశాలలో బోనాల వేడుకలు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో ఆషాడ బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేవిధంగా చిన్నారులు పోతురాజు, అమ్మవారి వేషధారణలతో అలరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నీలిమ, డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ లు మాట్లాడుతూ బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని ఇది సామూహిక వేడుక అన్నారు. ఊరంతా కలిసి అమ్మవారిని కొలిచి పల్లకి సేవలు, పోతురాజుల విన్యాసాలు, ఆడపడుచు నృత్యాలు, డప్పుల శబ్దాలతో సందడిగా జరుపుకుంటారన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, పంటలు బాగా పండాలని బోనాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బోనాలు



ప్రజాపక్షం/బూర్గంపాడు:బోనాల పండుగను పురస్కరించుకుని సారపాకలో ని ప్రగతి విద్యానికేతన్‌లో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సానికొమ్ము చైతన్య ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణలో ఆకట్టుకోగా, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, నృత్యాలతో భారీ బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిచారు. ఈసందర్భంగా చైతన్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు చిన్ననాటి నుంచే పరిచయం చేయడం అ వసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాణి వివేకానంద విద్యాలయంలో ఘనంగా బోనాల జాతర



ప్రజాపక్షం/వైరా:వైరాలోని వాణి వివేకానంద విద్యాలయంలో ఆషాడ మాస బోనాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయునిలు ప్రత్యేకంగా బోనాలను తయారు చేసి అమ్మవారి విగ్రహాలను అలంకరించి విద్యార్థులతో కలిసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్, గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన తుమ్మల యుగంధర్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను కాంగ్రెస్ పా ర్టీ రాష్ట్ర నాయకులు డా॥ తుమ్మల యుగంధర్ మర్యాదపూర్వకంగా కలిశా రు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్‌ను తుమ్మల యుగంధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ ఖ మ్మం నియోజక వర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివరించారు. పారిశుధ్య నిర్వహణ, ఖిల్లా రోప్‌వే పనులు, కేబుల్ బ్రిడ్జి నిర్మాణ ప నులు, అండర్ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని కోరారు. నూతన షా దీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించాలని, రిటైనింగ్ వాల్ పనులను త్వ రితగతిన పూర్తి చేయాలని, ఎస్‌ఐఆర్ కార్యక్రమాన్ని ఖమ్మం నియోజక వర్గ ంలో లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కోరారు. రఘునాథపాలెం మండలం లో జరిగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ను తు మ్మల యుగంధర్ కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నిపుణులు... దోషులను తేల్చేనా?

సామినేని హత్య కేసు మిస్టరీ వీడేనా...?



ప్రజాపక్షం/ ఖమ్మం : జిల్లాలో సంచలనం సృష్టించిన సిపిఎం నేత సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి పలు పరిణామాల తర్వాత గుజరాత్ రాష్ట్రంలోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు 27 మందిని విచారించారు. ఈ విచారణ తర్వాతనైనా సామినేని హత్య కేసులో హంతకులు ఎవరో తేల్చే అవకాశం ఉందా అన్న దానిపై రాజకీయ వర్గాలతో పాటు జిల్లాలో చర్చనీయాంశమైంది. తెల్లవారుజామున హత్య జరగడం, ప్రత్యక్షంగా హత్యను చూసిన వారు లేకపోవడం, కుటుంబ సభ్యుల ఫిర్యాదును పోలీసులు పరిగణలోకి తీసుకోకపోవడం, తొమ్మిది మాసాలుగా ఈ హత్య కేసు మిస్టరీ విడకపోవడానికి కారణాలుగా ఉన్నాయి. హతుడు సిపిఎం రాష్ట్ర నాయకుడు కావడం, దోషులెవరో పోలీసులు నిర్ధారించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు, శాసనసభలో సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు ప్రస్తావన, ముఖ్యమంత్రిని కలవడం తదితర విషయాల నేపథ్యంలో ఈ హత్య కేసు వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ నేపథ్యంలో ఈనెల నాలుగు నుండి రెండు రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు విచారించారు. 32 మందిని విచారణకు పిలవగా ముగ్గురు విదేశాలకు వెళ్లడం, ఒకరు అనారోగ్యంతో ఉండడంతో విచారణకు హాజరు కాలేదు. ఒకరు హాజరైన ఏదో ఒక కారణాల రీత్యా అతన్ని విచారించ లేదు. 27 మందిని విచారించారు. ఖమ్మం సిటిసిలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జరిగిన ఈ విచారణకు సంబంధించి లై డిటెక్టర్‌తో పాటు కంప్యూటర్ల ద్వారానే ప్రశ్నలు అడిగారని, సమాధానాలను సైతం కంప్యూటర్ల ద్వారా క్రోడీకరించారని విచారణకు హాజరైన వారు తెలిపారు. నిపుణుల కమిటీ దోషులెవరో ఖచ్చితంగా తేల్చకపోయినా ఈ హత్య కేసుతో ప్రమేయం ఉన్న కొందరి పేర్లతో కూడిన నివేదికను ఈనెల 20 తర్వాత పోలీస్ శాఖకు అందజేసే అవకాశం ఉందని సమాచారం. తొమ్మిది మాసాలు గడిచినా ఈ హత్య కేసుకు సంబంధించి దోషులెవరో తేలకపోవడం, సిపిఎం ఆందోళనలు, కాంగ్రెస్ ప్రతి విమర్శల నడుమ ఫోరెన్సిక్ నివేదిక ఇప్పుడు రెండు రాజకీయ పార్టీల మధ్య నలిగిన ఒక హత్య కేసుకు సంబంధించి స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. సామినేని హత్య కేసు నిందితులెవరో తేల్చడానికి మరి కొంత సమయం పట్టవచ్చు.

## సింగరేణి అభివృద్ధి, కార్మిక సంక్షేమమే ఎఐటియుసి లక్ష్యం

- కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శిగా జె.గట్టయ్య బాధ్యతల స్వీకరణ
- కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో నిర్మాణాత్మక చర్చలు: వంగ వెంకట్



ప్రజాపక్షం/చుంచుపల్లి: సింగరేణి సంస్థ అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ఎఐటియుసి ముందుకు సాగుతుందని ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ అన్నారు. కొత్తగూడెం ఏరియా ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జె.గట్టయ్యను శనివారం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్. వెంకటరమణకు వంగ వెంకట్ పరిచయం చేశారు. అనంతరం ఏరియాలోని పలువురు అధికారులను కూడా ఆయనకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వంగ వెంకట్ మాట్లాడుతూ సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంపొందిస్తూ సంస్థ మనుగడను కాపాడే విషయంలో ఏఐటీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. అదే సమయంలో కార్మికుల న్యాయమైన సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తూనే, పరిష్కారాల కోసం యాజమాన్యంతో నిర్మాణాత్మక చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించి ఎఐటియుసి పూర్తి సహకారం అందించాలని జీఎం సీహెచ్. వెంకటరమణను కోరారు. కార్మికులు, యాజమాన్యం పరస్పర సహకారంతో పనిచేస్తే సింగరేణి మరింత అభివృద్ధి చెందడంతోపాటు కార్మిక సంక్షేమం కూడా మెరుగుపడుతుందని అన్నారు. అనంతరం కొత్తగూడెం ఏరియా నూతన బ్రాంచ్ కార్యదర్శి జె.గట్టయ్యకు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా పరిధిలో కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ఏఐటీయూసీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఆఫీస్ బేరర్ సందబోయిన శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు మధుకృష్ణ, కమల్, సౌజన్య, నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, భీమయ్య, నరసింహారావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి, సంక్షేమ వసతి గృహం, సిహెచ్‌సిని ఎమ్మెల్యే తనిఖీ

నాణ్యమైన భోజనం, మెరుగైన వైద్యం అందించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సాంఘిక సంక్షేమ వసతి పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడిన ఎంఎల్‌ఏ, తరగతి గదిలో కాసేపు పాఠాలు బోధించారు. ఉన్నత లక్ష్యాలతో చదువులో రాణించాలని సూచించారు. అనంతరం సంక్షేమ పాఠశాల మెస్‌ను పరిశీలించి, నిర్దేశిత పట్టిక ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. భోజన నాణ్యతలో లోపాటు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీలో వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీసి, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్య, వైద్య లక్ష్యాలను నీరుగర్చావద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, సేవాదళ్ నాయకుడు తిరపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు సుమిత్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమగ్ర సాగునీటి ప్రణాళిక ప్రకటించాలి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు స్పష్టమైన అవగాహన కోసం ప్రభుత్వం ప్రణాళిక ప్రకటించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రకటించాలన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చు తగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగు నీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. ప్రాజెక్టుల్లో, రిజర్వాయర్‌లలో, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేర నీరు అందుబాటులో ఉంటుందనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలన్నారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్‌ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, నీటి లభ్యతపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలు రూపొందించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు.

## ఖమ్మం జిల్లాలో నకిలీ కలకలం

ఇద్దరు అధ్యాపకులకు నోటీసులు

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మంజిల్లాలో నకిలీ ధృవపత్రాల వ్యవహారం కలకలం సృష్టిస్తుంది. ఇంటర్మీడియట్ బోర్డు నకిలీ ధృవపత్రాలను సమర్పించారని 32 మందితో కూడిన ఒక జాబితాను విడుదల చేయగా అందులో ఖమ్మంజిల్లాకు సంబంధించిన ఇద్దరు అధ్యాపకులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసింది. గతంలో కాంట్రాక్ట్ పద్ధతిలో జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారు రెగ్యులర్ కావడంతో వారి ధృవపత్రాలను పరిశీలించే క్రమంలో ఈ నకిలీ వ్యవహారం వెలుగుచూసినట్లు తెలుస్తుంది. అయితే నకిలీవా లేక సరైనవా అన్న దానిపై వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశించింది. ఇతర రాష్ట్రాల్లోని విశ్వ విద్యాలయాల నుంచి పీజి పూర్తి చేసినట్లు ధృవపత్రాలు ఉన్నాయని ఉన్నతాధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న వారిలో వైరా కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పనిచేస్తున్న షేక్ రోషన్‌బీ, మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న జి. కృష్ణలు ఉన్నారు. వీరు ఇచ్చే సమాధానాన్ని బట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖకు సంబంధించిన అధికారి తెలిపారు. తేలితే ఉద్యోగాల్లో కొనసాగించే అవకాశం ఉందని సమాచారం.

## ఆదివాసీ బతుకులు ఆగం!

- విలక్షణ సంస్కృతికి ముప్పు... అభివృద్ధి మాటలకే పరిమితం
- పోలవరం పెను శాపం... మౌలిక వసతులు అంతంతే
- విద్య, వైద్యంలో వెనుకబాటుతనం.. ఐటిడిఎలపై పెరుగుతున్న ఆశలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:ప్రకృతితో మమేకమై అడవినే అమ్మగా.. నేలనే జీవనాధారంగా భావిస్తూ తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసీ సమాజం నేడు అనేక సమస్యలతో సతమతమవుతోంది. అభివృద్ధి పరుగులు తీస్తున్నా ఏజెన్సీ ప్రాంతాలకు దాని ఫలాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. మౌలిక వసతుల కొరత, విద్యవైద్యంలో వెనుకబాటుతనం, ఉపాధి అవకాశాల లేమి, భూమిఅటవీ హక్కుల సమస్యలు ఆదివాసీ జీవితాలను ఆగం చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,92,035 మంది గిరిజనులు ఉండగా.. మొత్తం 10,69,261 జనాభాలో 36.07 శాతం మంది గిరిజనులే.

**సంస్కృతికి ముప్పు:**

ఆదివాసీల భాష, ఆచారాలు, పండుగలు, కళలు, సంప్రదాయాలు దేశ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలు. ఆధునీకరణ, వలసలు, ఉపాధి కోసం పట్టణాలకు తరలివెళ్లడంతో కొన్ని సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఈ నేపథ్యంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ గిరిజన సంస్కృతి పరిరక్షణకు ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేశారు.



**పోలవరం.. పెను శాపం:**

పోలవరం ప్రాజెక్టుతో ముంపు, పునరావాసం, భూములు, కోల్పోవడం, జీవనాధారాలకు దూరమవడం వంటి సమస్యలు ఆదివాసీ కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పరిహారం, పునరావాసంతోపాటు భూమి, ఉపాధి, విద్య, వైద్యం, ప్రత్యామ్నాయ జీవనోపాధిపై సమగ్ర భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

**మౌలిక వసతులు అంతంతే:**

ఏజెన్సీలోని అనేక గ్రామాలకు రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా సదుపాయాలు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు. వర్షాకాలంలో వాగులు పొంగితే రాకపోకలు నిలిచిపోవడంతో అత్యవసర వైద్య సేవలు కూడా అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**విద్య.. వైద్యం వెనుకబాటు:**

ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత, రవాణా, ఆర్థిక ఇబ్బందులతో కొంత మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అవసరం. వైద్య రంగంలోనూ వైద్యులు, సిబ్బంది, మందులు, అత్యవసర సేవలను మరింత బలోపేతం చేయాలి. మొబైల్ మెడికల్ యూనిట్లు, అత్యవసర రవాణా సదుపాయాలు విస్తరించాలి.

**ఐటిడిఏపై ఆశలు:**

ఆదివాసీల సమగ్ర అభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటీడీఏలు ప్రభుత్వ పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, మౌలిక వసతులు, భూమిఅటవీ హక్కుల విషయంలో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని గిరిజనులు కోరుతున్నారు. పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా చివరి గిరిజన కుటుంబానికి చేరినప్పుడే ఐటీడీఏల లక్ష్యం నెరవేరుతుంది.

**హక్కుల పరిరక్షణే అసలైన అభివృద్ధి:**

ఆదివాసీ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు నిర్మించడం కాదు. భూమి, అటవీ హక్కులు, జీవనాధారం, సంస్కృతి, సంప్రదాయాలు, స్వయం పాలనకు రక్షణ కల్పించడమే నిజమైన అభివృద్ధి. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. ఆదివాసీ జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకొచ్చే కార్యాచరణకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది.

# షరతులు లేకుండా మహిళా కోటా అమలు

- రాహుల్‌గాంధీ డిమాండ్
- పునర్విభజన తర్వాతే కోటా అమలు జరుగుతుంది
- రాహుల్–రిజిజు మధ్య 'ఎక్స్' వేదికగా వాగ్వాదం



**న్యూఢిల్లీ:** ఎలాంటి షరతులు లేకుండా, దేనితోనూ ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. మహిళలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను బయటకు వ్యక్తం చేయలేకపోతే ఏ దేశమూ విజయం సాధించలేదని రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయడంతో చట్టసభలో మహిళా రిజర్వేషన్లు,నియోజకవర్గాల పునర్విభజనపై పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెణ్ రిజిజుకు ఆయనకు మధ్య వాగ్వాదం చెలరేగింది. వారిద్దరూ ఎక్స్ వేదికగా మాటల తూటాలు పేల్చుకున్నారు.నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్లు అమలు చేయండి, కాంగ్రెస్ మద్దతుతోనే పార్లమెంటులో ఈ బిల్లు పూర్తిస్థాయిలో విజయవంతంగా ఏకగ్రీవంగా అమోదం పొందిందన్న విషయం రిజిజుకు బాగా తెలుసు, మూడేళ్ళు గడచినా ఎందుకు మహిళా కోటా అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు, ఎందుకు అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజనకు, దీనికి ముడి పెడుతున్నారు అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. దీనికి ప్రతిగా కిరెణ్ రిజిజు స్పందిస్తూ, 2026లో జనాభా లెక్కల సేకరణ తర్వాత మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని, ఆ తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తాయన్న విషయం రాహుల్‌గాంధీకి చాలా స్పష్టంగా తెలుసునని ఎదురుదాడి చేశారు.

స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేయకపోతే ఏ దేశమూ విజయవంతం కాబోదని రాహుల్ చెప్పడాన్ని రిజిజు ప్రస్తావిస్తూ, ఆయనలో హృదయ పరివర్తన వచ్చిందని, ఇదేవిధమైన సహకారం చట్టం అమలులో కూడా అందించాలని కోరారు. దీనిపై ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీ స్పందిస్తూ, కాంగ్రెస్ మద్దతు కారణంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొంది చట్టరూపం దాల్చిందని గుర్తుచేశారు. 2023 నాటి ఈ చట్టాన్ని షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలోనూ, రాష్ట్రాలలో ఉన్న శాసనసభలలోనూ మహిళలకు ప్రత్యేకంగా సీట్ల కేటాయింపు అంశాన్ని 2023లో రాజ్యాంగానికి చేసిన 106వ సవరణలో పొందుపరచిన విషయం రాహుల్‌గాంధీకి చాలా స్పష్టంగా తెలుసునని,ఐనాగానీ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు చట్టసభల్లో అమలులోకి వస్తాయన్న విషయం రాహుల్‌గాంధీకి బాగా తెలుసునన్నారు.

"2026లో జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది, ఈ ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత తుది విడత జనాభా గణాంకాల జాబితాలు బయటకు వస్తాయి, ఆ తర్వాత కులపరంగా జనాభా గణాంకాల వివరాలను తేల్చవలసి ఉంది, ఈ వివరాలన్నీ పూర్తిగా జాబితాల ప్రకారం బయటకు రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది, ఈ కారణాల రీత్యా కనీసం 2034 నాటి సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఈ వ్యవహారం తేలకపోవచ్చు,అప్పటివరకూ మహిళా రిజర్వేషన్లు అమలు జాప్యం కావచ్చు, అందువల్ల తదుపరి 2029లో రాబోయే సార్వత్రిక ఎన్నికలనాటికి మహిళా రిజర్వేషన్లు ఇచ్చేందుకు వీలుగా ప్రస్తుతం తాజాగా అందుబాటులోకి వచ్చే జనాభా లెక్కల ప్రకారం వీలైనంత త్వరగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమలు చేసేందుకు శరవేగంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని కిరెణ్ రిజిజు స్పష్టం చేశారు.రాజ్యాంగ సవరణలతోపాటు లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు–2026లో చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా మహిళా రిజర్వేషన్ల అమలు పద్ధతి ఆధారపడి ఉంటుంది, ఐతే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశపెట్టినప్పటికీ ఈ బిల్లు ఆమోదం పొందలేదు, ఈ బిల్లును ఓడించారు, ఆ మరునాడే ఏప్రిల్ 17వ తేదీన మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన 106వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందింది, కానీ లోక్‌సభలో,రాష్ట్రాలలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలంటే 131వ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందాల్సి ఉంది, కానీ ఆమోదం పొందలేదు" అని కిరెణ్ రిజిజు కాంగ్రెస్‌పార్టీని తప్పుపట్టారు. అదేవిధంగా రాహుల్‌గాంధీకి,కాంగ్రెస్‌పార్టీకి ఒక విషయాన్ని బాగా గుర్తుచేయాలి, అందేమిటంటే కర్ణాటకలో ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ నాయకత్వంలో ఉన్న మంత్రివర్గంలో ఒక్క మహిళ కూడా మంత్రిపదవులు పొందలేదు, దీనిని బట్టి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో కాంగ్రెస్‌పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై అనేక సందేహాలు,ప్రశ్నలు తలెత్తుతున్నాయి" అని ఎక్స్ వేదికగా రిజిజు విమర్శించారు.

మహిళా రిజర్వేషన్,నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై గురువారంనాడు రిజిజు టెలిఫోన్ ద్వారా రాహుల్‌గాంధీతో సంభాషించారు. ఐతే ప్రతిపాదిత పునర్విభజన చట్టంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసిన సమాచారం. మహిళారిజర్వేషన్లు,నియోజకవర్గాల పునర్విభజన రెండూ ముడిపడి ఉన్నందువల్ల సహాయసహకారాలు అందించాలని కోరుతూ కిరెణ్ రిజిజు గడచిన రెండు రోజుల్లో రెండుసార్లు రాహుల్‌గాంధీతో ఫోన్‌లో మాట్లాడారు. పార్లమెంటు సమావేశాలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలని కోరుతూ గడచిన పది రోజుల్లో రాహుల్‌గాంధీని కిరెణ్ రిజిజు రెండుసార్లు ముఖాముఖీ కలిసి విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్‌పార్టీతో,ఇతర ప్రతిపక్షాలతో మేం సమన్వయ చర్యలు తీసుకున్నామని గడచిన గురువారం ఆయన మీడియాకు చెప్పారు.

**బిల్లును గెలిపించిందే కాంగ్రెస్**
**మా గురించి మీరు ఆందోళన చెందకండి**

ఒక్క మహిళా మంత్రి కూడా కర్ణాటక మంత్రివర్గంలో లేరని పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెణ్ రిజిజు ఎక్స్‌వేదికగా చేసిన విమర్శలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ తీవ్రంగా స్పందించారు. అసలు మహిళా రిజర్వేషన్లను నడిపించిందే మేం అంటే కాంగ్రెస్‌పార్టీ, మా పార్టీ వల్లనే లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది, కాంగ్రెస్‌పార్టీ మహిళల అభ్యున్నతికోసం కట్టుబడి ఉంది, కాంగ్రెస్‌పార్టీ మహిళలకు పార్లమెంటులో ఎన్నిసీట్లు ఇచ్చిందో మీకు తెలుసా? నా ఉద్దేశం ప్రకారం మీకు అవన్నీ గుర్తుండే ఉంటాయి, అందువల్ల కర్ణాటక గురించి మీరు దిగులు పెట్టుకోకండి, ఖచ్చితంగా మేం ఈ సమస్యను పరిష్కరించుకుంటాం,కాంగ్రెస్‌పార్టీ గురించి రిజిజు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు" అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా డి.కె.శివకుమార్ స్పందించారు.గురువారం జరిగిన "ఆస్క్ మీ ఎనీథింగ్" అనే సెషన్‌కు అదనంగా శివకుమార్ ఈ వ్యాఖ్యానాన్ని ఆయన తాజాగా జోడించారు.

# డిమాండ్లు నెరవేరేదాకా ఆందోళనలు

- జార్ఖండ్‌లో ఉద్యోగార్థులు స్పష్టీకరణ
- అభ్యర్థులతో జార్ఖండ్ ప్రభుత్వం జరుపుతున్న చర్యల్లో ప్రతిష్టంభన
- విద్యార్థుల డిమాండ్లను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ



**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీసు కమిషన్ సహా ఇతర నియామక పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలపై జరుగుతున్న భారీ ఆందోళనల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. శనివారం వివిధ సంఘాలతో చర్చలు జరిపింది. అయితే, తమ డిమాండ్లన్నీ నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని అభ్యర్థులు స్పష్టం చేశారు. దీంతో ఈ చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్ర మంత్రులతో కూడిన ఐదుగురు సభ్యుల ప్రభుత్వ బృందం, మొదట జెఎల్‌కెఎం నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో నేతృత్వంలోని ఆందోళనకారుల బృందంతో సమావేశమైంది. ఈ సమస్యపై మహతో చేస్తున్న నిరాహార దీక్ష ఏడవ రోజుకు చేరుకుంది. ఆ తర్వాత వారు కాంగ్రెస్ మద్దతు గల ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్, జెసిఎం ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యారు. శుక్రవారం రాత్రి, ప్రభుత్వం జెపిఎస్‌సి/ జెఎస్ఎస్‌సి సంస్కరణల వేదికకు చెందిన 10 మంది సభ్యుల బృందంతో ఇలాంటి చర్చలే జరిపింది. ఆందోళన చేస్తున్న అభ్యర్థుల డిమాండ్లు న్యాయమైనవని, వాటిని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దృష్టికి తీసుకెళ్తామని వరుస సమావేశాల అనంతరం ప్రభుత్వ బృందంలో సభ్యుడైన రాష్ట్ర మంత్రి సంజయ్ ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. పాలక జెఎంఎం విద్యార్థి విభాగమైన 'జార్ఖండ్ ఛాత్ర మోర్చా' (జెసిఎం), 14వ జార్ఖండ్ పిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష రద్దుతో సహా ఐదు డిమాండ్లను ప్రభుత్వ బృందం ముందు ఉంచింది. అనుమానాస్పదంగా ఉన్న అన్ని జెపిఎస్‌సి, జెఎస్ఎస్‌సి పరీక్షలపై 90 రోజుల్లోగా సిబిఐ విచారణ జరపడం 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' తరహాలో 'జార్ఖండ్ టెస్టింగ్ ఏజెన్సీ' (జెటిఎ)ని ఏర్పాటు చేయడం వంటి ఆరు డిమాండ్లను ఎన్ఎస్‌యుఐ ప్రభుత్వం ముందు ఉంచిందని ఆ సంఘం ప్రతినిధి సంజీవ్ షా తెలిపారు. ఆదివాసీ ఛాత్ర సంఘ్ నాయకుడు కార్తీక్ ఒరాన్ మాట్లాడుతూ అక్రమాలు జరిగిన పరీక్షలను రద్దు చేయడంతో పాటు, నియామక పరీక్షలలో గిరిజన, ప్రాంతీయ భాషలను అర్హత పరీక్షలుగా చేర్చాలని తాము డిమాండ్ చేశామన్నారు. రాష్ట్ర మంత్రి చమ్రా లిండా మాట్లాడుతూ, 'వివిధ గిరిజన సమూహాల సభ్యులు కూడా ఉన్న విద్యార్థి సంఘాలతో జరిగిన సమావేశం బహుశా ఇదే చివరి సమావేశం కావచ్చు. వారు నియామకాలలో పెండింగ్‌లో ఉన్న పోస్టుల భర్తీ, గిరిజన భాషల పరిరక్షణతో సహా మరో రెండు అంశాలను లేవనెత్తారు' అని చెప్పారు. ప్రభుత్వ బృందం మొదట మహతో నేతృత్వంలోని జెపిఎస్‌సి, జెఎస్ఎస్‌సి అభ్యర్థుల వేదికతో సమావేశమైంది. సుమారు రెండు గంటల పాటు చర్చలు కొనసాగాయి. కాగా, 'మేము లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు త్వరగా నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, 14వ జెపిఎస్‌సి పరీక్ష రద్దుతో సహా మా డిమాండ్లన్నీ నెరవేరే వరకు మా ఆందోళనలు కొనసాగుతాయి' అని ఆ వేదిక నాయకుడు ఒకరు తెలిపారు. ఈ చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని, నియామక ప్రక్రియలో విద్యార్థులు లేవనెత్తిన అక్రమాలు లేదా లోపాలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి దీపికా పాండే సింగ్ తెలిపారు. నియామక ప్రక్రియలో సంస్కరణల కోసం అభ్యర్థుల నుంచి సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం jpsc.jssc.feedback@gmail.com అనే ఇ–మెయిల్ ఐడిని అందుబాటులోకి తెచ్చిందని ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్ చెప్పారు. ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన 15వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్చలను చేపట్టింది. 14వ జార్ఖండ్ పిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష, అలాగే ఆ సంస్థ నిర్వహించిన అన్ని పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని మహతో పిటిఐతో అన్నారు. విద్యార్థులు రెండు వారాలకు పైగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నందున, రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆయన పేర్కొన్నారు. 'నా ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. రక్తపోటు, చక్కెర స్థాయిలు పడిపోతున్నాయి. ఛాతీలో ఇన్ఫెక్షన్ ఉందని డాక్టర్ చెప్పారు, ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఇదే పరిస్థితి కొనసాగితే నాకు ప్రమాదకరం. నేను కేవలం వినగలుగుతున్నాను, ఆలోచించగలుగుతున్నాను, నెమ్మదిగా మాట్లాడగలుగుతున్నాను' అని ఆయన తెలిపారు. ఆరోపిత అక్రమాలపై సిబిఐ లేదా రాష్ట్రం వెలుపలికి చెందిన రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తుల కమిటీతో స్వతంత్ర విచారణ జరపాలని నిరసనకారులు కోరుతున్నారు. జెపిఎస్‌సి పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి ఇప్పటివరకు 19 మందిని అరెస్టు చేశారు, అలాగే ఆ సంస్థ మాజీ చైర్మన్ ఎల్. ఖియాంగ్టేను జులై 28 నుండి నాలుగు సార్లు విచారించారు.

# ఢిలీ పోలీసుల్లా వ్యవహరించొద్దు

### నా నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే తొలగించాలి : దీప్కే



**ఛత్రపతి సంభాజీనగర్ :** మహారాష్ట్రలో ఛత్రపతి సంభాజీనగర్‌లోని తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (పిఎస్‌ఐ) తనను కలవడానికి వచ్చే ప్రజలను అడ్డుకుంటున్నారని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. అతన్ని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని వలుజ్ ఎంఐడిసి ప్రాంతంలో ఉన్న తన నివాసానికి వచ్చే సందర్శకులతో ఆ అధికారి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, అలాగే ప్రజల రాకపోకలను నియంత్రించడానికి, వారిపై నిఘా ఉంచడానికి ప్రయత్నిస్తున్నారని దీప్కే ఆరోపించారు. తనకు వచ్చిన బెదిరింపుల దృష్ట్యా, ఇంటి వద్ద గుమిగూడే జనాలను నియంత్రించడానికి భద్రత కల్పించబడిందని, అయితే, సాధారణ దుస్తుల్లో ఉన్న రాష్ట్ర సిఐడి సిబ్బంది తన నివాసం సమీపంలో తిరుగుతూ, 'హిట్ స్ప్రే' అనే సోషల్ మీడియా గ్రూప్‌లో సమాచారం చేరవేస్తున్నారని కూడా దీప్కే ఆరోపించారు. శుక్రవారం నాడు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో రెండు వీడియోలు వైరల్ అయ్యాయి; వీటిలో సిజెపి వ్యవస్థాపకుడు ఒక సీనియర్ పోలీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడటం, తన నివాసం వద్ద ఉన్న పిఎస్‌ఐని నిలదీయడం కనిపిస్తుంది. ఆ సంభాషణల సమయంలో, దీప్కే ఆ పిఎస్‌ఐని మందలించడం, తన ఇంటి వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నుండి అతన్ని తొలగించాలని కోరడం వినిపిస్తుంది. 'నేను రమ్మని పిలిచినప్పుడు ప్రజలను నా ఇంట్లోకి రానివ్వడంలో సమస్య ఏమిటి? మీరు ఢిల్లీ పోలీసుల మాదిరిగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యలూ రాలేదు. మిమ్మల్ని నేను చూడటం ఇదే మొదటిసారి. ఎవరిని కలవాలో, ఎవరిని కలవకూడదో మీరేమీ నాకు చెప్పనక్కర్లేదు' అని సాధారణ దుస్తుల్లో ఉన్న ఆ పిఎస్‌ఐతో దీప్కే ఒక వీడియోలో అనడం వినిపిస్తుంది. 'దయచేసి మీరు బయటకు వెళ్ళండి, మీరు నా ఇంట్లో ఉండటం నాకు ఇష్టం లేదు' అని సురేష్‌గా గుర్తించిన ఆ పిఎస్‌ఐతో అన్నారు. సిజెపి వ్యవస్థాపకుడు చేసిన ఆరోపణలపై వ్యాఖ్యానించేందుకు, వాలుజ్ ఎంఐడిసి ప్రాంతం తన అధికార పరిధిలోకి వచ్చే డిసిపి పంకజ్ అతుల్కర్, పలుమార్లు ప్రయత్నించినప్పటికీ అందుబాటులో రాలేదు.

# హిమాచల్‌లో బస్సు బోల్తా

- ఏడుగురు మృతి, మరో 11 మందికి గాయాలు
- బైరాగఢ్-తిస్సా రోడ్డులోని మలుపు వద్ద ప్రమాదం



**సిమ్లా :** హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చంబా జిల్లాలో శనివారం ఉదయం ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడి, కింద ఉన్న మరో రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. మరో 11 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. బైరాగఢ్–తిస్సా రోడ్డులోని 'చలుంజ్ మోర్' (మలుపు) వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ మార్గం మారుమూల చుర్హా లోయలో ఉండి, ఇరుకైన దారులు, నిటారుగా ఉండే లోయలతో కూడిన ప్రమాదకరమైన 27 కిలోమీటర్ల పర్వత మార్గం అని పోలీసులు పేర్కొన్నారు. ఎత్తైన ప్రాంతంలో ఉండే 'సచ్ పాస్'కు వెళ్లే మార్గంలో ఇది ఒక కీలకమైన భాగం. కాగా, తాజాగా ఘటనలో ఏడుగురు మరణించారని, 11 మంది గాయపడ్డారని ధృవీకరిస్తూ, చంబా ఎస్‌పి విజయ్ సక్లానీ పిటిఐతో చెప్పారు. బస్సులో ఉన్న వారి కచ్చితమైన సంఖ్య ఇంకా తెలియరాలేదన్నారు. ప్రయాణికుల ఆర్తనాదాలు విన్న స్థానికులు సహాయం కోసం అక్కడికి పరుగెత్తి పోలీసులకు సమాచారం అందించారని ఆయన తెలిపారు. ఘటనా స్థలంలో ఎన్‌డిఆర్ఎఫ్, పోలీసులు, హోమ్ గార్డ్స్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బందితో కూడిన బృందం సహాయక చర్యలు చేపడుతోందని పోలీసులు తెలిపారు. మరణించిన వారిని జగదేవ్ (50), దేశ్ రాజ్ (35), జహదేహి (24), హర్దేహి (43), నీలం (34), డ్రైవర్ రూప్ సింగ్ (35), కండక్టర్ తేజ్ సింగ్ (39)గా గుర్తించారు. వీరంతా చంబా జిల్లాలోని చురాహ్ ప్రాంతానికి చెందినవారు. గాయపడిన వారిలో కరణ్ సింగ్, సుష్మిత, పానో దేవి, ధని, ధర్మో దేవి, విజయ్ కుమార్లతో పాటు ఐదుగురు మైనర్లు (ప్రియాంక, హర్ష, కావ్య, అప్రిత్ మరియు నేహా) ఉన్నారు. గాయపడిన 11 మందిలో తీవ్ర గాయాలైన ఆరుగురిని చంబాలోని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని స్థానిక ప్రధాన్ మంధి రాణా తెలిపారు. బస్సు రోడ్డు మధ్యలో తలకిందులుగా పడి ఉన్న వీడియోలు వైరల్ అయ్యాయి. అందులో ప్రజలు సహాయం చేయడానికి ముందుకు రావడం కనిపిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లో జూన్ 30 నుండి ఆగస్టు 7 వరకు కొనసాగుతున్న రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 78 మంది మరణించారని పోలీసులు తెలిపారు.

### మోదీ ప్రభుత్వ ప్రతి నిర్ణయంలోనూ

# ట్రంప్ జోక్యం

### ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం కనిపిస్తోందని ఆరోపించారు. రష్యా చమురు కొనుగోళ్లపై భారత్‌తో సహా ఐదు దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు వీలు కల్పించే బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి వాణిజ్యం ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని సెనేట్ పేర్కొంది. ఎక్స్‌లో అమెరికా బిల్లుకు సంబంధించిన ఒక వార్తా కథనాన్ని ఆప్ అధినేత షేర్ చేశారు. 'దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టి, ట్రంప్ బానిసత్వానికి లొంగిపోయి, భారతదేశాన్ని అవమానించిన తర్వాత, మోదీ దేశానికి దీన్ని తెచ్చారు. ఈ రోజు, దేశం తీసుకునే ప్రతి చిన్న, పెద్ద నిర్ణయంలోనూ ట్రంప్ జోక్యం ఉంది. ట్రంప్ చెప్పేది తప్పైనా ఒప్పైనా, ప్రతీదానికీ మోదీ అంగీకరిస్తారు. ట్రంప్ ప్రతి రంగంలోనూ భారతదేశానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటారు' అని ఆయన ఒక హిందీ పోస్ట్‌లో ఆరోపించారు. ఇటీవలి కాలంలో, కేజ్రీవాల్ ఇథనాల్ మిశ్రమం విషయంలో ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. మిగులు అమెరికన్ ఇథనాల్‌కు మార్కెట్ సృష్టించడమే ఇ–20 విధాన లక్ష్యమని ఆయన ఆరోపించారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచకుండా లేదా ఇప్పటికే ఉన్న వాహనాలు అధిక ఇథనాల్ మిశ్రమానికి అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించుకోకుండా ప్రభుత్వం ఇ–20 విధానాన్ని బలవంతంగా విధించిందని ఆయన అన్నారు.

### ద్రోహులను కలుస్తారుగానీ...

# విద్యార్థులను కలవరా?

### ప్రధాని మోదీపై ఉద్ధవ్ థాక్రే మండిపాటు

**న్యూఢిల్లీ :** ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన శివసేన (యుబిటి) తిరుగుబాటు ఎంపిలతో ప్రధాని మోదీ సమావేశం కావడంపై ఉద్ధవ్ థాక్రే తీవ్ర విమర్శలు చేశారు. నిరసన చేస్తున్న యువతను విస్మరిస్తూ, 'ద్రోహుల' కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం మోదీ ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల ఎంపిలతో అల్పాహార సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత, ఉప ముఖ్యమంత్రి షిండే, ఆయన పార్టీలో కొత్తగా చేరిన ఆరుగురు ఎంపిలు ప్రధానమంత్రిని కలిశారు. షిండే నేతృత్వంలోని సేనను 'అసలైన శివసేన'గా గుర్తించిన ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ థాక్రే నేతృత్వంలోని పార్టీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరుగుతుంది. ఈ సమయంలో శివసేన (యుబిటి)ని వీడిన ఆరుగురు ఎంపిలతో మోదీ జరిపిన సమావేశం సుప్రీం కోర్టును 'భయపెట్టే' ప్రయత్నమా అని ఉద్ధవ్ థాక్రే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగం ఆధారంగానే ఉంటుందని, దానిపై తనకు పూర్తి నమ్మకం ఉందని థాక్రే అన్నారు. 'ప్రధానమంత్రికి యువకులను కలిసే సమయం లేదు, కానీ దేశద్రోహులను కలుస్తున్నారు. ఆయన (ప్రధాని) వారికి అండగా ఉన్నారని దేశద్రోహులకు హామీ ఇస్తున్నారు. మీరు సుప్రీంకోర్టును భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నారా?' అని థాకరే ప్రశ్నించారు. ఎంపిలకు, ప్రధాన మంత్రికి మధ్య జరిగిన సమావేశాన్ని ప్రస్తావిస్తూ, ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నప్పుడు 'దేశద్రోహుల'తో సమావేశం వెనుక కారణం ఏమిటని థాకరే ప్రశ్నించారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ముందు లేవనెత్తుతామని ఆయన తెలిపారు. ఆరుగురు ఎంపిలు ప్రత్యర్థి శివసేనలో విలీనం కావడాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గుర్తించడాన్ని శివసేన (యుబిటి) సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసింది. ప్రధాని న్యాయవ్యవస్థను, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను లేదా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను బెదిరిస్తున్నారా? అని థాక్రే ప్రశ్నించారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితిని ఆయన తుఫానుకు ముందున్న ప్రశాంతతగా అభివర్ణించారు. జెన్ జీ తరం చేస్తున్న నిరసనలు ప్రభుత్వాన్ని కుదిపేశాయని అన్నారు. జెన్‌జీ ప్రభుత్వాన్ని ఎలా మోకరింపజేసిందో ప్రపంచం చర్చిస్తోంది. ఈ తరానికి అండగా నిలబడటానికి బదులుగా, కొంత మంది (నిరసనకారులపై) దారుణంగా దాడి జరిగింది అని 'సంసద్ చలో' మార్చ్ సందర్భంగా జరిగిన పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అన్నారు. మొత్తం ప్రభుత్వాన్నే మార్చాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ఫేస్‌బుక్ లైవ్ సెషన్‌లు నిర్వహించినందుకు తాను విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ, పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రభుత్వాన్ని నడుపుతున్నారని థాక్రే అన్నారు. ప్రధాని దేశ భవిష్యత్తును కలవడానికి ఇష్టపడటం లేదని ఆరోపించారు. గురువారం నాడు జెన్‌జీతో మోహన్ భగవత్ జరిపిన చర్చలపై థాక్రే మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ అధిపతి చెప్పేది వినడానికి యువత సిద్ధంగా లేదని అన్నారు. నిరసన చేస్తున్న విద్యార్థులతో జార్ఖండ్ ప్రభుత్వం చర్చలు జరపాలని కూడా ఆయన అన్నారు.

# మహిళా బిల్లును తక్షణమే అమలు చేయాలి

### శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఎడి) డిమాండ్


**చండీగఢ్ :** మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఎడి) డిమాండ్ చేసింది. శనివారం ఛండీగఢ్‌లో పార్టీ సీనియర్ నాయకులు సమావేశమయ్యారు. 'మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుండి శిరోమణి అకాలీ దళ్ స్ఫూర్తిని పొందుతుంది' అని సమావేశం తర్వాత ఎస్ఎడి అధినేత సుఖ్బీర్ సింగ్ బాదల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జిపిసి) ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఒక ఆదర్శాన్ని నెలకొల్పిందని ఆయన అన్నారు. పార్లమెంటు ముందున్న కీలక అంశాలపై సమగ్ర చర్చల అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన, సమతుల్యమైన నియోజకవర్గాల పునర్విభజన జరగాలని కూడా శిరోమణి అకాలీ దళ్ డిమాండ్ చేసిందని బాదల్ తెలిపారు. 'అన్ని రాష్ట్రాల సీట్ల సంఖ్యను ఏకరీతిగా 50 శాతం పెంచడానికి భారత ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన ప్రతిపాదనకు శిరోమణి అకాలీ దళ్ మద్దతు తెలిపింది.

# అసోంలో 13 జిల్లాల్లో వరద ప్రభావం

## వరద బారినపడ్డ 1.55 లక్షల మంది

**గువహటి :** అసోంలో సంభవించిన వరదల కారణంగా 1.55 లక్షల మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారని, తాజాగా మరో మరణం సంభవించడంతో ఈ ఏడాది వరదల వల్ల మరణించిన వారి సంఖ్య 98కి చేరిందని అధికారులు శనివారం తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలు వరదల ప్రభావంతో ఉన్నప్పటికీ, అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న తూర్పు ప్రాంతంలోని నాలుగు జిల్లాల్లో శాశ్వత పునరావాస చర్యల కోసం నిధుల విడుదలను వేగవంతం చేసేందుకు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియను ప్రభుత్వం ఆదివారం నుంచి ప్రారంభించనుంది. శుక్రవారం నాటికి శివసాగర్, గోలాఘాట్, నాగావ్, హోజాయ్, సోనిత్‌పూర్, ధేమాజీ, దర్రాంగ్, బిశ్వనాథ్, కామరూప్ (మెట్రో), లఖింపూర్, ఉదల్గురి, జోర్హాట్, చరైడియో అనే 13 జిల్లాలు వరదల ప్రభావంతో ఉన్నాయి. మొత్తం 1,55,849 మంది ప్రజలు వరదల బారిన పడ్డారు. ఇందులో గోలాఘాట్ జిల్లా అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది (58,750 మంది), ఆ తర్వాతి స్థానాల్లో శివసాగర్ (48,286), జోర్హాట్ (25,259) ఉన్నాయి. గురువారం నాడు 15 జిల్లాల్లో 1.68 లక్షల మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. ప్రభుత్వ యంత్రాంగం 55 సహాయ శిబిరాలను నిర్వహిస్తూ, 10,000 మందికి పైగా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తోంది. వీటితో పాటు మరో 18 సహాయ పంపిణీ కేంద్రాలు కూడా పనిచేస్తున్నాయి. 10,748.64 హెక్టార్ల పంట విస్తీర్ణం నీట మునిగి ఉండగా, 47,000కు పైగా పశువులు ప్రభావితమయ్యాయి. జోర్హాట్, శివసాగర్, గోలాఘాట్, చరైడియో జిల్లాల్లో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు ఆగస్టు 9 నుండి 30 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తామని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శుక్రవారం ప్రకటించారు.

### 98కి చేరిన వర్ష సంబంధిత మృతుల సంఖ్య




స్వాతంత్ర్య పోరాట వారసత్వాన్ని, సామాజిక న్యాయానికి చేసిన సేవలను గౌరవిస్తూ సిపిఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి. రాజాకు క్రాంతిసింగ్ నానా పాటిల్ ఓపెన్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ఇటీవల ప్రదానం చేస్తున్న దృశ్యం

# 30 ఏళ్ళుగా ఎవరెస్ట్‌పై 'గ్రీన్‌బూట్స్'మృతదేహం



## దేశానికి తరలించేందుకు భారత్ యత్నాలు

**లడఖ్:** భారతదేశానికి చెందిన పర్వతారోహకుడు, ఐటిబిపి (ఇండో టిబెటెన్ బోర్డర్ పోలీస్)లో పనిచేసిన యోధుడు దోర్జే మోరూప్ (మరణించేనాటికి ఆయన వయసు 48)మృతదేహం అవశేషాలుగడచిన 30 సంవత్సరాలుగా ఎవరెస్టు శిఖరంపై 8,500 మీటర్ల ఎత్తున మంచుదిబ్బల్లో కూరుకుపోయి ఉన్నాయి. ఈ మృతదేహం కాళ్ళకు ఉన్న 'గ్రీన్‌బూట్స్' అక్కడకు వెళ్ళే పర్వతారోహకులను నిరంతరం ఆకర్షిస్తూనే ఉంటాయి. అందుకే దోర్జే మోరూప్ పేరు ఎవ్వరికీ తెలియకపోయినా ఆయనను పర్వతారోహకులు ''గ్రీన్‌బూట్స్''గా గుర్తుపెట్టుకుంటారు. ఆయన అదేవిధంగా ఇప్పటి వరకూ ప్రసిద్ధి చెందారు. పర్వతారోహకులకు మంచులో కూరుకుపోయిన ఆయన మృతదేహం ఒక విషాదకర హెచ్చరికగా ఉంటుంది. మోరూప్ మృతదేహంతోపాటే వంద సంవత్సరాలక్రితం ఎవరెస్టు పర్వతారోహకుల రికార్డులు ప్రారంభమైనప్పటినుండీ వివిధరకాల ప్రమాదాల్లో మరణించిన దాదాపు 300 మంది పర్వతారోహకుల మృతదేహాలు ఇదేవిధంగా ఎవరెస్టు శిఖరంపై వివిధ ప్రాంతాలలో కూరుకుపోయి ఉన్నాయి. ఈ మృతదేహాలు ఎవరివో గుర్తించి వెలికితీయడం ఎంతో పెద్ద శ్రమతో కూడిన సాహసకార్యం. కానీ చాలాకాలానికిగానీ మోరూప్ మృతదేహాన్ని గుర్తించలేకపోయారు. ఆనాడు ఆయనతోపాటు ఎవరెస్టు ఎక్కి సగం దూరం వెళ్ళి వెనక్కు తిరిగి వచ్చేసిన ఆయన సహచరులు చెప్పిన సమాచారం, వారు చెప్పిన ప్రదేశం గుర్తులు,జాడలను బట్టి ఇప్పుడు మోరూప్ మృతదేహభాన్ని గుర్తించారు. ఆయన కుటుంబానికి ఆ సమాచారం చేరవేశారు. ఇప్పుడు ఆయన మృతదేహాన్ని సురక్షితంగా త రలించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. తన తండ్రి మృతదేహాన్ని విజయవంతంగా కిందకు తీసుకువస్తే లడఖ్‌లోని త్యాగమూర్తుల ఉద్యానవనంలో ఆయనకు ఘనంగా అంత్యక్రియలు నిర్వహిస్తామని మోరూప్ కుమారుడు పంఛోక్ దోర్జే చెప్పారు.

ఐటిబిపికి చెందిన భారత సైనికుడు దోర్జే మోరూప్ మాత్రం అందుకు విరుద్ధంగా అత్యంత ప్రమాదకరమైన చైనా ప్రాంతం నుండి నేపాల్‌–టిబెట్ మధ్య ఉన్న ఎవరెస్టు ప్రాంతాన్ని అధిరోహించి చరిత్ర పుటల్లో నిలిచిపోవాలని, ఒక గొప్ప వీరుడుగా భారత్‌కు తిరిగి వచ్చి ఘనస్వాగతం పొందాలని భావించాడు. భారత్‌–చైనా సరిహద్దుల్లో లాన్స్‌నాయక్ హోదాలో ఐటిబిపి తరపున కాపలాకాసే దోర్జే మోరూప్‌కు పర్వతారోహణ ఎప్పుడూ కొత్త విషయం కాదు. తన భార్యకు కూడా ఆయన అదే విషయం చెప్పారు మోరూప్. ఆ విధంగా ఆయన 1996లో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారు. ఆయన ఎవరెస్టును విజయవంతంగా అధిరోహించినట్లు చైనా ప్రభుత్వం నుండి కూడా విజయచిహ్నంగా ఒక సర్టిఫికెట్ కూడా వచ్చింది. కానీ ఆయన మాత్రం తిరిగి కిందకు చేరుకోలేదు. మోరూప్‌తోపాటు మొత్తం ఆరుగురు పర్వతారోహకులు ఎవరెస్టు శిఖరాన్ని ఆనాడు అధిరోహించారు. వీరిలో ముగ్గురు తీవ్రమైన ప్రతికూల వాతావరణం మధ్య వెనుదిరిగి వచ్చేశారు. కానీ మోరూప్‌తోపాటు మిగిలిన ముగ్గురు త్సేవాంగ్ స్మాన్లా, త్సేవాంగ్ షాల్జోర్ మాత్రం 8,849 మీటర్లు ఎత్తు వరకూ ఎవరెస్టును విజయవంతంగా అధిరోహించారు. 1996 మే నెల 10వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు దోర్జే ఎవరెస్టు శిఖరానికి చేరుకుని కీర్తి పొందారు. తిరుగు ప్రయాణ సమయంలో కిందికి దిగుతున్నప్పుడు దురదృష్టవశాత్తూ హిమపాతం వారిపై విరుచుకుపడింది. వారు ముగ్గురు ఆ మంచులోనే సమాధి అయిపోయారు. వారి మృతదేహాలు మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూరుకుపోయాయి. సురక్షితంగా అక్కడే ఉండిపోయాయి. కానీ దోర్జే కాళ్ళు మాత్రం మంచులోంచి బయటకు కనిపిస్తూనే ఉన్నాయి. ఆయన కాలికి తగిలించుకున్న గ్రీన్‌బూట్స్ అటుగా వెళ్ళే పర్వతారోహకులకు ఒక విషాదహెచ్చరికగా కనిపిస్తాయి. కానీ ఆ మృతదేహం ఎవ్వరిదో తెలియదు. చివరకు ఆ మృతదేహం దోర్జేదే అని ఇప్పుడు గుర్తించారు. తాను ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తప్పకుండా తిరిగి వస్తానని, విమానాశ్రయానికి వచ్చి తనకు స్వాగతం చెప్పడానికి సిద్ధంగా ఉండాలని తన భార్య యాంగ్‌స్కిట్‌కు దోర్జే చెప్పివెళ్ళారు. అందువల్ల తన భర్త మరణించలేదని యాంగ్ స్కిట్ ఇప్పటివరకూ వాదిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు ఆయన మరణవార్త,మృతదేహాన్ని గుర్తించినవార్త వారి కుటుంబానికి చేరుకుంది.

# యుద్ధం నుండి బయటపడదాం

- కేవలం గగనతల దాడులతో ఇరాన్‌ను గెలవలేం
- ట్రంప్‌కు సెంట్‌కామ్ అధిపతి డాన్ కెయిన్ సలహా!
- వ్యూహం బెడిసి కొడుతుందని హెచ్చరికలు



**వాషింగ్టన్:** పశ్చిమాసియా యుద్ధం నుండి వీలైనంత త్వరగా బయట పడకపోతే ప్రతికూల ఫలితాలు వస్తాయని, ప్రమాదంలో పడతామని అమెరికా సెంట్‌కామ్ సర్వసైన్యాధిపతి డాన్ కెయిన్ (జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్) దేశాధ్యక్షుడు ట్రంప్‌కు రహస్యంగా ఒక సలహా ఇచ్చారని సిఎన్‌ఎన్ ఒక కథనం ప్రచురించింది. సిఎన్‌ఎన్‌తోపాటు ఇతర ప్రముఖ అంతర్జాతీయ మీడియా ఈ కథనాన్ని ప్రచురించాయి. ముగ్గురు అమెరికా అధికారులను మీడియా ఉటంకించింది. గగనతల దాడులతోనే ఇరాన్‌ను అదుపుచేసి పాదాక్రాంతం చేసుకోవాలని మొదటినుండీ ట్రంప్ భావిస్తున్నారు. భూతల దాడులు చేస్తే ఇరాన్ అనుసరించే పర్షియన్ తరహా వ్యూహాలవల్ల అమెరికా సైనికులు గణనీయస్థాయిలో మరణించే అవకాశాలు ఉన్నాయని ట్రంప్ భావిస్తున్నారు. ఆయుధాలు పుష్కలంగా ఉన్నాయని, అవసరానికి మించిన్ని నిల్వలు ఉన్నాయని ట్రంప్ గంభీర ప్రకటనల ద్వారా ఇరాన్‌ను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ గగనతల దాడులవల్ల ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని కొద్దిరోజుల క్రితం డాన్ కెయిన్ మొదటిసారి బహిరంగంగా ప్రకటించారు. ఆ తర్వాత అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ కూడా బాహాటంగా ఇదే విషయాన్ని చెప్పారు. కీలకమైన ఆయుధాల నిల్వలు తగ్గిపోతున్నాయని, ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయని హెగ్సెత్ తనదైన భాషలో బయటకు చెప్పారు. దీనిపై ట్రంప్ మింగలేక కక్కలేక హెగ్సెత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మళ్ళీ ఆయనతో తగాదా పెంచుకోలేక హెగ్సెత్‌తో తనకు విభేదాలు లేవని, ఆయన గొప్ప వ్యక్తి అని సమర్థించారు. కానీ వాస్తవాన్ని జీర్ణించుకుని వెనక్కు తగ్గేందుకు ట్రంప్ ఇష్టపడటం లేదు. ఈ దశలో సిఎన్‌ఎన్ కథనం సంచలనం సృష్టించింది. డాన్ కెయిన్ ఒంటరిగా ఈ అభిప్రాయం ప్రకటించలేదు. సిఐఎ డైరెక్టర్ రాడ్‌క్లిఫ్,విదేశాంగమంత్రి మార్కో రుబియో, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌లతో, ఇతర కీలక క్యాబినెట్ అధికారులతో కూడా ఆయన చర్చించారు. ట్రంప్‌తో ఏకీభవించే కీలక సలహాదారులతో కూడా డాన్ కెయిన్ సమావేశాలు జరిపారు. సైనిక ప్రత్యామ్నాయాలను, పరిమితులను, లోపాలను ఆయన సమీక్షించారు. సైన్యాన్ని కాపాడుకోవడానికి ట్రంప్ అనుసరించే ఎత్తుగడ యుద్ధంలో సరిపోదని ఆయన చెప్పారు. కొద్దివారాలుగా డాన్ కెయిన్ చాలా రహస్యమార్గాలలో ట్రంప్‌కు హెచ్చరికలు చేస్తున్నారు. యుద్ధం నుండి బయటపడే మార్గాలను అన్వేషించాలని ట్రంప్‌కు చెబుతున్నారు. రెండవ ప్రపంచయుద్ధం తరహాలో అతిభారీ దాడులు ఇరాన్‌పై చేస్తామని ఇటీవల అనేకసార్లు ట్రంప్ ప్రకటిస్తున్నారు. ఇరాన్ ఈ విషయంలో అణుబాంబు ప్రయోగం చేస్తారన్న ఆలోచనలు చేస్తూ ప్రతివ్యూహాలతో అంతర్జాతీయ సంఘీభావాన్ని కూడగడుతోంది. కానీ దాడులను పెంచితే అమెరికా వ్యూహం వికటిస్తుందని డాన్ కెయిన్ ట్రంప్‌కు హెచ్చరిక చేశారని సిఎన్‌ఎన్ పేర్కొంది.

యుద్ధం నుండి ఎలా బయటపడాలనే విషయంపై ట్రంప్‌కు ఒక అవగాహనగానీ, ఒక ప్రణాళికగానీ లేదని ఇరాన్ పాలకులు ఇప్పటికే ఎద్దేవా చేశారు. ఇదే విషయాన్ని ట్రంప్ స్వయంగా రుజువు చేసుకుంటున్నారు. 14,000 లక్ష్యాలపై దాడులు చేసి ఇరాన్‌ను రాతియుగంలోకి నెట్టేశామని ట్రంప్ పదే పదే చెప్పారు. ఐనాగానీ ఇరాన్ యుద్ధ దాడులు చేసేందుకు నేటికీ సంసిద్ధత వ్యక్తం చేస్తోంది తప్ప వెనక్కు తగ్గడం లేదు. తాము ప్రతిఘటన వ్యూహం అనుసరిస్తున్నాం తప్ప యుద్ధం చేయడం లేదని ఇరాన్ ప్రకటించింది.ఈ దశలో ట్రంప్ ఎటూకాని చౌరాస్తాలో నిలబడిపోయారు. ఐతే ట్రంప్ కూడా ఇరాన్‌ను నూటికి నూరుశాతం ఇరాన్‌ను బెదిరించి లొంగదీసుకోవాలని కోరుకుంటున్నారు. కానీ ఇరాన్ అందుకు సిద్ధంగా లేదని ఆచరణలోగానీ ట్రంప్‌కు అర్థం కాలేదు. మొజ్తాబా ఖమేనీకి ఇరాన్‌ను పాలించే అర్హత లేదని, ఆయన దేశ నాయకుడుగా పనికిరాడని, అన్ని వ్యవహారాలను చక్కబెట్టగల సామర్థ్యంలేదని మొదట్లో విమర్శించిన ట్రంప్ ఆ తర్వాత మొజ్తాబా ఖమేనీని మెచ్చుకున్నారు. వీలైతే ఆయనను కలుసుకోవాలని కోరుకుంటున్నానని ప్రకటించారు. ఇరాన్ లోతు ఎంతో యుద్ధంలో దిగితేగానీ ట్రంప్‌కు అర్థం కాలేదు. ఇదే విషయాన్ని డాన్ కెయిన్ తనదైన భాషలో చెప్పారు. అమెరికన్ ప్రజలు ట్రంప్‌ను మొదటినుండీ ఈ యుద్ధం మంచిదికాదని హెచ్చరికలు చేస్తున్నారు. ప్రజల్లో ఆయన రేటింగ్ పడిపోవడానికి కారణం ఇదే. యుద్ధం మూడు వారాలలో ముగిసిపోతుందని ట్రంప్ మొదట ప్రకటించారు. కానీ ఆ పరిమితి దాటిపోయిందని, ఐదు నెలలు గడచిందని డాన్ కెయిన్ చెబుతున్నారు.ఐతే కెయిన్ ప్రతినిధి జోసెఫ్ హోల్‌స్టెడ్ ఈ కథనాలను కొట్టిపారేశారు.జాతీయ ప్రయోజనాలకు ఏది ఉత్తమమో ఆ నిర్ణయమే ఆయన తీసుకుంటారన్నారు.

### నాటో తరహా ఒప్పందంతో సౌదీకి భద్రత లేదు: ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్:** నాటో తరహాలో సౌదీఅరేబియా చేసుకున్న రక్షణ ఒప్పందం వల్ల ఆ దేశానికి ఎలాంటి భద్రతా సమకూరబోదని ఇరాన్ హెచ్చరించింది. పాకిస్థాన్,టర్కీ దేశాలతో సౌదీ అరేబియా శుక్రవారం మక్కాలో ఒక రక్షణ ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందానికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రచారం లభించింది. హౌతీలు ఒకవైపు,ఇరాన్ ఐఆర్‌జిసి మరోవైపు దాడులకు తెగబడుతున్న తరుణంలో సౌదీ అరేబియా చేసుకున్న ఒప్పందంపై ఇరాన్ విమర్శలు గుప్పించింది. సౌదీఅరేబియా,టర్కీ,పాకిస్థాన్ మూడు దేశాలలో ఏ ఒక్కదేశంపై దాడి జరిగినాగానీ తమపైనే దాడి జరిగినట్టుగా మూడు దేశాలు భావిస్తాయి. దేశాల రక్షణకు ఈ మూడు ప్రభుత్వాలు సైనిక,రక్షణ సహకారాలు అందజేసుకుంటాయి. పరస్పరం సైన్యాలను పంపుకుంటాయి. ఇప్పటికే పాకిస్థాన్,టర్కీ మధ్య సైనికశిక్షణ,ఆయుధాల మార్పిడి ప్రక్రియలు జరుగుతున్నాయి. సౌదీఅరేబియాపై ఇరాన్ దాడులు చేయడంతో యుద్ధంవల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. సౌదీ అరేబియా చమురు ఎగుమతులకు, వాణిజ్యానికి, అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణ కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం కలగడంతో ఈ త్రైపాక్షిక రక్షణ ఒప్పందం చేసుకుంది.

# మానవాళిపై ఘోరనేరం హిరోషిమా–నాగసాకి

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఖండన

**టెహ్రాన్:** జపాన్‌లోని హిరోషిమా,నాగసాకి నగరాలపై అమెరికా చేసిన అణుబాంబు దాడులు మానవాళిపై చేసిన ఘోరమైన నేరాలని ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ విమర్శించారు. రెండవ ప్రపంచయుద్ధం చివరిదశలో ఈ రెండు నగరాలపై 1945వ సంవత్సరం ఆగస్టు 6వ తేదీ, ఆగస్టు 9వ తేదీలలో వరుసగా అమెరికా అణుబాంబులు ప్రయోగించడంతో లక్షలమంది ప్రజలు మరణించారు. ఈ బాంబు దాడులు జరిగి 81 సంవత్సరాలు గడిచింది. మరణించిన లక్షలమంది ప్రజలను సంస్మరిస్తూ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ సోషల్ మీడియా వేదికగా అమెరికాను తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తూ వ్యాఖ్యానం రాశారు. ఇలాంటి ఘోరాలు మళ్ళీ ఎన్నటికీ జరగకూడదు,దేశాలను,నాగరికతలను తుడిచిపెట్టేస్తామని ఆనాటి మనస్తత్వాన్ని ఈనాటికీ ప్రదర్శిస్తున్నారు, అలాంటి వారిని,వారి మనస్తత్వాలను తిరస్కరించాలి, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఈనాటికీ వారు బెదిరిస్తున్నారు, దీనిని అందరూ ఖండించాలి'' అని సోషల్ మీడియా ద్వారా పెజెష్కియన్ విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదు నెలలుగా ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న ట్రంప్ అనేకసార్లు ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామని బెదిరించారు. తమకు లొంగి ఉండాలని, తమకు అనుకూలమైన ఒప్పందాలు చేసుకోవాలని ఈనాటికీ ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఇరాన్ మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తన దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడంకోసం తీవ్ర పోరాటం చేస్తోంది. విధ్వంసం సృష్టిస్తూ దేశాలను బెదిరిస్తున్నారు,పౌర మౌలిక సదుపాయాలను కూడా లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేస్తున్నారు,ఈ వినాశకరమైన మనస్తత్వాన్ని ఖండించాలి'' అని రాశారు.

# ఏడునెలల్లో 3,323 మంది భారతీయులను బహిష్కరించిన కెనడా

**ఒట్టావా:** కెనడా ప్రభుత్వం ఈ ఏడాదిలో గడచిన ఏడు నెలలుగా 3,323 మంది భారతీయులను ఆ దేశం నుండి బహిష్కరించింది. గడచిన ఆరు సంవత్సరాలలో ఎన్నడూలేనివిధంగా భారీసంఖ్యలో భారతీయులను కెనడా ప్రభుత్వం బహిష్కరించిందని కెనడా బోర్డర్ సర్వీసెస్ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది 12 నెలల్లో 3,779 మంది భారతీయులను కెనడా నుండి బహిషకరించగా, ఈ ఏడాది ఆరునెలల్లోనే ఆ స్థాయిలో భారతీయులను ఆ దేశం బహిష్కరించింది. కెనడా ప్రభుత్వం తన వలస విధానంలో భారీ మార్పులు తీసుకువచ్చింది. విదేశీ కార్మికులు, విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలని నిర్ణయించింది. చాలా యూరప్‌దేశాలు, అమెరికాఖండ దేశాలు ఇదే విధానం అనుసరిస్తున్నాయి. తాత్కాలిక నివాసితుల సంఖ్య తగ్గించుకోవాలన్న కెనడా ప్రభుత్వ వైఖరి మారిన నేపథ్యంలో ఈ గణాంకాలు విడుదలయ్యాయి. వలస నిబంధనలు పాటించకపోవడం, వలస దరఖాస్తులను తిరస్కరించడం,వీసా గడువు ముగిసినాగానీ దేశంలోనే ఉండిపోయి నిబంధనలు ఉల్లంఘించడం, వీసా మోసాలు వంటి అనేక కారణాలతో భారతీయులు కెనడా నుండి బహిష్కృతులయ్యారని గణాంకాలు వెల్లడించాయి. కెనడా నుండి వలస ప్రజలను బహిష్కరించడంలో మెక్సికో ప్రజలు గడచిన ఐదు సంవత్సరాలుగా ప్రథమస్థానంలో ఉండగా, భారతీయులు రెండవస్థానంలో ఉన్నారు. 2020లో 1424 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఆ సంవత్సరంలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2021లో 608 మంది, 2022లో 786 మంది, 2023లో 1,132 మంది, 2024లో 2,004 మంది భారతీయులను కెనడా బహిష్కరించింది.

## చార్జీలు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

వివరించింది. ఎండిఆర్ చార్జీలు కూడా డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల కంటే తక్కువగా ఉంటాయని వెల్లడించింది. ఇటీవల లోక్‌సభలో ఆమోదం పొందిన పన్నులు ఇతర చట్టాల సవరణ బిల్లు 2026పై ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో కేంద్రం ఈ వివరణ ఇచ్చింది. యుపిఐ సేవల దీర్ఘకాలిక స్థిరత్వం కోసం చట్ట సవరణ చేశామని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. సైబర్ సెక్యూరిటీ, ఫ్రాడ్ నివారణకు భారీ పెట్టుబడులు అవసరమన్న కేంద్రం అందులో భాగంగానే ఎండిఆర్ చార్జీలను ప్రతిపాదించినట్లు తెలిపింది. ఈ సవరణ బిల్లు పార్లమెంట్ ఆమోదం తర్వాత, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని యుపిఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఎండిఆర్ ఛార్జీలపై తుది నిర్ణయం తీసుకుంటుందని కేంద్రం తెలిపింది.

## ప్రకటన చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడం వల్లే సభా సమయం వృథా కారణమని పేర్కొంది. అదే విధంగా 'చందా చోరీ' అంశంపై కూడా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడకపోవడం వల్లే గత పక్షం రోజులుగా పార్లమెంట్ సక్రమంగా పనిచేయడం లేదని దుయ్యబట్టింది. గొప్పలు చెప్పుకుంటూ, ఆర్భాటాలతో విర్రవీగే ఈ ద్వయం.. ఇప్పుడు పిరికివాళ్ళుగా మారారా' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జైరామ్ రమేశ్ ట్విట్టర్ వేదికగా ఎద్దేవా చేశారు. 'వరుసగా 15 రోజులుగా పార్లమెంట్ సక్రమంగా పనిచేయకపోవడానికి ఒకే ఒక్క కారణం ఉంది: ముఖ్యంగా జులై 20న నిరసన తెలుపుతున్న యువత, విద్యార్థులపై పోలీసుల క్రూరత్వంపై ఉభయ సభలకు వచ్చి ప్రకటన చేయడానికి కేంద్ర హోం మంత్రి నిరాకరించారు' అని రమేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. జులై 20న, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) పార్లమెంట్‌కు చేపట్టిన 'సంసద్ చలో' మార్చ్ హింసాత్మకంగా మారింది. పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. షా తన ఛాంబర్‌కు వచ్చి గంటల తరబడి కూర్చుంటారని, కానీ గత నెలలో జాతీయ రాజధానిలో నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు చేసిన చర్యల గురించి లోక్‌సభ, రాజ్యసభలలో ఎంపిల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఆయనకు లేదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. విద్యార్థులపై చర్యలు నేరుగా ఆయన ఆదేశం, నియంత్రణలోనే ఉన్నాయని ఆరోపించారు. సభకు నిరంతరం గైర్హాజరు కావడం ఏమిటిని మండిపడ్డారు. 'ఈ సమావేశాల్లో పార్లమెంటుకు మరో నాలుగు రోజులు సమయం ఉంది. కేంద్ర హోంమంత్రి ముందుగా పోలీసుల దురాగతాలపై మాట్లాడాలి. 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో తాను ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ట్రస్ట్ చేసిన 'చందా చోరీ ఆస్థా ధోకా'పై ప్రధానమంత్రి మాట్లాడాలి. ఆయన స్వయంగా ఎంపిక చేసిన ట్రస్ట్ భారతీయులందరి నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేసింది, దీనిపై ఆయన మౌనంగా ఉండలేరు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

# వివాదస్పదంగా 'ఉపాధ్యాయ' పదోన్నతులు

- అర్హతలున్నా.. ప్రిన్సిపాల్స్‌గా దక్కని అవకాశం
- '1998 బ్యాచ్'లో కొందరికే పదోన్నతులు
- ఉల్లంఘనలు, నిబంధనలు విరుద్ధంగా సీనియారిటీ జాబితా
- ఆందోళనలో 'ప్రభుత్వ డిగ్రీ' కళాశాల ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పదోన్నతుల వ్యవహారం వివాదస్పదంగా మారుతోంది. యుజిసి,నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ పదోన్నతుల పర్వం కొనసాగుతోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హతలు ఉన్నవారిని కాదని, అనర్హులకు పదోన్నతులు కల్పిస్తున్నారని, తద్వారా అర్హులైన వారు పదోన్నతులకు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 1998 బ్యాచ్‌కు చెందిన ఉపాధ్యాయుల్లో చాలా మంది పదోన్నతులకు దూరంగా ఉన్నారు. ఇందులో కొందరు రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నారు. ఈ విషయమై ఇటీవల డిగ్రీ ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నీట్), స్టేట్ లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (స్లేట్) లేదా పిహెచ్‌డి వంటి అత్యున్నత విద్యార్హతలు కలిగి న్నప్పటికీ పదోన్నతులు దక్కక పోవడం పట్ల పలు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ నియామకాలు, పదోన్నతులకు యుజిసి నిబంధనల ప్రకారం నీట్, స్లేట్ లేదా పిహెచ్‌డి తప్పనిసరి ఉన్నవారిని అర్హులుగా నిర్ణయించారు. అయితే అర్హులు లేకపోవడంతో 2010లో జారీ చేసిన జీవో ప్రకారం అర్హత లేని వారికి షరతులతో కూడిన పదోన్నతులు కల్పిస్తూ, ఐదేళ్ల వ్యవధిలో (2015 నాటికి) సంబంధిత అర్హతలు సాధించకపోతే తిరిగి వారిని జూనియర్ లెక్చరర్లుగా డిమోట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్టు ఉపాధ్యాయ వర్గాలు పేర్కొన్నాయి. 2006 నుంచి నోషనల్ పదోన్నతులు పొందిన వారు ఏకంగా ప్రిన్సిపాల్స్‌గా నియమించడం గమనార్హం. ఇలాంటి చర్యలతో 2003, 2005, 2006 సంవత్సరాల్లో అర్హత లేని వారికి పదోన్నతులు దక్కగా, 1998 బ్యాచ్‌కు చెందిన చట్టబద్ధమైన అర్హులైన ఉపాధ్యాయులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు దక్కలేదు. ఇలా సుమారు 51 మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ పదోన్నతులో కోసం పడిగాపులు కాస్తున్నారు.

### 75 పోస్టుల్లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్స్

రాష్ట్రంలో మొత్తం 159 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1430 మంది రెగ్యులర్ లెక్చరర్లు ఉండగా,నీట్,స్లేట్ /పిహెచ్‌డి అర్హత ఉన్నవారు 1,320మంది ఉన్నారు. అర్హత లేని వారు 110 మంది ఉన్నారు. మొత్తం డిగ్రీ అధ్యాపకులు 4,250 ఉండగా, ఇందులో కాంట్రాక్ట్ 750, 150, గెస్ట్ ఫ్యాకల్టీలు 1,920 మంది ఉన్నారు. మొత్తం 159 ప్రిన్సిపాల్ పోస్టులకు గాను 84 మందే ఉన్నారు. మిగిలిన 75 పోస్టులలో ఇన్‌చార్జ్‌లు ఉన్నారు. ఇందులో కొందరు అనర్హులు ఉన్నట్టు సీనియర్లు ఆరోపిస్తున్నారు. 1998 బ్యాచ్‌కు చెందిన దాదాపు 90 మందికి పైగా సీనియర్ అధ్యాపకులకు అర్హతలు ఉన్నప్పటికీ కొందరు మాత్రం తమకంటే జూనియర్ల కింద పని చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తెలంగాణకు చెందిన 2010 బ్యాచ్ సీనియర్లను కాదని, ఇతర జోన్లు, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి.

### జూనియర్ల తర్వాత సీనియర్లు

ఇటీవల డిగ్రీ కళాశాల ఉపాధ్యాయ పదోన్నతుల విషయంలో సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. ఇందులో సీనియర్లను కాదని జూనియర్లను మొదటి వరుసలో పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై క్యూజీడీఎల్‌ఏ అధ్యక్షుడు డాక్టర్ టి.ఎస్.ప్రవీణ్ కుమార్ కమిషనరేట్ కాలేజీయేట్ ఎడ్యూకేషన్‌లో పిర్యాదు చేశారు. దీంతో ఈ పక్రియను సమీక్షించాలని ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. 15 సంవత్సరాల తర్వాత విడుదల చేసిన సమగ్ర సీనియారిటీ జాబితాలో తన పేరు లేదని, 20012005 జూనియర్ల కంటే 1998 బ్యాచ్‌కు చెందిన తనను 147వ స్థానానికి పరిమితం చేశారని టి.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అర్హులైన వారికి నోషనల్ సీనియారిటీ ఇవ్వాలని ప్రభుత్వం మెమో నెం.6518/సిఇ/ఎ1/2019ను విద్యా శాఖ అమలు చేయడం లేదని బాధిత ఉపాధ్యాయుల తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సానుకూలమైన తీర్పు వచ్చినప్పటికీ, ఆ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## గొప్ప శక్తి

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో అర్థంలేకుండా పోయింది, ఎందుకంటే ఆ సర్టిఫికెట్లవల్ల యువతరానికి ఉద్యోగాలు రావడంలేదు, దేశంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా మూసుకుపోయాయి,తయారీరంగం క్షీణించిపోయింది, రుణాలు పొందడం అతికష్టమైన విషయంగా మారింది, పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ముందుగానే బయటకు వస్తున్నాయి, కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాలు కోల్పోతున్నారు, విద్యార్థుల భవితవ్యాన్ని వారి అవకాశాలను కృత్రిమ మేధ దెబ్బతీస్తోంది'' అన్నారు.

ఇటీవల దేశంలో జరిగిన విద్యార్థుల ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, దేశంలో విద్యార్థులు,యువకులు చీకట్లో దీపం వెలిగించారు, చీకటిని పారద్రోలి వెలుగులు నింపారు,ఈ విధంగా చీకటిని పారద్రోలి వెలుగులు నింపడం ద్వారా దేశంలో యువకులు,విద్యార్థులు తమ భయాలను జయించారు,ఆ విధంగా చేయడం ద్వారా దేశంలో పెద్ద మార్పు తీసుకువచ్చారు,మనం ఎన్నడూ విద్వేషానికీ, హింసకూ పాల్పడబోం,మనం ప్రేమతో,అభిమానంతో దేశవ్యవస్థలో మార్పు తీసుకువస్తాం'' అని రాహుల్‌గాంధీ చెబుతూ, దేశంలో యువకులు దీనికి అనుగుణంగానే నడచుకోవాలని కోరారు.

ఈ సభలో భారీసంఖ్యలో యువకులు,విద్యార్థులు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగించారు.విద్యార్థి సమస్యలు,దేశంలో ప్రభుత్వ పరీక్షలకు సంబంధించిన అవకతవకలు వంటి అనేక అంశాలను ఆయన కూలంకషంగా వివరించారు. ఈ సభాస్థలి వద్ద వర్షం కారణంగా నీరు నిలిచిపోయింది. అంతా బురదమయంగా ఉంది. ఐనప్పటికే భారీసంఖ్యలో యువకులు,నిరుద్యోగులు ఈ సభకు హాజరై రాహుల్ గాంధీ ప్రసంగాన్ని ఆలకించారు.రాహుల్‌గాంధీ ప్రసంగానికి ముందుగా ముంబై నుండి వచ్చిన ర్యాపర్స్ నృత్యప్రదర్శనలు చేశారు. దీనికి ముందుగా శుక్రవారంనాడు కాంగ్రెస్‌పార్టీ నగరంలో భారీసంఖ్యలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించింది. ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అజయ్ రాయ్ నాయకత్వంలో ఈ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో విద్యార్థులు అనేక సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువచ్చారు. పరీక్షలకు సంబంధించి అనేక ఫిర్యాదులు చేశారు. ఈ అంశాలన్నింటినీ రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకు వెళతారన్న ఆశాభావం వారు వ్యక్తం చేశారు.

## నిలిచిపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ పరిపాలనా అంశాలుగా చూడకుండా అత్యంత ప్రాధాన్యత అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధి అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దన్నారు. ఇంజినీరింగ్ పనులు ఒకవైపు కొనసాగుతుండగానే సాధ్యమైన ప్రాంతాల్లో భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను సమాంతరంగా చేపట్టాలని సూచించారు.

సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని ఆదేశించారు. పనులకు అడ్డంకిగా మారిన భూసంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధనలన్నీ ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి పత్తిపాక రిజర్వాయర్ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. తద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువలో డి83 నుంచి డి94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన వివరించారు.

### 'పత్తిపాక'కు రెండు ప్రత్యామ్నాయాలు..

పత్తిపాక వద్ద 3 టిఎంసీలు లేదా 5 టిఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించే రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారని, లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయిందని, బోర్హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

### ప్రాజెక్టుల వారీగా సమగ్ర వివరాలు ఇవ్వండి...

ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక జాబితా సిద్ధం చేయాలని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఏ ప్రాజెక్టులో ఏ సమస్య ఉంది? దాని పరిష్కారానికి ఎంత నిధి అవసరం?, ప్రస్తుతం ఏ దశలో ఉంది? ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? అనే అంశాలన్నింటినీ స్పష్టంగా వెల్లడించాలన్నారు. ఈ సమీక్షలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు,నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మరొకరికి సన్మానం

(మొదటి పేజీ తరువాయి)

యూనిఫారంలో పాల్గొన్న పోలీసు అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగ సదరు అధికారికి సన్మానం కూడా జరిపడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. పోలీసు ప్రవర్తనా నియమావళి అం దరికీ సమానంగా వర్తించాలనే రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా పై ఘటనలు చోటుచేసుకోవడం దేశంలో రెండు చట్టాలను అమలు పరుస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

### మొహర్రం ఊరేగింపులో..

ఈ ఏడాది జూన్‌లో మొహర్రం ఊరేగింపు జరిగింది.బీహార్ లోని ముజఫర్పూర్‌లో ఒక మొహర్రం ఊరేగింపులో బందోబస్తులో పోలీసు యూనిఫామ్ లో ఉన్న ఒక సబ్ ఇన్స్పెక్టర్ ముస్తకీఫ్ ఖాన్ ఓ భక్తుడి నుంచి కత్తి తీసుకుని తి ప్పుతూ ఆ ఊరగింపులో పాల్గొన్నాడు . కొద్దిసేపు కత్తి ప్రదర్శన చేశాడు. నిజానికి పోలీసులు ఈ విధంగా ఉండడం వాళ్ళ నియమావళి ప్రకారం తప్పు. దీంతో అధికారులు ఆయన మీద చర్యలు తీసుకున్నారు..ముజఫర్పూర్ ఎస్‌పి కాంతేష్ కుమార్ మి శ్ర దీని మీద విచారణకు ఆదేశించారు . ముస్తకీం ఖాన్ కు షోకాజ్ నోటీస్ జారీ చేసి అక్కడి నుంచి ట్రాన్స్ఫర్ చేశారు. పోలీసులు ఆ అధికారి మీద తీసుకున్న చర్య ఖచ్చితంగా తీసుకోవాలి ఎందుకంటే పోలీస్ ప్రవర్తన నియమాల ప్రకారం అది చేయాలి.

### ఉత్తరప్రదేశ్ కావడి యాత్ర...

గంగానదిలో పవిత్ర జలాన్ని తీసుకువచ్చి శివాలయాల్లో అభిషేకం చేయడం కావడి యాత్ర ప్రధాన ఉద్దేశం.మతానికి సంబంధించిందే ఒక రకమైన ఒక తీర్థ యాత్ర ఇది. గంగా నదికి వెళ్లి గంగా నదిలో నీటిని తీసుకొని వాళ్ళ గ్రామాల్లో వాళ్ళ వాళ్ళ దేవాలయాలో చల్లుతారు.

అయితే ఈ నీటిని తీసుకున్న వ్యక్తి ఆగకుండా పరుగుపెట్టాల్సి ఉంటుంది. ఇదొకరకమైన మత ఊరేగింపు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కావడి యాత్రలో రహదారి వెంట గంగా జలాన్ని పాత్రలో తీసుకుని భక్తులు పరుగు పెట్టారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు రోడ్డుకు ఇరువైపుల బందోబస్తులో ఉన్నారు. ఈ బందోబస్తులో ప్రేమ్ మిశ్రా అ నే ఒక కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నాడు. గంగా జలాన్ని ఓ భక్తుడు ఒక పాత్రలో తీసుకుని పరిగెడుతు తీసుకెళ్తున్నాడు అదీ ఎక్కడ ఆగొద్దు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళకి అందిస్తూ వెళ్ళాలి . ఈ క్రమంలోనే బందోబస్తులో పోలీసు యూనిఫామ్ లో ఉన్న ప్రేమ్ మిశ్ర ఆ గంగాజలాన్ని పట్టుకొని పరిగెత్తాడు. ఇలా కిలోమీటరు వరకు పరిగెత్తి.. పరిగెత్తి.. ఇంకో భక్తుడికి దాన్ని అందించాడు. ఆయన చాలా భక్తి భావంతోనే చేసి ఉంటాడు, చాలా మంది ఆ పోలీసుల భక్తుడిని దారి వెంట పొగిడారు.. అభినందించారు.

### ద్వంద్వ వైఖరి...

మొహర్రంలో కత్తి ప్రదర్శన చేసిన ముస్తకీం ఖాన్ కూడా ఇదే భక్తి ఉండి ఉంటుంది కదా..ప్రేమ మిశ్రా భక్తి గొప్పది, ముస్తకీం ఖాన్ భక్తి గొప్పది. అక్కడ పోలీసులు వాళ్ళ ప్రవర్తన నియమావళి ప్రకారం యూనిఫామ్ లో ఉన్నప్పుడు లౌకిక వైఖరిని మాత్రమే ప్రదర్శించాలి వాళ్ళ ప్రవర్తన నియమాలు ఉంది. వ్యక్తిగత మత విశ్వాసాలు ఏవైనా సరే విధుల్లో ఉన్నప్పుడు వాటిని అధికారికంగా ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధం. మరి ప్రేమ్ మిశ్రా చేసింది ఏంటి అంతకుముందు ముస్తకీం ఖాన్ అదే పని చేశడు కాబట్టి చర్య తీసుకున్నారు ప్రేమ్ మిశ్రా అదే పని చేశడు ఇప్పుడు ప్రేమ్ మిశ్రాపై చర్యలు తీసుకోలేదు. ద్వంద చర్యలు ప్రజల్లో తప్పుదారి పట్టిస్తాయి. అంతేకాకుండా యాత్రలో వస్తున్న యాత్రికుల కోసం కాళ్ళు ఒత్తుతున్నారు పూలు జల్లుతున్నారు హెలికాప్టర్ల నుంచి పూలు జల్లుతున్నారు యూనిఫాంలో ఐజిలు డిఐజిలు డిజిపిలు యూనిఫామ్ లో పోలీస్ ప్రవర్తన నియమాలకి ఇది మాత్రం అడ్డంక ఎందుకు కాదు అని లౌకికవాదులు ప్రశ్నిస్తున్నారు. నియమావళి వీళ్ళకు మాత్రం ఎందుకు వర్తించదు అంటే ఈ దేశంలో రెండు రకాల చట్టాలు నడుస్తున్నాయని అర్థం.

## క్రికెటర్ల గాయాలపై బిసిసిఐ గరంగరం

# బెంగళూరులో నేడు అత్యవసర సమీక్ష..!



అసలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)లో ఏం జరుగుతోంది? ఆటగాళ్లు ఎందుకు త్వరగా కోలుకోవడం లేదు? అనే అంశంపై అత్యవసర సమీక్షకు సిద్ధమవుతోంది బిసిసిఐ. ఇటీవల భారత క్రికెటర్లు తరచూ గాయాల బారిన పడడం.. సిరీస్ మధ్యలోనే స్క్వాడ్ నుంచి వైదొలగడం చూస్తున్నాం. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్లు చివరకు శ్రీలంక పర్యటన మొత్తానికి దూరమవ్వడం పట్ల బిసిసిఐ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అసలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఏం జరుగుతోంది? ఆటగాళ్లు ఎందుకు త్వరగా కోలుకోవడం లేదు? అనే అంశంపై అత్యవసర సమీక్షకు సిద్ధమవుతోంది బిసిసిఐ. విదేశీ పర్యటనల్లో భారత ఆటగాళ్లు ఈమధ్య తరచూ గాయపడుతున్నారు. ఫలితంగా.. కొత్త కాంబినేషన్లు ప్రయత్నించడం, అవి బెడిసికొట్టి జట్టు విజయావకాశాల్ని దెబ్బతీయడం మామూలైపోయింది. పునరావాసంలో ఉండి.. ఫిట్‌గా తిరిగి వస్తారనుకుంటే.. బరువెక్కి కొందరు, గాయాలు నయమవ్వక కొందరు కీలక సిరీస్లకు దూరమవుతున్నారు.శ్రీలంక పర్యటనకు బుమ్రాతో పాటు సాయి సుదర్శన్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి చేయనుంది. దా తో, బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా హు టా హుటిన శనివారమే బెంగళూరుకు బయల్దేరాడు. అక్కడ సీఓఈ డైరెక్టర్ వివిఎస్ లక్ష్మణ్‌తో ఆదివారం అతడు రిహాబిలిటేషన్ తీరుతెన్నులు పరిశీలించి.. అసలేం జరుగుతుందో తెలుసుకోనున్నాడు.

**గాయపడింది వీరే..**

జాతీయ సీనియర్ జట్టుతో పాటు జూనియర్ స్థాయిలో ఆడే క్రికెటర్లు ఎవరైనా గాయపడితే.. వారిని బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సన్స్‌కు పంపుతుంది బిసిసిఐ. అక్కడ వైద్యబృందం, ఫిట్నెస్ నిపుణుల పర్యవేక్షణలో వీరు మెరుగవుతారు. అయితే.. ఇటీవల కాలంలో పరిస్థితి మాత్రం ఆందోలన కలిగిస్తోంది. ఎందుకంటే ఇప్పటికే ఆరుగురికి పైగా సీనియర్ ఆటగాళ్లు సిఇఒలో కోలుకుంటున్నారు. హార్దిక్ పాండ్యా(క్వాడ్రిసెప్స్ గాయం), బుమ్రా(మోకాలి వాపు), సాయి సుదర్శ న్(కుడి బొటన వేలికి గాయం), హర్షిత్ రాణా( తొడకండరాల గాయం), నితీశ్ రెడ్డి(తొడ కండరాల గాయం), వాషింగ్టన్ సుందర్(క్వాడ్రిసెప్స్ గాయం), రంజీ ట్రోఫీ సమయంలో ఆకాశ్ దీప్(వెన్ను కింది భాగంలో ఎముకలు విరగడం).. ఇలా గాయాల చిట్టా పెద్దదే. అందుకని.. సిఒఇలో ఆటగాళ్లపై ఎలాంటి శ్రద్ధ పెడుతున్నారు? ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు? అనే విషయాల గురించి లక్ష్మణ్‌తో ఆగస్టు 9, ఆదివారం బిసిసిఐ సెక్రటరీ సైకియా సుదీర్ఘంగా చర్చించనున్నాడు.

## వామప్ మ్యాచ్.. భారత్‌ను ఆదుకున్న జడేజా, మానవ్ సుతార్!

శ్రీలంకతో రెండు టెస్ట్‌లో సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌తో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండిస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది.



**నిరాశపర్చిన రాహుల్, జైస్వాల్..**

రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్బాల్ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్తో పాటు, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడి రెండో వికెట్కు 96 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీకి చేరువైన కేఎల్ రాహుల్(40)ను నువాంత క్లీన్ బౌల్ చేశాడు. రవీంద్ర జడేజా సాయంతో ఇన్నింగ్స్ను ముందుకు నడిపించిన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ మరుసటి బంతికే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో క్రీజులోకి రిషభ్ పంత్ వచ్చాడు. కానీ అతను ఐదు బంతుల్లో 2 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్ కూడా ఆ కాసేపటికే క్యాచ్ ఔటయ్యాడు. ఈ ఇద్దరినీ స్పిన్నర్ రమేష్ మెండిస్ పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 174 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

**ఆదుకున్న జడేజా, సుతార్..**

ఈ పరిస్థితుల్లో జడేజా, మానవ్ సుతార్ జట్టును ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్కు 76 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ అనంతరం రవీంద్ర జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగగా.. కుల్దీప్ యాదవ్(1) గాయంతో తప్పుకున్నాడు. మహమ్మద్ సిరాజ్(1) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సరాన్ష్ జైన్(22) పరుగుల తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగగా.. దేవదత్ పడిక్కల్ తిరిగిన బ్యాటింగ్‌కు వచ్చాడు. గుర్నూర్ బ్రార్‌తో కలిసి అతను రెండో రోజు ఆటను ముగించాడు.

## బిజినెస్

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 78,094.64 పాయింట్లు. ముగింపు 78,499.17 పాయింట్లు. లాభం 404.53 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,383.60 పాయింట్లు. ముగింపు 24,570.65 పాయింట్లు. లాభం 187.05 పాయింట్లు.

(లావాదేవీలకు చివరి రోజైన ఆగస్టు 7వ తేదీ రోజున సెన్సెక్స్ 455.59 పాయింట్లు, నిఫ్టీ 65.35 పాయింట్లు పతనం కాకుండా ఉంటే, మార్కెట్ల పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది).

## తొలి త్రైమాసికంలో పెరిగిన ఆర్‌బిఐ నికర లాభం



భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే బ్యాంకు ఏకీకృత నికర లాభం 13.73 శాతం పెరిగి రూ.24,113 కోట్లకు చేరుకుంది. స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన నికర లాభం 10.23 శాతం పెరిగి రూ.21,121 కోట్లుగా నమోదైంది. రుణాలపై వచ్చే వడ్డీ ఆదాయం పెరగడం, నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) కోసం కేటాయించిన నిధులు తగ్గడం లాభాల వృద్ధికి ప్రధాన కారణాలయ్యాయి. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం దాదాపు 15 శాతం పెరిగి రూ.46,992 కోట్లకు చేరుకుంది. మొత్తం రుణాల పంపిణీ 18.63 శాతం పెరగడం దీనికి దోహదపడింది. స్థూల ఎన్‌పిఎ నిష్పత్తి గత ఏడాది 1.83 శాతం నుంచి ప్రస్తుతం 1.47 శాతానికి తగ్గడం ఆస్తుల నాణ్యత మెరుగుపడిందని సూచిస్తోంది. రుణ వృద్ధిని కొనసాగించేందుకు 2026–27లో 14–15 శాతం క్రెడిట్ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్‌బిఐ ప్రటించింది. అయితే విదేశీ మారక, డెరివేటివ్‌ల ఆదాయం తగ్గడంతో వడ్డీయేతర ఆదాయంలో స్వల్ప తగ్గుదల నమోదైంది. మొత్తంమీద, ఎస్‌బిఐ ఆర్థిక పనితీరు స్థిరంగా కొనసాగుతున్నట్లు ఈ ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

### బులియన్ మార్కెట్

**బంగారం ధర (10 గ్రాములకు రూపాయిల్లో)**

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 1,49,890 |
| 22 క్యారెట్లు | 1,37,400 |
| 18 క్యారెట్లు | 1,12,620 |



## పెరిగిన క్రూడ్ ఆయిల్ ధర

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధర పెరుగుతునే ఉంది. తాజాగా బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరింది. మధ్యప్రాచ్యంలోని హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయనే ఆందోళనలే దీనికి ప్రధాన కారణం. ప్రపంచ సముద్ర మార్గాల ద్వారా జరిగే ముడి చమురు రవాణాలో గణనీయమైన భాగం ఈ జల సంధి మీదుగా సాగుతుంది. అందువల్ల అక్కడ ఉద్రిక్తతలు తలెత్తినప్పుడల్లా ప్రపంచ ఇంధన మార్కెట్లు అప్రమత్తమవుతాయి. సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందనే అంచనాతో ట్రేడర్లు ముందస్తుగా కొనుగోళ్లు పెంచుతుండటంతో ధరలు ఎగసిపడుతున్నాయి. చమురు ధరల పెరుగుదల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా పడే అవకాశం ఉంది. ముడి చమురు ఖరీదైతే పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల దిగుమతి వ్యయం అధికంగా ఆధారపడే దేశాల్లో ఇది ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే ప్రమాదం ఉంది. రవాణా, విద్యుత్, పరిశ్రమల ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో పలు వస్తువుల ధరలపై కూడా ప్రభావం పడవచ్చు. అందువల్ల హోర్ముజ్ ప్రాంతంలో చోటుచేసుకునే పరిణామాలను ప్రపంచ మార్కెట్లు అత్యంత నిశితంగా గమనిస్తున్నాయి.

## ప్రైవేటు బ్యాంకులకు అమ్మకాల ఒత్తిడి



ప్రైవేట్ బ్యాంకులు, ఆర్థిక సేవల రంగానికి చెందిన కంపెనీల షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దీనికి ప్రధాన కారణంగా బ్యాంకేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సిలు)పై మరింత కఠినమైన నియంత్రణ నిబంధనలను అమలు చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) చర్యలు చేపట్టడమే. ఎన్‌బిఎఫ్‌సిలు రుణాల మంజూరు, రిస్క్ నిర్వహణ, మూలధన నిల్వలు, పర్యవేక్షణ వంటి అంశాల్లో కఠిన నిబంధనలు అమలైతే వాటి కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పెట్టుబడిదారులు భావించారు. ఎన్‌బిఎఫ్‌సిలతో ప్రైవేట్ బ్యాంకులకు సన్నిహిత వ్యాపార సంబంధాలు ఉండటంతో ఈ మార్పులు మొత్తం ఆర్థిక రంగంపైనా ప్రభావం చూపవచ్చనే ఆందోళన వ్యక్తమైంది. ఫలితంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగ సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. అయితే ఇటువంటి నియంత్రణ చర్యల ప్రధాన ఉద్దేశం ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, అధిక రిస్క్‌ను నియంత్రించడం, రుణాల నాణ్యతను మెరుగుపరచడం మరియు భవిష్యత్తులో ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

# డిఫరెంట్ జానర్స్ సినిమాల్లో కొత్తదనానికి కృషి

**'ప్రజాపక్షం' స్పెషల్ ఇంటర్వ్యూ లో హీరో శ్రవణ్ రెడ్డి**



శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్ కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమా 14న విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో హీరో శ్రవణ్ రెడ్డి 'ప్రజాపక్షం'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

**ప్రశ్న: మీ నేపథ్యం చెప్పండి?**

**శ్రవణ్ రెడ్డి :** నాది హైదరాబాద్ సార్. ఇక్కడే లోకల్..నేను ముంబై లో యాక్టింగ్ కోర్సు చేశాను. యాక్టింగ్ అంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. అందుకే ముంబైకి వెళ్లి నేర్చుకున్నారు. యాక్టింగ్ ఒక్కటే కాదు సినిమాకు ఏమేమి కావాలో అన్ని నేర్చుకున్నాను.

**ప్రశ్న : 'డర్టీ హరి' తర్వాత ఇంత గ్యాప్ ఎందుకు వచ్చింది?**

**శ్రవణ్ రెడ్డి :** 'డర్టీ హరి' కరోనాలో రిలీజ్ అయింది. ఒటిటిలోకి నేరుగా వచ్చినా అక్కడ మాకు అద్భుతమైన రెస్పాన్స్ దక్కింది. ఆ టైంలోనే నాకు చాలా ఆఫర్స్ వచ్చాయి. కానీ కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఆలస్యం అవుతూ వచ్చాయి. 'మంగళవారం' సినిమా కోసం దాదాపు ఏడాది వెచ్చించాను. ఇక చివరకు మళ్లీ ఎంఎస్ రాజు నాకు ఈ 'అగధ' అవకాశాన్ని ఇచ్చారు.

**ప్రశ్న: 'అగధ'లో మీ పాత్ర ఎలా ?**

**శ్రవణ్ రెడ్డి :** 'డర్టీ హరి'కి పూర్తి భిన్నంగా 'అగధ' పాత్ర ఉంటుంది. చాలా పార్శ్వాలు ఉండేలా కారెక్టర్‌ను డిజైన్ చేశారు. ఈ పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. ఎంఎస్ రాజు వంటి విజన్ ఉన్న ఫిల్మ్ మేకర్ మళ్లీ నాకు అవకాశం ఇవ్వడం చాలా లక్కీ అనిపిస్తుంది. 'అగధ' నాకు ఠఎంతో ఛాలెంజింగ్‌గా, డిఫరెంట్ ఎకీపిరియన్స్ ఇచ్చింది. డివైన్ మిస్టిక్ థ్రిల్లర్‌గా 'అగధ' చాలా అద్భుతంగా ఉంటుంది. ఇందులో హారర్, థ్రిల్ మూమెంట్స్ చాలా ఉంటాయి. ఏదైనా సరే కొత్తగా ఓ హుక్ పాయింట్ ఉండాలని ఎంఎస్ రాజు నిత్యం చెప్తుంటారు.

**ప్రశ్న : 'అగధ' ట్రైలర్ చూస్తే మీదే నెగెటివ్ (విలన్ టైప్) పాత్రలా ఉంది కదా ?**

**శ్రవణ్ రెడ్డి :** ఇందులో నెగెటివ్ పాత్ర అనేది ఉండదు. పరిస్థితుల వల్లే పాత్రలు అలా ప్రవర్తిస్తుంటాయి. గుడ్ వర్సెస్ బ్యాడ్, గాడ్ వర్సెస్ ఈవిల్ అన్నట్టుగా సాగుతుంది. నా పాత్ర కోసం హోం వర్క్ చేయడానికి గానీ, ప్రిపేర్ అవ్వడానికి గానీ నాకు టైం దొరకలేదు. కథ చెప్పిన నాలుగో రోజే సెట్ మీదకు వచ్చాను. ఎంఎస్ రాజు చెప్పింది చెప్పినట్టుగా నటించేశాను. నేను అంతా కూడా సెటలోనే ప్రిపేర్ అయ్యానని చెప్పొచ్చు.'డర్టీ హరి' ఒటిటిలో సక్సెస్ అయింది. అయితే హీరోకి బాక్సాఫీస్ నంబర్లే ముఖ్యం. 'అగధ'తో నాకు ఆ బాక్సాఫీస్ స్టాంప్ వస్తుందని ఆశిస్తున్నాను. అగధ' కోసం ఎంఎస్ రాజు రాసిన కథ, నా పాత్ర చాలా కొత్తగా అనిపిస్తుంది. ఈ మిస్టిక్, హారర్ ఫీల్ను ఇవ్వడానికి సెట్స్ వేయాల్సి వచ్చింది. మా సినిమాలోని వీఎఫ్ఎక్స్ వర్క్ చాలా నీట్‌గా, ఇంపాక్ట్ క్రియేట్ చేసేలా ఉంటుంది.

**ప్రశ్న : 'అగధ'కి సీక్వెల్ గానీ ప్రీక్వెల్ గానీ ఉంటుందా?**

**శ్రవణ్ రెడ్డి :** ఇలాంటి చిత్రాలకు కచ్చితంగా అలాంటి సౌలభ్యం ఉంటుంది. పర్టిక్యులర్గా పార్ట్ 2 అని వేయకపోయినా.. కథను అల్లుకోవచ్చు. మరి ఎంఎస్ రాజు గారు రెండో పార్ట్ ఎప్పుడు అంటారో చూడాలి .

**ప్రశ్న : మీ ఫ్యూచర్ ప్రాజెక్ట్ ఏంటి ?**

**శ్రవణ్ రెడ్డి :** రాజ్ అండ్ డికెటీంలో పని చేసిన చంద్ర దర్శకత్వంలో ఓ మూవీని చేస్తున్నాను. ఆల్రెడీ కాశ్మీర్‌లో ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేశాం. కొన్ని ప్రాజెక్ట్‌లు చర్చల్లో ఉన్నాయి.

**ప్రశ్న : ఎలాంటి పాత్రలను చేయాలనే కోరిక ఉంది?**

**శ్రవణ్ రెడ్డి :** నా పాత్రకు ఇంపార్టెన్స్ ఉండాలని కోరుకుంటాను. ప్రతిసారి డిఫరెంట్ జానర్‌లో కొత్తగా ప్రయత్నించాలని చూస్తుంటాను.

**ప్రశ్న: ఇండస్ట్రీలో ఏం నేర్చుకున్నారు?**

**శ్రవణ్ రెడ్డి :** చాలా నేర్చుకున్నాను. ఎవరితో ఎలా ఉండాలి ? ఎంత డేడికేటెడ్ గా వర్క్ చెయ్యాలి. టైం సెన్స్ ఉండాలి. అనవసరంగా ఎవరి జోలికి వెళ్ళకూడదు. ముఖ్యంగా ఎం ఎస్ రాజు తో పని చేస్తుంటే తెలిసింది సినిమా అంటే ఎంత ఫ్యాషన్ గా వర్క్ చెయ్యాలనేది.

## రీల్



## 28న నయనతార 'హాయ్' రిలీజ్

లేడి సూపర్ స్టార్ నయనతార, కవిన్ తొలిసారి కలిసి నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్' విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. విష్ణు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నయనతార, కవిన్తో పాటు కె. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్కుమార్, విటివి గణేష్, సత్యన్, ఆదిత్య కథిర్, ఖురైషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ అందించగా, జెన్ మార్టిన్ సంగీతం సమకూర్చారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా, ఎస్. కన్నన్ ప్రొడక్షన్ డిజైనర్గా పనిచేస్తున్నారు.జి స్టూడియోస్, ది రౌడి పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై నయనతార, విఘ్నేష్ శివన్, ఎస్.ఎస్. లలిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోద్ సి.జే., కె.ఎస్. మయిల్ వాగనన్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, వి.కె. కుబేంద్రన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. దర్శకుడు విష్ణు మాట్లాడుతూ ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటటైనర్. చెన్నై, కోయంబత్తూరు, పొల్లాచ్చి నేపథ్యాల్లో సాగే ఈ సినిమా కుటుంబం మొత్తం కలిసి థియేటర్‌లో చూసి ఆస్వాదించేలా రూపొందించాం. 'డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్', 'సంతోష్ సుబ్రమణ్యం', 'యారాడి నీ మోహిని' వంటి చిత్రాల తరహాలో బంధాలు, భావోద్వేగాలు, హాస్యంతో సాగే కథ ఇది అన్నారు.


## 'విశ్వనాథ్ అండ్ సన్స్' సెన్సార్ పూర్తి



తమిళ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం ట్రైలర్ విడుదలైంది. తొలి ఫ్రేమ్ నుంచే ఆహ్లాదకరమైన, భావోద్వేగభరితమైన, హృదయాన్ని తాకే కుటుంబ కథా చిత్రంగా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ట్రైలర్‌లో కనిపిస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరి తనదైన భావోద్వేగ కథనంతో రూపొందించిన ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ట్రైలర్‌లో సంజయ్ విశ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను పరిచయం చేశారు. నలభై ఏళ్ల వయస్సు దాటినా తన కలలను వదలకుండా ముందుకు సాగే వ్యక్తిగా సూర్య కనిపించారు. వెంకీ అట్లూరి రచనతో కలిసి సూర్య కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రల్లో ఇది ఒకటిగా నిలుస్తుందనే నమ్మకాన్ని ట్రైలర్ కలిగిస్తోంది.కథానాయిక మమితా బైజు తన సహజమైన అభినయంతో ఆకట్టుకోగా, రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్‌తో పాటు ఇతర ప్రముఖ నటీనటులు ఈ కుటుంబ కథకు మరింత బలం చేకూర్చారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన హృద్యమైన సంగీతం, నిమిష్ రవి అందించిన అద్భుతమైన ఛాయాగ్రహణం, ట్రైలర్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. సితార ఎంటటైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు/ ఏ సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రాన్ని 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# 'డిసి' బ్లాక్‌బస్టర్ హిట్

## సక్సెస్ మీట్‌లో నిర్మాత సురేష్ బాబు



ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరో గా పరిచయమైన చిత్రం 'డిసి'. ఈ చిత్రానికి అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. వామికా గబ్బి, సంజనా కృష్ణమూర్తి హీరోయిన్స్ గా నటించారు. అనిరుధ్ సంగీతం అందించారు. 7న ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రం తెలుగులో గ్రాండ్ గా విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ తో ఘన విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్ లో నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ 'డిసి' సినిమాకు వస్తున్న రిపోర్ట్స్ అద్భుతంగా ఉన్నాయి. ఏషియన్ సునీల్ , దిల్ రాజు , మేమంతా కలిసి ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశాం. లోకేష్ కనగరాజ్ పెద్ద దర్శకుడు. ఇప్పుడు మొదటిసారి హీరోగా నటించారు. అద్భుతమైన పెర్ఫామెన్స్ ఇచ్చారు. సినిమా అద్భుతమైన రెస్పాన్స్‌తో ప్రారంభమైంది. చాలా గొప్ప టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందిన సినిమా ఇది. టెక్నికల్‌గా సినిమా చాలా బ్రిలియంట్‌గా ఉంది. సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనేది ఈ సినిమా మరోసారి నిరూపించింది. అరుణ్ మాథేశ్వరన్ అద్భుతంగా తెరకెక్కించారు. వామికా గబ్బి, మిగతా నటీనటులు కూడా చాలా బాగా నటించారు. ప్రతి షోకి ఆదరణ పెరుగుతోంది. ట్రైలర్ చూసే సినిమా ఎలా ఉంటుందో అర్థం చేసుకుంటారు. కొత్తదనం కనిపిస్తే తప్పకుండా థియేటర్‌కు వస్తారు. అనిరుధ్ అందించిన సంగీతాన్ని ప్రేక్షకులు థియేటర్లలో ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు అన్నారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ . ముందుగా ఈ సినిమా హక్కులు మాకు ఇచ్చిన సన్ పిక్చర్స్‌కు ధన్యవాదాలు. 'డిసి' అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఇది బ్లాక్బస్టర్ హిట్‌గా నిలిచింది. అలాగే భవిష్యత్తులో రాబోతున్న 'జైలర్ 2' కూడా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని అన్నారు. నిర్మాత శిరీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా హక్కులు మాకు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన సన్ పిక్చర్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. స్క్రీన్స్ కూడా పెరుగుతున్నాయి. ఈ విజయం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
ఆదివారం
09-08-2026
www.prajapaksham.in
LOCAL NEWS స్థానికం LOCAL NEWS



## వరుణ యాగానికి ముమ్మర ఏర్పాట్లు

**ప్రజాపక్షం/హాలియా:** రైతాంగ సంక్షేమం రాష్ట్ర సుభిక్షం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపట్టనున్న మహోన్నత వరుణ యాగానికి అధికారులు ముమ్మురంగా ఏర్పాట్లు చేస్తున్నారు.నాగార్జునసాగర్ లోని విజయ విహార్ ప్రాంగణంలో చేపట్టనున్న ఈ వరుణ యాగానికి కావలసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, సాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్‌రెడ్డిలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి యాగ స్థలానికి అధికారులు చేరుకొని యాగానికి కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించి భద్రత,యాగ అంశాలపై పలు సమస్యలను పరిష్కరించి సిబ్బందికి సూచనలు చేశారు. యాగాన్ని దిగ్విజయంగా పూర్తి చేసేందుకు కావలసిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా ఉన్నతాధికారులు యాగ స్థలాన్ని పరిశీలించారు.

## క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో జైల్‌భరో

కిసాన్‌మోర్చా సంయుక్తంగా పిలుపు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో 10న జరగనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కిసాన్‌మోర్చా సంయుక్తంగా పిలుపునిచ్చినట్లు ఎస్‌కెయం నాయకులు తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని సిపిఐ కార్యాలయంలో శనివారం జరిగిన ఎస్‌కెయం ముఖ్య నాయకులు మాట్లాడుతూ కార్పోరేట్ సంస్థలన్ని భారత వ్యవసాయం రంగం నుండి వైదొలగాలని ఎస్‌కెయం నాయకుల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ బరో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. సూర్యాపేటలో జరిగే జైలుబరో కార్యక్రమంలో క్విట్ ఇండియా ఉద్యమం స్పూర్తితో విజయవంతం చేయడానికి వేల సంఖ్యలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ అధ్యక్షులు గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రమేష్, కౌన్సిలర్ చెనగాని సైదులు, జక్కుల రమేష్, పరికె భరత్, జక్కుల రమణ పాల్గొన్నారు.

## అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లే...

ముకుందాపురం వద్ద ప్రమాదఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పి కె.నర్సింహా



**ప్రజాపక్షం/మునగాల:** వాహనాలను అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవని జిల్లా ఎస్పి కె.నర్సింహా అన్నారు. శనివారం మండలంలోని ముకుందాపురం వద్ద గురువారం రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్రవాహనం రోడ్డు ప్రమాదానికి గురై తండ్రి, కొడుకులు మృతిచెందిన సంఘటన స్థలాన్ని మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ సంఘటన సంబంధించి పటిష్టంగా దర్యాప్తు చేసి ప్రమాదానికి గల కారణాలను నివేదిక తయారు చేయాలని అదేశాలు జారీ చేశారు. అనంతరం మండల పరిధిలో ఉన్న జాతీయ రహదారి 65పై మాదవరం స్టేజీ, మొద్దులచెర్వు స్టేజీ, మునగాల మండల కేంద్రం, ముకుందాపురం, ఆకుపాముల గ్రామాల వద్ద ఉన్న తరచు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ పరిశీలించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగకుండా లోపాలను త్వరగా సవరించాలని అదేశించారు. జాతీయ రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావు, నర్రా శ్రీపాల్‌రెడ్డి, కోల ఉపేందర్‌రావు, శెట్టి గిరి, తక్కెళ్లపాటి సాయి, ముస్కుల సైదిరెడ్డి, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల కేంద్రంలోని నారాయణరావు భవన్‌లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 16వ మహాసభలో ఏఐవైఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలకు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఐవైఎఫ్ నూతన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా మిడిదొడ్డి రామకృష్ణ, ఏదుల్ల వెంకటరత్నం, ఉపాధ్యాక్షులుగా బాధ రాజు, కార్యదర్శిగా కోరేంకా సందీప్, కోశాధికారిగా నేనావత్ కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బీనమోని వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిరావు మాట్లాడుతూ నిరుద్యోగకు యువతకు అవకాశాలు కల్పన కోసం నూతన పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు మాట్లాడుతూ యువజన సమస్యల పట్ల నిరుద్యోగుల పట్ల అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని, తమపై నమ్మకంతో ఎన్నికలకు సహకరించిన జిల్లా మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి అంజల్‌రావు, పల్లపు లక్ష్మయ్య, మల్లోజు శేఖరచారి, వింజమూరు నరసింహ, కొణిదల వెంకటయ్య, గుండ్లపల్లి ఇద్ది రాములు, పరశురాములు, జోగు శ్రీరాములు, షేక్‌శంశోద్దీన్, బాద రాజు, వినోద్, కృష్ణ, బీనమోని వెంకటేష్ ఐతపాక సైదులు తదితరులు పాల్గొన్నారు.




# వరివేసి రైతులు నష్టపోవద్దు

సూర్యాపేట జిల్లాలో వచ్చే ఆరునెలల పాటు లోటువర్షపాతం : కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

10రోజుల పాటు పంట మార్పిడి పథకం స్పెషల్ డ్రైవ్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలో వాతావరణం అనుకూలించేలా లేనందున ఈ ఏడాది వానలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో రైతులు వరివేసి నష్టపోవద్దని కలెక్టర్ తేజస్‌నందలాల పవార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. జూన్,జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని రాబోయే సెప్టెంబర్ లోనూ ఎల్‌నినో ప్రభావంతో వానలు తక్కువగానే ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరులేనందున నీటి విడుదలపై స్పష్టత లేదన్నారు. జిల్లాలోని 190 పెద్ద చెరువుల్లో చాల వరకు 25 నుంచి 50 శాతం నీటితోనే ఉన్నాయని, భూగర్భజలాలు కూడా రీచార్జి కావడంలేదని తెలిపారు. ఇప్పుడు వేసిన వరినాట్లు పంటచేతికి వచ్చే వరకు నీటి లభ్యత లేక ఇబ్బందులు పడతారని అన్నారు. పంట మార్పిడిపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు రైతులతో మాట పంట మార్పిడికి బాట అనే పంటమార్పిడి పథకాన్ని స్పెషల్ డ్రైవ్‌గా తీసుకుని ఈనెల 10వ తేదీనుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. పది రోజుల పాటు ప్రతి అధికారి కనీసం పదిమంది రైతులను వ్యక్తిగతంగా కలిసి అవగాహన కల్పిస్తారన్నారు. తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఎఈవోలు, మహిళ సంఘాల ప్రతినిధులు, ఇందుల్లో పాల్గొంటారని గ్రామ స్థాయిలో రైతువేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటల లాభాలను వివరిస్తారని తెలిపారు.

**కరువు వచ్చిన అండగా ఉంటాం: ఎమ్మెల్యే మందుల సామేలు**

రాష్ట్రంలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నా ప్రజలేవరు ఆధైర్యపడోద్దని ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, సాగునీటి కష్టాల నుంచి గట్టేందుకు సాగర్‌లో వరుణయాగం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని తొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు 8 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, ఇరిగేషన్ సిఈ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్న ప్రభుత్వాలు

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహించిన ఏఐవైఎఫ్ 12వ నియోజకవర్గ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో పేపర్ లీకులు, అవినీతి ఆరోపణలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ విభజన మతతత్వ రాజకీయాల కారణంగా దేశంలో ఆందోళనలు చెలరేగుతున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ పౌరులను కాక్రోచ్‌లుగా సంబోధించి నిరుద్యోగ యువతను వీధుల్లోకి లాగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ నుండి చలో పార్లమెంట్ చేపట్టి పార్లమెంటు గేట్లు మూసివేసే విధంగా పోరాటాలు సాగాయని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విమానయానం, టెలికం, రక్షణ రంగాలను సైతం ప్రైవేటు పరం చేయడం తగదని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం నూతన పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. నియోజకవర్గంలో నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం ఏఐవైఎఫ్ విస్తృత పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిశ్రమలలో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ మహాసభకు ఆకారపు లోకేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు లింగా నాయక్, సీపీఐ మండల కార్యదర్శులు రామలింగం, యాదగిరి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు పోస్క పరమేష్, జిల్లా యశ్వంత్, సత్య వినయ్ కుమార్, సాయి శరన్, రఫీ, అబ్దుల్ ఖాదర్, కార్తీక్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# నేరాలకు పాల్పడితే చట్టపరమైన శిక్షలు

చివ్వెంల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్



**ప్రజాపక్షం/చివ్వెంల:** చివ్వెంల పోలీస్‌స్టేషన్‌ను శనివారం సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ వార్షిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్థానిక ఎస్ఐ మహేష్ ఉన్నారు. ముందుగా సిబ్బంది గౌరవవందనంతో స్వాగతం తెలిపారు. స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, పోలీస్‌స్టేషన్ పనితీరును, సిబ్బంది సామర్ధ్యం, ప్రజాసేవలో స్పందనను పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు కీలక సూచనలు, అదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో అన్ని రికార్డులు, రిజిస్టర్లు, కేసుల ఫైళ్లను ఎప్పటికప్పుడు ఆప్‌డేట్ చేస్తూ నిఘా ఉంచాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా సాక్ష్యధారాలను సేకరించి కోర్టుకు పంపాలన్నారు. రాత్రి పూట గస్తీ, బిట్ పోలిసింగ్ పెంచాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వారికి తగిన రక్షణ కల్పించాలి. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, కేసుల దర్యాప్తులో పోలీస్ సాంకేతిక పద్దతుల్లో అత్యంత నాణ్యమైన దర్యాప్తు నిర్వహిస్తున్నారని, నేరాలకు పాల్పడితే ఏనాటికైనా నష్టపరమైన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సిసిటివి కెమోరాల ఏర్పాటుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజశేఖర్, ఎస్ఐ మహేష్, ఎస్ఐ 2 వెంకన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## చందనపల్లి డంపింగ్ యార్డులో పులి పిల్లల కలకలం

రెండు పులి పిల్లలు సంచరిస్తున్నట్లు కార్మికులు గుర్తింపు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మండలంలోని చందనపల్లి డంపింగ్ యార్డులో రెండు పులి పిల్లలు సంచరిస్తున్నట్లు అక్కడ పనిచేస్తున్న కార్మికులు చెబుతున్నారు.శనివారం ఉదయం డంపింగ్ యార్డులో పనులు నిర్వహిస్తున్న సమయంలో రెండు పులి పిల్లలు అక్కడికి వచ్చి కొద్దిసేపు ఆడుకున్నట్లు స్థానికులు తెలిపారు.వాటిని ఫోటోలు తీసేందుకు ప్రయత్నించగా ఫెన్సింగ్ దూకి అవతలి వైపునకు వెళ్లిపోయినట్లు చెప్పారు. గతంలో ఇదే ప్రాంతంలో ఓ పులి సంచరించిందని, అనారోగ్య కారణాలతో అది మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. అప్పట్లో ఆ పులికి చెందిన పిల్లలు చిన్న వయసులో ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుతం అవే పులి పిల్లలు పెరిగి పెద్దవై ఉండొచ్చని అక్కడి ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే డంపింగ్ యార్డులో పులి పిల్లల సంచారం విషయంపై అటవీశాఖ అధికారులు పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సి ఉంది. పులి పిల్లల సంచారం నిజమేనా? లేక పుకార్లేన అన్న కోణంలో అటవీశాఖ అధికారులు నిర్ధారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థానాలు




**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి జీవితంలో స్థానాలకు చేరుకోవాలని సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బద్దం కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న అండర్14, అండర్18 వాలీబాల్ పోటీలను శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వంగవీటి రామారావు, దేవరపల్లి మల్లేశ్వరిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడాప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మద్యతరగతి విద్యార్థులకు క్రీడల్లో అవకాశాలు కల్పిస్తున్న బద్దం కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్టు సేవలను అభినందించారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఏనుగు ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ షేక్ బషీర్, పందిరి నాగిరెడ్డి, కౌన్సిలర్ సైదిబాబు, మామిడి రామారావు, పట్టణ ప్రముఖులు వేముల వెంకటేశ్వర్లు, వేనేపల్లి శ్రీనివాసరావు, వ్యాయమ ఉపాధ్యాయులు చారి, కొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లపై మటన్, చేపల విక్రయాలకు అనుమతి లేదు

కమిషనర్ బి.వంశీ కృష్ణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు,రోడ్లు,ప్రజా ప్రదేశాల్లో మటన్, చేపల దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహించడం ఇకపై అనుమతించబడదని మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష్ణ పేర్కొన్నారు.శనివారం నగరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారాల్లో ఫుట్‌పాత్‌లపై మటన్,చేపల విక్రయాలు నిర్వహించడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు,మాంసం,చేపల వ్యర్థాలను రోడ్లు,డ్రైన్లలో పడవేయడం వల్ల అపరిశుభ్రత,దుర్వాసన, ప్రజారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి ఫుట్‌పాత్‌లపై మటన్ లేదా చేపల విక్రయాలు నిర్వహించినట్లయితే వ్యాపారం నిలిపివేయడంతో పాటు దుకాణం సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

## ఎస్‌సి కమ్యూనిటీ హాల్ ప్రారంభించాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి:** మండలంలోని అడివెంల గ్రామంలో నిర్మాణ పూర్తయి మూడేళ్లయినా ఎస్సీ కమ్యూనిటి హాల్‌ను ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎక్స్‌వేదికగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షులు బొర్రా గిరిబాబు శనివారం తెలిపారు. అర్వపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎస్సి డిడి నుంచి రూ.7.25 లక్షలు, డిఎంఎఫ్టి నిధులు రూ.3 లక్షల రూపాయలతో ఎస్సీ కమ్యూనిటి హాల్‌ను నిర్మించిన కమ్యూనిటి హాల్‌ను వెంటనే ప్రారంభించి గ్రామంలోని నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా గ్రంధాలయంగా మార్చాలని ఫిర్యాదులో కోరారు.

# విద్యా రంగంలో సమూల మార్పులు

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ: విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శిక్షా రేవల్యూషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఛాత్రోన్ కీ గూంజ్ స్టూడెంట్స్ కాన్క్లేవ్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని విద్యార్థులు, యువత, నిరుద్యోగులతో కలిసి రాహుల్ గాంధీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. విద్యార్థుల గొంతుకను వినడం, వారి సమస్యలను పరిష్కరించడం, నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తు అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఛాత్రోన్ కీ గూంజ్ ద్వారా విద్యార్థులు, యువత తమ భవిష్యత్తు, విద్య, ఉపాధి తదితర అంశాలపై తమ అభిప్రాయాలను వినిపించే అవకాశం కలిగిందని తెలిపారు. దేశ నిర్మాణంలో యువత, విద్యార్థుల పాత్ర కీలకమని, వారికి అన్ని విధాలుగా అండగా నిలవడమే కాంగ్రెస్ లక్ష్యమని బోధించారు. యువత భవిష్యత్తుకు బాటలు వేసేలా ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్ దొంగ అరెస్ట్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విలువైన మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుచున్న దొంగ ను టూ టౌన్ పోలీసులు అరెస్టు ఒక స్కూటీ, ఒక మోటార్ సైకిల్ స్వాధీనము చేసుకోవడం జరిగిందని టూ టౌన్ సిఐ ఆదిరెడ్డి తెలిపారు.శనివారం టూ టౌన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన మహమ్మద్ ఇస్మాయిల్ ఈనెల 4న నల్లగొండ ఆర్‌టిసి బస్ స్టాండ్ ముంధర హోండా షైన్ మోటార్ సైకిల్ దొంగతనానికి పాల్పడిన నేరస్థుడు శనివారం పానగల్ బైపాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నేరస్థుడు దొంగిలించిన మోటార్ సైకిల్ మీద వెల్లుచూ అనుమానాస్పదంగా కనిపించడంతో టు టౌన్ పోలీసులు పట్టుబడి చేయడం జరిగిందని తెలిపారు.ఈ నేరస్థుడు గతములో ఎల్ బి నగర్,జీడిమెట్ల,షాపూర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలలో మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో అరెస్టు అయ్యి చర్లపల్లి జైలుకు వెళ్ళి ఒక సంవత్సరము జైలు శిక్ష అనుభవించి రిలీస్ అయ్యి బయటకు వచ్చాడని తెలిపారు. నేరస్థుడు అతని దురలవాట్లకు బానిస కావడము వలన అతని పద్ధతి మార్చుకోలేక తిరిగి మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్టు వెల్లడించారు. అనంతరం ఇట్టి కేసును నల్లగొండ డివిస్పి కె శివరాం రెడ్డి పర్యవేక్షణలో టు టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే .అది రెడ్డి ఆద్వర్యంలో ఇట్టి నేరస్థుని పట్టుబడి చేసి మోటార్ సైకిళ్ళు రికవరీ చేసిన నల్లగొండ టౌన్ ఎస్ఐలు డీ.సైద బాబు, మానస వారి సిబ్బంది బాలకోటి,షకీల్, సైదులు, మహేశ్ లను జిల్లా ఎస్పి అభినందించారు.

# పోచంపల్లిని సందర్శించిన మిస్ ఆసియా రేష్మి ఠాకూర్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టుగా 'ఎక్స్పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమం కోసం శనివారం మిస్ ఆసియా రేష్మి ఠాకూర్ పోచంపల్లి సందర్శించారు. ఆమెతో పాటు మల్టీ నేషనల్ కంపెనీల ఉన్నత స్థాయి అధికారులు, ఫ్రాన్స్ క్యాన్సులేట్ ప్రతినిధులు వివిధ సాంఘిక మాధ్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలోని టూరి జం పార్క్ నందు సందర్శకులను సాంప్రదాయ బద్ధంగా ఇక్కత్ దారం మాలలతో తిలక ధారణతో స్వాగతం పలకడం జరిగింది. బృందాలుగా విభజించి స్థానిక గైడ్స్ ద్వారా ఇక్కత్ వస్త్రాల చరిత్ర, ఫ్రేమ్ మగ్గాలు, గుంత మగ్గాలను పరిచయం చేస్తూ వారికి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ గురించి వివరించడం తర్వాత నేత కార్మికుల ఇళ్లకు తీసుకెళ్లి క్షేత్ర స్థాయిలో వస్త్రాల తయారీ విధానాన్ని వారి జీవన స్థితిగతులను వివరించారు. అనంతరం శివారెడ్డి గూడెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వ్యవసాయ కూలీలతో ఆటపాటల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొత్తంగా ఈరోజు వచ్చిన సందర్శకులు ఈ పోచంపల్లి గ్రామ సందర్శన ఇక్కడి వస్త్రాల తయారీ విధానం ఇక్కడ భోజన విధానాలు ఇక్కడ సాంప్రదాయాలను తిలకిస్తూ హర్షం వ్యక్తం చేశారు. హ్యాండ్లూమ్ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు సిబ్బంది, టూరిజం కన్సల్టెన్సీ ప్రతినిధి సాహితీ, ఎన్ఐయూఎం ప్రతినిధి నిత్య పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం సహకార సంఘం అధ్యక్షులు భారత లవ కుమార్, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇకెవైసి తప్పనిసరి

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఇండియన్ గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన ఈ కేవైసి ప్రక్రీయను ఈనెల 16లోపు తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని నడిగూడెం శ్రీసాయిరమ్య ఇండియన్ గ్యాస్ మేనేజర్ చిల్లంచర్ల సత్యానారాయణ కోరారు. ఆధార్‌కార్డు, డిస్ట్రిబ్యూటర్ పాస్ పుస్తకం, గ్యాస్ కనెక్షన్ వివరాలతో ఇండియన్ గ్యాస్ కార్యాలయాన్ని సంప్రదించి ఈకేవైసి పూర్తి చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద ఇండియన్ ఆయిల్ వన్ యాప్ ద్వారా, డిస్ట్రిబ్యూటర్ వద్ద, డెలివరీ సిబ్బంది ద్వారా ఈకేవైసిని పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈకేవైసి చేయించుకోకపోతే వినియోగదారులు సిలిండర్లు పొందేందుకు అనర్హులు అవుతారని పేర్కొన్నారు.

## పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తనిఖీ



**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ జిల్లాలోని పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజారెడ్డి ఆకస్మికంగా శనివారం సందర్శించారు. వైద్య సేవలు, రికార్డులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను పర్యవేక్షించి, ఎఆర్‌వి, ఎఎస్‌వి వ్యాక్సిన్ల లభ్యత, నిల్వ విధానం, వినియోగాన్ని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని, సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం పైడిపల్లి పిహెచ్‌సి పరిధిలోని పైడిపల్లి సబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బెట్ రేస్ ఇమ్యునైజేషన్ సెషన్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పరిశీలించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించే దిశగా సమన్వయంతో పనిచేసి, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి డిఎంహెచ్‌ఒ డాక్టర్ రాజారెడ్డి సూచించారు.

## నీటి వనరుల సమర్ధ నిర్వాహణకు పటిష్ట కార్యాచరణ అమలు



**ప్రజాపక్షం/జనగామ :** నీటి వనరుల సమర్ధ నిర్వాహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రాధాన్యత క్రమంలో సాగు నీరు అందించాలని, గ్రామ సభల ద్వారా పంట మార్పిడిపై విస్తృత ప్రచారం కల్పించాలని, ఈ నెల 15 నుండి 25 వరకు రెండో విడత సాగునీరు విడుదల చేయాలన్నారు. జిల్లాలో సాగునీటి పరిస్థితులు, జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు, ప్రస్తుత ఖరీఫ్ సాగు, ఆయకట్టు, నీటి విడుదల ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆయా శాఖల అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, జిపిఒ లష్కర్, గ్రామ పోలీస్ సభ్యులుగా ఉండే ఈ కమిటీకి నీటిపారుదల శాఖ ఎఇ, డిఇఇ హెడ్‌గా వ్యవహరిస్తారన్నారు. నర్మెట, బచ్చన్నపేట, పాలకుర్తి, కొడకండ్ల, రఘునాథపల్లి, తరిగొప్పుల మండలాల్లో నీటి లభ్యత, సాగు పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఇ సీతారాం, డిఎఒ అంబికాసోని, అధికారులు, డిఇఇలు, ఎఇలు పాల్గొన్నారు.

## 10, 11, 12 తేదీల్లో ‘ప్రజా చైతన్య ప్రచార యాత్ర’

**ప్రజాపక్షం/జనగామ :** ఈ నెల 10,11,12 తేదీల్లో జరిగే ప్రజా చైతన్య ప్రచార యాత్రలను జయప్రదం చేయాలని సిపిఐ జనగామ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక, ఉద్యోగులు సృష్టించిన దేశ సంపదను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశ సంపదను అదానీ, అంబానీకి కట్టబెడుతూ పేదల్ని మరింత పేదలుగా తయారు చేస్తున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా పట్టించుకోవడం లేదన్నారు. బిజెపి తీరును ఎండగడుతూ సోమవారం నుండి జనగామ పట్టణంలోని 30 వార్డుల్లో ప్రజా చైతన్య ప్రచార యాత్ర నిర్వహిస్తున్నందున ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## షైన్ హైస్కూలులో వైభవంగా బోనాల పండుగ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను హనుమకొండ రాంనగర్‌లోని షైన్ హై స్కూల్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొనగా, పోతరాజులు, అమ్మవారి వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడగా, విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాంనగర్ స్టైల్ హై స్కూల్ నుండి భువనేశ్వరి మాత ఆలయం వరకు బోనాలు తలపై ఎత్తుకొని విద్యార్థులతో పాటు పాఠశాల ఆధ్యాపకులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రగతి రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం బోనాలు, బతుక మ్మ, సంక్రాంతి, వినాయక చవితి వంటి అన్ని ప్రధాన పండుగలను ఘ నంగా నిర్వహిస్తూ, వాటి చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్నామని తెలిపారు. పిల్లల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం పెంపొందించడమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

## గంజాయి, నేరాలపై అవగాహన



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జాఫర్‌గడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత (ఐపీఎస్) ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ రామారావు యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాబృందం సభ్యులు రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పాటలు, నాటికలు, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఏఎస్ఐ నాగమణి, పోలీస్ సిబ్బంది విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పూల్ సింగ్, హోంగార్డ్స్ శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి, కళాబృందం, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగు నీరు

దేవాదుల ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల ద్వారా పంపిణీ* ఈనెల 14నుండి 15 రోజుల పాటు నీటి విడుదల
స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం



**ప్రజాపక్షం/హనుమకొండ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని దేవాదుల రిజర్వాయర్ల ద్వారా పంటలకు ఈనెల 14నుండి సాగు నీరు విడుదల చేసి తీరుతామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ కుడి కాలువను నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎస్సి కాలనీ నుండి వెళ్తున్న పంట కాలువను, తూము వద్ద కాలువను, పలు కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పంట కాలువలో మురుగు నీరు చేరడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశా రు. మురుగు నీరు పంట కాలువలో చేరకుండా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పంటల కాలువకు రెండు వైపులా సైడ్ వాల్స్ నిర్మాణం చేసి చివరి వరకు సాగు నీరు వెళ్లే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం రెండు మూడు రోజులలో సాగు నీరు అందించేందుకు వెంటనే కాలువలో పూడికతీత, జంగల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. 3 నెలలలో శాశ్వత కెనాల్ నిర్మాణానికిసంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వెల్లడించారు. మున్సిపాలిటీ డ్రైనే జి నీరు పంట కాలువలలో చేరకుండా మున్సిపల్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో డ్రైనేజీలు, వరద కాలువలు, పంట కాలువల నిర్మాణం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 1.5 టిఎంసిల సామర్ధ్యంతో ఘనపూర్ రిజర్వాయర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఘనపూర్ రిజర్వాయర్ కింద సుమారు 2,500 ఎకరాల ఆ యకట్టుకు సాగు నీరు అందించాల్సి ఉందని కానీ కె నాల్స్ ఆధునికరించకపోవడం వల్ల పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదని తెలిపారు. రిజర్వాయర్ కింద ఉన్న 2,500 ఎకరాలకు సాగు నీరు అందాలంటే చివరి వరకు కెనాల్స్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన మురుగు నీరు పంట కాలువలలోకి రాకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇప్పటికే కొన్ని డ్రైనేజీలు, వరద కాలువలకు టెండర్లు పూర్తి అయ్యాయని ఇంకా ఎక్కడెక్కడ డ్రైనేజీ నీరు పంట కాలువలలో కలుస్తుందో అక్కడ డ్రైనేజీల రీడిజైన్ చేయాలని తెలిపారు. వచ్చే వర్షాకాలం వరకు పూర్తి స్థాయిలో కెనాల్స్ నిర్మాణం చేసి ఘనపూర్ రిజర్వాయర్ ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలే ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. దీంతో ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడుతూ, అధికారులను సమన్వయం చేస్తూ రైతులకు సాగు నీరు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే ఆగస్టు 14న నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్ల నుండి రైతులకు సాగు నీరు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 14నుండి 15రోజుల పాటు నీటి విడుదల జరుగుతుందని మరో 15రోజుల పాటు మళ్లీ రిజర్వాయర్లలో నీటిని నింపనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిరంతరాయంగా నీటి విడుదల సాధ్యం కాదని అందుకని ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీటి విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ ఆన్ అండ్ ఆఫ్ పద్ధతికి సహకరిస్తూ కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ తాటికొండ విజయ్ కుమార్, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈలు, డిఇలు, మున్సిపాలిటీ అధికారులు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, పట్టణ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ పెట్టుబడిదారీ వ్యవస్థకు గోరీ

సిపిఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** దేశంలో మోదీఅధికారంలోకి వచ్చి పేద ప్రజల వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శనివారం రోజున హసన్ పర్తి మండల కేంద్రానికి చేరుకున్న సిపిఐ ప్రచార జాతాలో హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి ముఖ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదాన్ని మోపుతూ ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. 200 లక్షల కోట్ల అప్పుచేసి దేశ సంపదను పెట్టుబడిదారీ వర్గానికి దోచిపెట్టడానికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత, కార్మిక వర్గం తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వికసిత భారత్ పేరుతో విభజన భారత్ ను తయారు చేస్తున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగాలు, రైతు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈనెల 14 వరకు జాతాలను కొనసాగించి సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మం దితో మహా ధర్నా నిర్వహించి మోదీ ప్రభుత్వాన్ని దిగి వచ్చేలా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాత కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి , జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి,బికేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, ఎన్ఏ స్టాలిన్, ఊ ట్కూరు రాములు కర్రే లక్ష్మ ణ్, మునిగాల బిక్షపతి, నాయకు లు రాజ్ కుమార్, షేక్ బాబు, లక్ష్మయ్య, ప్రవీణ్, మాదాసి బాబు, రాసమల్ల దీన, రాజమణి, మంగ, మమత పాల్గొన్నా రు.

## సాహిత్యంలో లెజెండ్ గద్దర్

హనుమకొండలో ఘనంగా వర్ధంతి సభ



**ప్రజాపక్షం/హనుమకొండ :** జనం సమస్యలకు జనం బాషను, జనం యాసను, భౌతికవాదాన్ని జోడించి సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప కవి, కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్యంలో లెజెండ్ అని జననాట్యమండలి నాయకుడు సంజీవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో గద్దర్ గళం ఆధ్వర్యంలో విసికె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన మాట్లాడారు.గద్దర్ అజ్ఞాతంలో ఉన్నపుడు అన్న కోసం మూడు సంవత్సరాలు ఆటో నడిపి గద్దరన్నను సాదుకున్నట్లు ఆవేదనతో మాట్లాడాడు. గౌరవ అతిథిగా విచ్చేసిన గద్దర్ గళం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ పాలకులు గద్దర్ పేరును మాత్రమే వాడుకుంటున్నాయని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని విమర్శించారు. గౌరవ అతిథి యశపాల్ మాట్లాడుతూ గద్దర్ పేరుతో ఒక సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. గద్దర్ విగ్రహాన్ని హన్మకొండలో ఏర్పాటు చేయాలని ప్రొ. తిరున హరి శేషు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎగ్గడి సుందర్ రామ్ స్వాగతం పలుకగా సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు రమక్క, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, డాక్టర్ మంద వీరస్వామి, తెలంగాణ శ్యాం, సీనియర్ న్యాయవాదులు పులి సత్యనారాయణ, రామస్వామి, షేక్ అబ్దుల్ నబీ, విలాసాగరం సురేందర్ గౌడ్, బండి మొగిలి, సారంగపాణి, రాచకొండ ప్రవీణ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు వలి ఉల్లా ఖాద్రీ, నున్న అప్పారావు, నరోత్తమ్ సూరీ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, కోండ్ర నరింగరావు, దూడల సాంబయ్య, సింగారపు అరుణ న్యాయవాదులు గురిమిల్ల రాజు, ప్రభంజన్, రాజేందర్, చెరిపెల్లి ఆనంద్, కామ్రేడ్ వివిధ సంఘాల నాయకులు గుమ్మడిరాజు సాంబయ్య, జనగాం కుమార స్వామి, కన్నం సునీల్, అంకేశ్వరపు రాంచందర్, శ్యాం, చారువాక, ఓంబ్రహ్మామ్, కళక్క, రాదక్క, మాదాసి సురేష్, కెదాసి మోహన్ సంఘి ఎలేందర్, కేడల ప్రసాద్, కన్నాల రవి, అంబాల అనిల్, బి.కె, మచ్చ దేవేందర్, గద్దర్ సాంబయ్య, యోచన, దార దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ధరలు తగ్గించడంలో విఫలమైన కేంద్రం

సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి మహేందర్



**ప్రజాపక్షం/తొర్రూరు :** వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్ర ప్రభు త్వం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నా రు. కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో మార్పు కావాలి అనే నినాదంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఈ నెల 6 నుంచి 14 వర కు జరిగే పాద యాత్ర ప్రచార జాత గోడ పత్రికలను తొర్రూరులో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించకపోవడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత లేక, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ విభజన, విద్వేష రాజకీయాలతో భారత రాజ్యాంగ మూల సూత్రాలకు తిలోదకాలు ఇచ్చే ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజా ఉద్యమాలతోనే బుద్ధి చెప్పాలని కోరారు. మార్పు కావా లి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన సెప్టెంబర్ 1 న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోసిపిఐ తొర్రూ రు మండల సహాయ కార్యదర్శులు పేరబోయిన కిరణ్‌కుమార్, ఘనపురం లక్ష్మ ణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, అమ్మాపురం గ్రామ శాఖ కార్యదర్శి బూరుగు యాదగిరి, కంఠాయపాలెం గ్రామ శాఖ కార్యదర్శి మందపురి శ్యామ్, హరిపిరాల, జీకె తండా గ్రామ శాఖ కార్యదర్శి వి.వెంకన్న, పసుల యాకయ్య పాల్గొన్నారు.

## ఫీజుల పారదర్శకతకు తొలి అడుగు

**ప్రజాపక్షం/ వరంగల్:** ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ని ర్ణయం స్వాగతించదగినదని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర అన్నారు. ఈసందర్భ ంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలపై ఎఐవైఎఫ్ కొనసాగిస్తున్న నిరంతర పోరాటాలు, ప్రజాస్వామ్యబద్ధమైన శాంతియుత ఉద్యమాల ఫలితంగా ఫీజుల పారదర్శకత దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ ని ర్ణయం తొలి అడుగుగా భావిస్తున్నామని వారు తె లిపారు. అయితే ఫీజుల వివరాలను ప్రదర్శించ డం మాత్రమే సరిపోదని, ప్రైవేట్ పాఠశాలలు ఇ ష్టానుసారంగా ఫీజులు పెంచకుండా ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని వారు డి మాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వ సూళ్లలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే వరకు, అధిక ఫీజుల భారం తగ్గే వరకు ఎఐవైఎఫ్ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి



**ప్రజాపక్షం/ నల్లబెల్లి :** కేంద్ర బిజెపి ప్రభుత్వం అవినీతిలో కోరుకుపోయిందని, నిరుద్యోగ, అధిక ధరల సమస్యలు పరిష్కారం చేయడంలేదనీ, సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి ఆరోపించారు . శనివారం నల్లబెల్లి మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజల సంపద లక్షల కోట్లు దేశం దాటించారనీ జాతీయ స్థాయిలో ప్రచారం చేసి అధికారంలోకి మోడీ బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిందన్నారు . పన్నెండేళ్ళలో ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయకపోగా, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదనీ చెప్పారు .మండల కేంద్రమైన నల్లబెల్లి సిపిఐ కార్యక్రమంలో సిపిఎం నల్లబెల్లి మండల కార్యదర్శి కడియాల మనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వామపక్ష పార్టీలైన సిపిఐ సిపిఎం ఎంసిపిఐ (యు) పార్టీల నాయకులు పాల్గొన్నారు . ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ లకు కారుచౌకగా అప్పగించడమే కాకుండా,దేశ ప్రజలపై 155 లక్షల కోట్లు అప్పు మోపి,ఖాళీగా ఉన్న పది లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు పద్ధతిన వ్యవస్థలను నడిపిస్తున్నారన్నారు.బాలాకోట్ ఘటనలు, పహెల్గాం ఘటనలు దేశ భద్రతను కాపాడటంలో మోదీ ప్రభుత్వ విఫలమవడాన్ని , ఆపరేషన్ సింధూర్ కొనసాగించకుండా ట్రంప్ చెప్పు చేతుల్లో మోదీఉంటూ దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టారన్నారు. అమెరికా ట్రేడ్ డీల్ స్వదేశీ రైతాంగాన్ని నట్టేట ముంచే విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ పిలుపులో భాగంగా ఆగస్టు 11 న మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద జరుగు ఆ ందోళనలో అందరూపాల్గొనాలన్నారు.ఈ కార్యక్రమంలో సి పిఐ నాయకులు మామిండ్ల పెద్ద ఐలయ్య, కనకం సాల్మన్, కొ నుకటిర మేష్ , నూటెంకి మొగిళి, సిపిఎం హన్మకొండ సం జీవ, మేర గుర్తు సారయ్య, ఎంసిపిఐ యు మండల కార్యదర్శి దామ సాంబయ్య, మార్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## జయశంకర్ పార్క్‌లో సకల వసతులు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రం సుభాష్ కాలనీలోని జయశంకర్ పార్క్ అభివృద్ధికి సింగరేణి సిఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసి అన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం లోని జయశంకర్ పార్క్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సింగరేణి జిఎం ఏ రాజేశ్వర్రెడ్డి తో కలిసి పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించే జయశంకర్ పార్క్ అభివృద్ధికి సింగరేణి సిఎస్‌ఆర్ నిధుల నుండి 50 లక్షలు వెచ్చించి పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జయశంకర్ పార్క్ అభివృద్ధి కోసం సింగరేణి సంస్థ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ నిధులతో పార్క్‌లో వాకింగ్ చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వాకింగ్ ట్రాక్, మౌలిక వసతులు, మరమ్మతులు, లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్క్ పరిసరాల్లో మెరుగైన లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, కార్మికులకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పార్క్ అభివృద్ధికి సహకరిస్తున్న సింగరేణి సంస్థ యాజమాన్యానికి, ఇంజినీరింగ్ అధికారులకు, వాకర్స్‌కు, స్థానిక ప్రజలకు, కార్మికులకు, ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలి

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య

**ప్రజాపక్షం/జనగామ :** కాంగ్రెస్ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటేనే కాంగ్రెస్ అభివృద్ధి సాధ్యమన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ కన్వెన్షన్‌లో జిల్లా కాంగ్రెస్ నూతన కమిటి ప్రమాన స్వీకారం జరిగింది. జిల్ల అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపి కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రూప్ రాజకీయాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేయాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని అందరు కష్టపడి పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలన్నారు. జనగామలో కాంగ్రెస్ జెండా ఎగరాలంటే ప్రస్తుతం పార్టీకోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో పనిచేసేలా ప్రోత్సహించాలన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసినప్పుడే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి మాట్లాడుతూ ఒక గిరిజ మహిళగా తనకు జిల్లా అధ్యక్షురాలుగా అవకాశం కల్పించాలని, గ్రూప్ రాజకీయాలకు తావులేకుండా పనిచేయాలన్నారు. యాదగిరిగుట్ల ట్రస్ట్ బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్ మాట్లాడుతూ జనగామలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు అందరి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. అనంతరం నూతనంగా నియమించబడిన జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కమిటి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ ఛైర్మన్ తాటికొండ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ లావణ్య శిరీష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమల్ల సత్యనారాయణరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు, డాక్టర్ సిహెచ్ రాజమౌళి, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, ఉడుత రవియా దవ్, డిసిసి వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

12

ప్రజాపక్షం

Telugu National Daily

కరీంనగర్

ఆదివారం

09-08-2026

www.prajapaksham.in


“ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని, ఎన్నికలకు ముందు దేశ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ప్రజాసంక్షేమం, సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఇందు లో ఏ ఒక్కటి కూడా అమలుపరచలేదు”





కరీంనగర్ జిల్లాలో..


హైదరాబాద్‌లో..


ఖమ్మం జిల్లాలో..


ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోనిలో..


మునుగోడు నియోజకవర్గంలో


నారాయణపేట జిల్లాలో..


భూర్గంపహాడ్ మండల కేంద్రంలో..


జహీరాబాద్ పట్టణంలో..


మహబూబాబాద్ జిల్లాలో..


జగిత్యాల జిల్లాలో..


మంచిర్యాల జిల్లాలో..


నాగర్‌కర్నూల్ జిల్లాలో..

# ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి సర్కార్

ప్రజాపక్షం / విలేకరుల బృందం

మూడు ధపాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగిస్తుందని ఈ విధానాలకు ప్రధాన కారణం ప్రధాని నరేంద్ర మోడీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతా శనివారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని అమ్మనగుర్తి , ఘన్‌పూర్, రాయికల్, ఆకునూరు, గొల్లగూడెం మీదుగా సర్దార్ సర్వాయి పాపన్న సర్వాయిపేట గడీల వరకు ఉత్సాహపూరితంగా సాగింది. అనంతరం చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో పర్యటించింది. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. జాతాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని, ఎన్నికలకు ముందు దేశ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ప్రజాసంక్షేమం, సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఇందులో ఏ ఒక్కటి కూడా అమలుపరచలేదని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తుందని హక్కులను, చట్టాలను పరిరక్షించుకోవాలని స్వయంగా సుప్రీంకోర్టు చెప్పినవిధంగా సమాన పనికి సమాన వేతనం కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. జాతాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జాతా కోఆర్డినేటర్‌లు గూడెం లక్ష్మి , కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్నస్వామి, తేరాల సత్యనారాయణ, ముద్రకోల రాజయ్య, మావురపు రాజు, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, బీర్ల పద్మ, కొట్టె అంజలి, రంజిత్, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### మోహన్ భగవత్ కపట నీతిని జెన్–జీలు పసిగట్టారు : ఇటి.నరసింహ్మ

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడంలో విఫలమైన కేంద్ర బిజెపి ప్రభుత్వం యువత నుంచి వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకునేందుకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను రంగంలోకి దించిందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ విమర్శించారు. నష్ట నివారణ చర్యల్లో భాగంగానే జెన్‌జీలతో ఆర్ఎస్ఎస్ సమావేశాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్‌లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. నాగోల్‌లోని సుజాత హోటల్ నుంచి ‘బద్లావ్ జరూరీ హై’ నినాదంతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ పాదయాత్రగా నాగోల్ చౌరస్తా, అల్కాపురి కాలనీ, సాయినగర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎర్రజెండాలు చేతబట్టి, ప్రజానాట్యమండలి కళాకారుల డప్పుల చప్పుళ్ల మధ్య పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఇటి.నరసింహ మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద యువత ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో వారిపై విదేశీ నిధులతో కుట్రలు చేస్తున్నారంటూ, పాలకవర్గాలను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పలు రకాల ప్రచారాలు చేశారని అన్నారు. ఉద్యమించిన యువతను దేశద్రోహులుగా ముద్రవేసి తప్పుడు ప్రచారాలు చేసిన ఆర్ఎస్ఎస్, ఇప్పుడు అదే జెన్‌జీ యువత దేశం కోసం పనిచేస్తున్నారని, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని బిజెపికి హితబోధ చేయడం కపట రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, ఏరియా నాయకులు షాహిదా బేగం, కొమ్ము యాదయ్య, మహేందర్, కె. రాములు, శ్రీనివాస్, సేవ్యా, లక్ష్మి , హేమలత, అండాలు, రాజగౌడ్ లతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

### పతనం అంచున దేశ ఆర్థిక వ్యవస్థ : బాగం

దశాబ్ద కాలంగా మోదీ అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పతనం అంచుకు చేరిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థ ప్రచారం వెనుక కార్పొరేట్ల ప్రయోజనం దాగుందని ఆయన ఆరోపించారు. శనివారం చింతకాని మండలంలో పలు గ్రామాల్లో యాత్ర నిర్వహించారు. చిన్నమండవ గ్రామంలో ప్రారంభమైన యాత్ర సీతంపేట, నాగులవంచ, పాతర్లపాడు, ప్రొద్దుటూరు, నాగిలిగొండ, కోమట్లగూ డెం, నేరడ, చింతకాని, అనంతసాగర్, రామకృష్ణాపురం, బస్వాపురం, రాఘవాపురం, కొదుమూరు, వందనం గ్రామలలో సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలలో హేమంతరావు మాట్లాడుతూ రాముడి పేరుతో ప్రజలను వంచిస్తు న్న మోదీ తనను విమర్శించే వారిని దేశ ద్రోహులుగా చూపుతున్నారని హేమంతరావు ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా 400లకు పైగా హామీలు ఇచ్చి కేవలం నాలుగైదు హామీలు అమలు చేసి చేతులు దులుపుకుంటారా ప్రశ్నించారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహా య కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించగా పలు గ్రామాలలో యాత్రకు సిపి ఎం, బిఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ యాత్రలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జా నిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గో విందరావు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి , మిడికంటి చిన్నవెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, ఏనుగు గాంధీ, కూచిపూడి రవి, యంగల ఆనందరావు, సిపిఐ మం డల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి పాలనకు పతనం తథ్యం : విఎస్ బోస్

కేంద్రంలోని బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, మోడి ప్రభుత్వం గత పదేళ్లుగా కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే వారి పతనానికి దారి తీస్తుందని, దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ అన్నారు. శనివారం సిపిఐ ప్రచార యాత్ర మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్‌బి కాలనీ డివిజన్ ఇంద్రనగర్, నవోదయనగర్, బక్షిగూడలోని పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో స్థానికులు ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్ రెడ్డి, ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు స్వామిదాస్, జాన్, శ్రీనివాస్, జమిలయ్య, ఐలయ్య, ఎల్లయ్య, యాకూబ్, సుధాకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల కార్యదర్శి మహేష్‌కుమార్, భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### మోదీ పాలనపై ప్రజా పోరాటం : నెల్లికంటి సత్యం

మునుగోడు నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కారణంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, పునరావాస చర్యలు చేపట్టి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా సిపిఐ కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా పనులను కొనసాగించడం సరికాదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన జాతలు మునుగోడు నియోజకవర్గంలో మూడో రోజుకు చేరుకున్నాయి. మండలంలోని శివన్నగూడ, కుదాబాక్స్‌పల్లి, అజిలాపురం, తిరుగండ్లపల్లి, తమ్మడపల్లి, ఎరుగండ్లపల్లి, కొండూరు, మర్రిగూడ, వట్టిపల్లి, రాంరెడ్డిపల్లి, లెంకలపల్లి, సారంపేట, ఇందుర్తి, కొట్టాల తదితర గ్రామాల్లో సిపిఐ నాయకులు పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల భిక్షంరెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,కార్యవర్గ సభ్యులు ఎరుకలి నిరంజన్,జక్కల అంజయ్య,గోని వెంకటయ్య,వేముల సత్తయ్య, కల్లెట్ల లింగయ్య సత్యం,కొట్టం యాదయ్య,జిల్లా బాలకృష్ణ, నరసింహ, ఎర్జాల మహేందర్, పున్నం లక్ష్మయ్య, చిలివేరు రామచంద్రం,జాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బాల నరసింహ్మ ధ్వజం

బదలావ్ జరూరీ మై నినాదంతో సిపిఐ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కోస్గి నుంచి నారాయణపేట అంబేద్కర్ చౌక్ వరకు సాగిన పాదయాత్రలో సిపిఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎర్రజెండాలతో కదం తొక్కారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నాయకులు నినాదాలు చేశారు. కోస్గిలో ప్రారంభమైన పాదయాత్రను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ ఎం.బాల నరసింహ ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. కోస్గి నుంచి ప్రారంభమైన పాదయాత్ర నారాయణపేట అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సి.శ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఎం.డి.మహమ్మద్, కొడంగల్ మండల కార్యదర్శి శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

### హామీలు అమలు చేయకుంటే పోరాటం తప్పదు సాబీర్ పాషా

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. ప్రజాచైతన్య యాత్రల్లో భూర్గంపహాడ్ మండల కేంద్రంలో 3వ రోజు యాత్ర ఆ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమై లక్ష్మీ దేవిపల్లి మండలం రేగళ్లలో ముగిసింది. ఈ సందర్భంగా తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగారం, పాల్వంచ, కిన్నెరసాని, ఉల్వనూరు మీదుగా సాగింది. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో ఈ ప్రాంతం మునకకు గురి అవుతోందని శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.“బద్లావ్ జరూరి హై” నినాదంతో సాగుతున్న యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసా ద్, సర్ రెడ్డి పుల్లారెడ్డి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మున్నా లక్ష్మీకుమారి, కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, ఎస్‌కె. ఫహీం, మువ్వ వెంకటేశ్వర్లు, భూక్యా దసురు, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరా వు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యా మల, గొర్రె అన్నపూర్ణ, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలంతా సంఘటితం కావాలి : సయ్యద్ జలాలుద్దీన్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తు న్న ప్రజావ్యతిరేఖ విధానాలకు వ్యతిరేఖంగా ప్రజలంతా సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ పిలుపు నిచ్చారు. శనివారం సిపిఐ ప్రచార యాత్ర జహీరాబాద్ పట్టణంలోని వెంకటరమణ కాలనీలో సిపిఐ బృందం పాదయాత్ర చేసి కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు, సిపిఐ నాయకులు అఫ్జన్, అశ్వక్, అశోక్, హుస్సేన్, వినయ్, గౌసోద్దీన్ ,వెంక ట్, రాములు, ఇస్మాయిల్, మహిళా నాయకులురాల్లు శోభన, సంగమ్మ, తుల్జమ్మ, అనసూయమ్మ, తేజమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన మోదీ ప్రభుత్వం : విజయ సారథి

ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి రాజ్యాంగ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నమోడీ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. డోర్నకల్ మండల కేంద్రం రైల్వే స్టేషన్ సెంటర్లో సిపిఐ పాదయా త్ర ప్రచార యాత్రలను జిల్లా కార్యదర్శి బివిజయ సారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. డోర్నకల్ పట్టణము నుండి పాదయాత్రగా సిపిఐ బృందం, ఉయ్యాలవాడ, వెన్నారం, బూరుగుపాడు గొల్లచర్ల గ్రామం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి తురక రమేష్, పట్టణ కార్యదర్శి, పట్టణ కార్యదర్శి ఎల్లావుల నరసింహారావు,కె ప్రబెష్, ప్రభాకర్, బుర్ర సమ్మ య్య, తురక రమేష్, కలగూర నాగరాజు,రేపాకుల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

### ధరల పెరుగుదల తక్షణమే అరికట్టాలి : చెన్న విశ్వనాథం


బద్లావ్ జరూరి హై..మార్పు కావాలి అని కోరుతూ జగిత్యాల జిల్లా సిపిఐ ఆధ్వర్యంలో మెడిపెల్లి, భీమారం మండలాల్లో నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్, రంగపూర్, భీమారం, మెడిపెల్లి, పొరుమల్ల తదితర గ్రామాల్లో సిపిఐ నాయకులు ఇంటింటికి వెళ్లి బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై ముద్రించిన కరపత్రాలు పం పిణీ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి విశ్వనాథం మాట్లాడుతూ ధరల పేగుదలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు కొక్కుల శాంత, ఎన్నం రాధ, నాయకు లు మోనుగూరి హన్మంతు, చెరుకూరి రాజేశం, గంగరాజం, రాజయ్య, లక్ష్మ ణ్ తదితరులు ఉన్నారు.

### కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు : రామడుగు లక్ష్మ ణ్

కేంద్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్రవర్గ సభ్యులు రామడుగు లక్ష్మ ణ్ విమర్శించారు. శనివారం మంచిర్యాల జిల్లా కేతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో మూడో రోజు పాదయాత్ర నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్ జెండా ఊపి యాత్రను ప్రారంభించగా.. తారకరామ కాలనీ, జ్యోతినగర్, తిలక్ నగర్, పోచమ్మ బస్తీ, రైల్వేస్టేషన్ రోడ్, భగత్ సింగ్ నగర్, గంగా కాలనీ, హనుమాన్ నగర్, జవహర్ నగర్, శివాజీ నగర్ మీదుగా సిపిఐ కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, చెన్నూరు నియోజకవర్గ నాయకులు మిట్టపల్లి పౌలు, మండల కార్యదర్శి మనం సత్యం, జిల్లా సమితి సభ్యులు కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, మామిడి గోపి, నక్క వెంకటస్వామి, వార్డ్ కౌన్సిలర్ కౌడగాని సాంబయ్య, నాయకులు రాయబారపు వెంకన్న, కెమెరా దుర్గారాజు, బండారి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పాదయాత్ర : ఫయాజ్

ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసమే సిపిఐ పాదయాత్ర చేపట్టామని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. శనివారం పాదయాత్ర దేదినేనిపల్లి నుంచి చిన్నా కార్పాముల, చిన్న కొత్తపల్లి, జగన్నాథపురం, పాతయాపట్ల, కొత్త యాపట్ల మీదుగా చంద్రబండ తండా చేరుకుని మారేడు మాన్‌దిన్నె గ్రామంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తుమ్మల శివుడు, బండి లక్ష్మీ పతి, జి.కురుమయ్య, కిరణ్‌కుమార్, జిల్లా నాయకులు లక్ష్మీ నారా యణ, సాయిలు, సలేశ్వరం, పటేల్ రాముడు, ప్రకాష్, బాలపీరు, రాధాకృష్ణ, విష్ణు గలేన్న, సంఘం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## స్వతంత్రంగా వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

‘ఇరాన్‌పై అమెరికా యుద్ధం భారత్‌పై ప్రభావం’ అనే అంశంపై ఇస్కఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యిద్ అజీజ్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, మంగోలియా మాజీ భారత రాయబారి టి.సురేష్, ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహరి, రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి ఆర్. గోపాల్, ఉపాధ్యక్షులు పి.వి. దుర్గ ప్రసాద్, కోశాధికారి ఎ.విజయలక్ష్మి , హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అమెరికా ప్రపంచవ్యాప్తంగా తన ఆధిపత్యాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తోందని, భారత విదేశాంగ విధానంలో అమెరికాతో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఆందోళనకరమని అన్నారు. అమెరికా నుంచి భారత విద్యార్థులను సంకెళ్లతో వెనక్కి పంపిన ఘటనలపై కూడా కేంద్ర ప్రభుత్వం గట్టిగా ప్రశ్నించకపోవడం సరికాదన్నా రు. దేశంలో మతం, జాతి, దేశం పేరుతో ప్రజలను విభజించే ధోరణులు పెరుగుతున్నాయని కూనంనేని విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సార్వభౌమత్వ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇస్కఫ్ వంటి ప్రజా సంఘాలు మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అట్టడుగు వర్గాలు, సామాన్య ప్రజల సమస్యలపై ప్రజల గొంతుకగా నిలవాలని సూచించారు.




### పశ్చిమాసియా భారత్‌కు కీలకం:ప్రొ.కె. నాగేశ్వర్

పశ్చిమాసియాలో మారుతున్న రాజకీయ, భద్రతా పరిణామాల నేపథ్యంలో భారత్ సమతుల్యమైన, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగించాలని కె.నాగేశ్వర్ సూచించారు. పశ్చిమాసియా భారత్ ఆర్థిక, ఇంధన, భద్రతా ప్రయోజనాలకు అత్యంత కీలకమైన ప్రాంతమన్నారు. ఈ ప్రాంతంలో పని చేస్తున్న భారతీయులు పంపే రెమిటెన్సులు దేశ ఆర్థిక వ్య వస్థకు ముఖ్యమైన మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. చమురు, సహజవాయువు వంటి ఇంధన వనరుల దిగుమతుల్లో పశ్చిమాసియా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అమెరికాఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాల నేపథ్యంలో భారత్ తన సంప్రదాయ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కోల్పోతోందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో భారత్ స్పందించిన తీరుపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని మరింత బలోపేతం చేసుకోవాలని అన్నారు.

### ప్రపంచ శాంతే ఇస్కఫ్ లక్ష్యం:సయ్యిద్ అజీజ్ పాషా

సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ వివిధ దేశాలతో సాంస్కృతిక, సామాజిక సంబంధాలను బలోపేతం చేయడం, కళ లు, సాహిత్యం, సాంస్కృతిక విలువలను పరస్పరం పంచుకోవడం, ప్రపంచ శాంతి, సద్భావన, సమైక్యత కోసం ప్రజలను ఐక్యం చేయడమే ఇస్కఫ్ లక్ష్యమన్నారు. ఇస్కఫ్ జాతీయ ప్ర ధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పదిహరి మాట్లాడుతూ 1944లో ముంబైలో ప్రారంభమైన ఇస్కఫ్ భారత్, ఇతర దేశా ల మధ్య సాంస్కృతిక బంధాలు, స్నేహభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న ప్రముఖ ప్రజా సంఘమని తెలిపారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com